అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 22-01-2023 సమగ్ర తెలుగు దినపత్రిక www.navatelangana.com

సంపుటి : 9 | సంచిక : 21 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 10 పేజీలు + సోపతి (వెబ్‌లో) | వెల : 8.00



నా తండ్రి వారసత్వాన్ని నాశనం చేసేందుకే..

ఆర్ఎస్ఎస్-బీజేపీ చర్యలపై నేతాజీ కుమార్తె అనితా బోస్

- రెండు ధ్రువాలు ఎన్నటికీ కలవబోవని వ్యాఖ్య

కోల్‌కతా : ప్రముఖ భారత స్వాతంత్ర్య సమరయోధులు సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలను జరపడానికి ఆరెస్సెస్ ప్రయత్నిస్తున్న తరుణంలో.. సుభాష్ చంద్రబోస్ కూతురు అనిత బోస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సుభాష్ చంద్రబోస్ ఒక వామపక్షవాది అన్నారు.

ఆయన వైఖరిని బీజేపీ, ఆరెస్సెస్‌లు ప్రతిబింబించవని తెలిపారు. తన తండ్రి వారసత్వాన్ని దోచుకునేందుకు, నాశనం చేసేందుకు ప్రయత్నం జరుగుతున్నదని వివరించారు. ఆరెస్సెస్ భావజాలం, జాతీయవాద నాయకుడి లౌకికవాదం, సమగ్రత ఆలోచన ధ్రువాలు వేరుగా ఉంటాయనీ, అవి కలవబోవని స్పష్టం చేశారు. భావజాలం విషయానికొస్తే, దేశంలోని ఇతర పార్టీల కంటే కాంగ్రెస్‌కు నేతాజీతో చాలా సారూప్యతలున్నాయన్నారు. నేతాజీ బోధించినట్టుగా అన్ని మతాలను గౌరవించాలనే ఆలోచనను బీజేపీ, ఆరెస్సెస్‌లు ప్రతిబింబించడం లేదని తెలిపారు.

సుభాష్ చంద్రబోస్ జన్మదిన వేడుకలను జరుపుతూ ఆయనను తమ భావజాలం కలవాడిగా ప్రచారం చేసుకోవడానికి బీజేపీ ఎన్నో ప్రయత్నాలను చేస్తున్నది. దీంతో సుభాష్ చంద్రబోస్ కూతురు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.



ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

అగర్తలలో భారీ ర్యాలీ

- పాల్గొన్న వామపక్ష, కాంగ్రెస్ నాయకులు

న్యూఢిల్లీ : అసెంబ్లీ ఎన్నికలు శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించాలని త్రిపురలో లౌకిక, ప్రజాస్వామ్య పార్టీలు పిలుపునిచ్చాయి. శనివారం అగర్తలాలో చేపట్టిన ర్యాలీలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీపీఐ(ఎం), కాంగ్రెస్ నాయకుల నేతృత్వంలో చేపట్టిన ఈ ర్యాలీలో పాల్గొన్న పౌరులు 'నా ఓటు, నా హక్కు' నినాదాలు చేశారు. త్వరలో జరగే ఎన్నికల్లో ఓటు హక్కును పరిరక్షించాలనీ, స్వేచ్ఛగా, శాంతియుతంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని వామపక్ష, కాంగ్రెస్ నాయకులు కోరారు. త్రిపుర మాజీ సీఎం మాణిక్ సర్కార్, మాజీ సీఎం సమీర్ రంజన్ బర్మన్, కాంగ్రెస్ నాయకులు అజయ్ కుమార్ తదితరులు ...5లో

సగం సగం..



విద్య, వైద్యంపై తగ్గుతోన్న కేంద్ర వ్యయం

- 8ఏండ్లుగా జీడీపీలో 1.4శాతం దాటలేదు : రాజకీయ విశ్లేషకులు
- ఉన్నత విద్యలో నిధుల పెరుగుదల ఏటా 0.035 శాతం
- ఆయుష్మాన్ భారత్‌కు కేటాయింపు రూ.6400కోట్లు
- వాస్తవ వ్యయం రూ.3199కోట్లు
- సామాజిక సంక్షేమానికి అరకొర నిధులు

న్యూఢిల్లీ : ఒక దేశం సమగ్ర అభివృద్ధితో ముందుకు వెళ్లాలంటే ఆ దేశ కేంద్ర బడ్జెట్ అత్యంత కీలకం. ఈ బడ్జెట్‌ను దృష్టిలో పెట్టుకొనే రాష్ట్రాలు తమ తమ బడ్జెట్‌కు రూపకల్పన చేస్తాయి. ఫిబ్రవరి 1, 2023న మోడీ సర్కార్ 2023-24 కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. 2024 సార్వత్రిక ఎన్నికలకు సిద్ధమవుతున్న మోడీ సర్కార్, ఈసారి బడ్జెట్‌లో పేర్కొనే అంశాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. మరోవైపు గత బడ్జెట్‌కు సంబంధించి అంచనాలు, సవరింపులు, వాస్తవ గణాంకాలు బయటకు రాబోతున్నాయి. అయితే, గత 8 ఏండ్లుగా అభివృద్ధి, సంక్షేమంపై మోడీ సర్కార్ వ్యయం అరకొరగా ఉందనీ, ఇప్పుడున్న అవసరాలకు కేటాయింపులు సరిపోవని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. బడ్జెట్ కాగితాల్లో పేర్కొనే మొత్తాలకు..వాస్తవ వ్యయానికి చాలా తేడా ఉంటున్నదన్న విమర్శలున్నాయి. ఉదాహరణకు గత బడ్జెట్‌లో ఉపాధి హామీ (నరేగా) పథకానికి కేటాయింపులు భారీగా చూపారు. కానీ ప్రతి రాష్ట్రంలో ఉపాధి హామీ కార్మికులకు పెద్ద మొత్తంలో వేతన బకాయిలు పేరుకుపోయాయి.

రెవెన్యూ ఆదాయం గతకొన్నేండ్లుగా తగ్గుతూ వస్తోంది. పెట్టుబడి వ్యయంపై కేంద్రం చెబుతున్న లక్ష్యాలు చేరాలంటే రెవెన్యూ ఆదాయం 65శాతం పెరగాల్సి ఉంది. 2021, 22లోనూ ద్రవ్యలోటు పెద్ద ఎత్తున కనపడింది. ఈ ఏడాది మరింత పెరిగి ఉంటుందని సమాచారం. ఉచిత రేషన్ ద్వారా పేదలు పొందుతున్న లబ్దికన్నా, పన్ను మినహాయింపులు, ఇతర ప్రయోజనాలతో దేశంలోని బడా కార్పొరేట్లకు కేంద్రం నుంచి దక్కుతున్నది ఎన్నో రెట్లు ఉందన్న విమర్శలున్నాయి.



ఆరోగ్యం, విద్య

దాదాపు 8ఏండ్లుగా ప్రజా ఆరోగ్యం, విద్యపై కేంద్రం అశ్రద్ధ చేస్తున్నది. మౌలిక వసతుల కల్పన, సిబ్బంది నియామకం అంతా అటకెక్కింది. దేశ జీడీపీలో నిధుల వ్యయం కేవలం 1.4శాతానికి పరిమితమైంది. కోవిడ్-19 సంక్షోభ సమయంలో వైద్యంపై చేసిన ఖర్చును పరిగణనలోకి తీసుకున్నా జీడీపీలో ఆరోగ్యం వాటా 2శాతం దాటడం లేదు. ఆరోగ్యం, విద్య రాష్ట్ర జాబితాలోని అంశమంటూ కేంద్రం తప్పించుకుంటున్నది. 2014-15 ఆర్థిక సంవత్సరం నుంచి ప్రజా ఆరోగ్యంపై వ్యయం తగ్గుతూ వస్తోంది. మూడేండ్లుగా కోవిడ్ సంక్షోభంతో రాష్ట్రాల ఆదాయాలు దెబ్బతిన్నాయి. అయినప్పటికీ ఆయా రాష్ట్రాల్లో ప్రజా ఆరోగ్యంపై రాష్ట్రాల వ్యయం గణనీయంగా పెరిగింది. జీఎస్‌డీపీలో 7శాతం కేరళ ఖర్చు చేయగా, ఢిల్లీ 11శాతం ఖర్చు చేసింది. రాష్ట్రాల సగటు జీఎస్‌డీపీ 5శాతంపైనే ఉంది.

ఉన్నత విద్యారంగంలో కేంద్ర వ్యయం నామమాత్రం. బడ్జెట్ వ్యయంలో పెరుగుదల ప్రతిఏటా 0.035 శాతం. యువత జనాభా, విద్యార్థుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుంటే ఉన్నత విద్యపై కేంద్ర వ్యయం ఏమాత్రమూ సరిపోదని విశ్లేషకులు చెబుతున్నారు. సుదీర్ఘకాలంగా నిధుల వ్యయం అరకొరగా ఉందని వారు ...5లో

ఫిబ్రవరి 3 నుంచి అసెంబ్లీ సమావేశాలు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వచ్చే నెల మూడు నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. అందుకు సంబంధించిన షెడ్యూల్ ఫిబ్రవరి రెండో తేదీన ఖరారు కానుంది. ఆనెల నాలుగున బడ్జెట్ ప్రవేశ పెట్టే అవకాశం ఉందని తెలిసింది. ఈమేరకు శనివారం అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి నరసింహాచార్యులు ఒక ప్రకటన విడుదల చేశారు. అసెంబ్లీ, మండలి సమావేశాలపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సమాచారం అందించారు. రాష్ట్ర బడ్జెట్ 2023-24 ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి కేసీఆర్ శనివారం మధ్యాహ్నం సమీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సమావేశానికి ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావుతోపాటు ఆ శాఖ అధికారులు హాజరయ్యారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర బడ్జెట్ రూ.2.85 లక్షల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్ల వరకు ఉండొచ్చుని ఆర్థిక శాఖ వర్గాలు అంచనా వేస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇది ఎన్నికల ఏడాది కావడంతో అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి బడ్జెట్ రూపొందించాలని సర్కారు నిర్ణయించింది. అయితే గతేడాది బడ్జెట్ సమావేశాలను మార్చి ఏడో తేదీ నుంచి నిర్వహించగా ఈసారి నెల ముందే జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఎన్ని రోజులు నిర్వహించాలన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదు. మరోవైపు ఫిబ్రవరి ఒకటిన కేంద్రం కూడా 2023-24 బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టనుంది. దాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం రాష్ట్ర బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టేందుకు సర్కారు భావిస్తున్నది. 2022-23 సంవత్సరానికి రూ.2,56,958 కోట్ల బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 2023-24 బడ్జెట్ ప్రతిపాదనలను ఆహ్వానిస్తున్నట్టు ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి రామకష్ణారావు ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని శాఖలు ఈ నెల 13వ తేదీలోపు తమకు ప్రతిపాదనలు పంపాలనీ, అయితే 12వ తేదీలోపే ముఖ్య కార్యదర్శులకు చేరాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా ఇప్పటికే అమల్లో ఉన్న పథకాలతోపాటు 2022-23 బడ్జెట్‌లో దళితబంధు కోసం కేటాయించిన నిధులను వినియోగించకపోవడం, ఆ పథకం రెండో విడత ప్రారంభం కాకపోవడం, గిరిజన బంధు కూడా ...5లో



మోడీ ప్రభుత్వంపై కాంగ్రెస్ చార్జిషీట్

'హాథ్ సే హాథ్ జోడో అభియాన్' ప్రచార లోగో విడుదల

న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వంపై కాంగ్రెస్ చార్జిషీటు విడుదల చేసింది. రాహుల్ గాంధీ సారథ్యంలో గత ఏడాది సెప్టెంబర్ 7న మొదలై జనవరి 30తో ముగియనున్న 'భారత్ జోడో యాత్ర' సందేశాన్ని ఇంటింటికి చేరవేసేందుకు ...5లో

నాన్న విప్లవ స్ఫూర్తితో..

నేడు హైదరాబాద్‌కు 'చే' కుమార్తె డాక్టర్ అలైదా గువేరా

- ఆమెతోపాటు మనవరాలు ప్రొఫెసర్ ఎస్తేఫానియా గువేరా
- ఘన స్వాగతం పలకనున్న ఎన్‌సీఎస్‌సీ-ఐప్సో
- రవీంద్రభారతిలో క్యూబా సంఘీభావ సభ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రపంచ విప్లవ యోధుడు చే గువేరా.. పీడితులు, తాడితుల పక్షాన అవిశ్రాంతంగా పోరాడి... అమెరికా సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించిన మహోన్నత నేత. 'సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిద్దాం.. ప్రపంచ శాంతిని కాపాడుకుందాం...' అంటూ ఆయన ఇచ్చిన సందేశం నాటికీ, నేటికీ.. ఏనాటికీ అనుసరణీయం. ఆ సందేశంతోపాటు 'చే' చూపిన పోరాట మార్గాన్ని, దాని స్ఫూర్తిని నరనరాన నింపుకున్నారు ఆయన కుమార్తె డాక్టర్ అలైదా గువేరా. తన ఏడో ఏటనే సామ్రాజ్యవాదులు నాన్నను పొట్టనబెట్టుకున్నా... అమ్మ పెంపకంలో, క్యూబా మాజీ అధ్యక్షుడు ఫెడల్ కాస్ట్రో దిశా నిర్దేశనంలో స్వతంత్ర భావాలతో పెరిగి విద్యార్థి, యువజనోద్యమాలతో రాటుదేలిన ఆమె... ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ ప్రస్తుతం భారతదేశంలో పర్యటిస్తున్నారు. అందులో భాగంగా ఆమె ఆదివారం హైదరాబాద్‌కు విచ్చేయనున్నారు. నేషనల్ కమిటీ ఫర్ సాలిడారిటీ విత్ క్యూబా (ఎన్‌సీఎస్‌సీ)-ఐప్సో సంయుక్తాధ్వర్యంలో అలైదాకు ఘన స్వాగతం పలకనున్నారు. ఆమెతోపాటు ఆమె కుమార్తె, 'చే' మనవరాలు ప్రొఫెసర్ ఎస్తేఫానియా గువేరా ...5లో

మా అమ్మానాన్నలను ఒకే జిల్లాకు పంపండి

సీఎం కేసీఆర్‌కు పిల్లల వేడుకోలు

- పాఠశాల విద్యాశాఖ కార్యాలయం వద్ద ఉద్రిక్తత
- పోలీసుల అమానుషం
- చిన్నారులు, టీచర్లను అరెస్టు చేసిన ఖాకీలు
- 13 జిల్లాల్లో స్పౌజ్ బదిలీలు చేపట్టాల్సిందే
- న్యాయం జరిగే వరకూ పోరాటం
- ఉపాధ్యాయ దంపతుల మౌన దీక్ష



వివరాలు 2లో..



పత్తి ధర ఢమాల్..

అంతర్జాతీయ మార్కెట్‌లో తగ్గిన డిమాండ్

- పడిపోయిన ఎగుమతులు
- దిగుమతులపై సుంకం భారం
- మద్దతు ధర రూ.12 వేలు ఇవ్వాలంటూ రైతుల డిమాండ్
- జాడ లేని సీసీఐ
- నడవని జిన్నింగ్ మిల్లులు
- క్వింటాల్ ధర రూ.8 వేలు మించట్లే..
- అధిక వర్షాల వల్ల తగ్గిన పంట దిగుబడి



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

పత్తి ధర ఒక్కసారే ఢమాల్ అని పడిపోయింది. అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ తగ్గడం, కేంద్ర ప్రభుత్వం పత్తికి మద్దతు ధర పెంచకపోవడం వంటి కారణాల వల్ల ప్రస్తుతం పత్తికి ధర పలకట్లేదు. గతేడాది వచ్చిన ధరలో సగం కూడా రాకపోయే సరికి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక పక్క అధిక వర్షాల వల్ల పంట నష్టమేర్పడి దిగుబడులు తగ్గితే.. చేతికొచ్చిన పత్తికి కనీస ధర రాకపోయే సరికి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ధర పెంపు, సీసీఐ కొనుగోళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. ఎప్పటికైనా ధర పెరగకపోదా అన్న ఆశతో పత్తిని ఇండ్లల్లోనే నిల్వ చేసుకున్నారు. రూ.12 వేల మద్దతు ప్రకటించి సీసీఐ ద్వారా కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో 502000 ఎకరాల్లో పత్తి సాగైంది. సంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా 3.44 లక్షల ఎకరాలు, మెదక్ జిల్లాలో 48 వేల ఎకరాలు, సిద్దిపేట జిల్లాలో 1.10 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సగటున 30 లక్షల క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. రెండేండ్లుగా వరి పంటను తగ్గించి వర్షాధారిత పంటలైన పత్తి సాగు పెంచాలని అధికారులు అవగాహన కల్పించడం, గతేడాది పత్తికి మంచి ధర రావడంతో ఈ ఏడాదిలో సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో పత్తి సాగు బాగా పెరిగింది. అయితే, సాగు సీజన్ మొదటి నుంచి పూత, కాత దశ వరకు భారీ వర్షాలు, వరదల వల్ల పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. వచ్చిన దిగుబడికి కనీస ధర లభించకపోవడంతో రైతులు మరింత నష్టపోతున్నారు. పత్తి సీజన్ మొదట్లో ధర కొంత బాగానే ఉన్నప్పటికీ.. ఆ తర్వాత ధర తగ్గుతూ వచ్చింది. సీసీఐ కొనుగోలు చేయకపోవడంతో జిన్నింగ్ మిల్లులు, వ్యాపారులు సైతం తక్కువ ధరకే కొనుగోలు చేస్తుండటం వల్ల రైతులు పత్తిని అమ్ముకోలేక ఇండ్లల్లో నిల్వ చేసుకున్నారు. సీజన్ ముగుస్తున్నా ధర పెరగకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పరిస్థితి ఇదే విధంగా ఉంది.

నడవని జిన్నింగ్ మిల్లులు

పత్తి సీజన్ మొదలవ్వగానే కొనుగోళ్ల ప్రారంభించాల్సిన సీసీఐ ఇప్పటి ...5లో

నవతెలంగాణ

మా అమ్మానాన్నలను ఒకే జిల్లాకు పంపండి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భార్యా భర్తలు ఒకే జిల్లాలో పనిచేసేలా బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ దంపతులు చేపట్టిన పాఠశాల విద్యాశాఖ సంచాలకుల కార్యాలయం ముట్టడి రణరంగంగా మారింది. అక్కడికి వచ్చిన ఉపాధ్యాయులను ఎక్కడికక్కడ పోలీసులు అరెస్టు చేశారు. ఆర్టీసీ బస్సులు, ఆటోల్లో వచ్చిన ఉపాధ్యాయ దంపతులు, పిల్లలతో సహా రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. స్పౌజ్ బదిలీలు చేపట్టాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు, ఉపాధ్యాయులకు మధ్య తోపులాట జరిగింది. చిన్నపిల్లలు, మహిళా టీచర్లపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించారు. తల్లుల ఒళ్లో కూర్చున్న పిల్లలను గుంజి ఈడ్చుకుంటూ తీసుకెళ్లి వాహనాల్లోకి ఎక్కించారు. దీంతో పిల్లలు విలపించారు. కొందరు టీచర్లపై పోలీసులు దురుసుగా ప్రవర్తించి చేయిచేసుకున్నారు. కొందరు పిల్లలు, ఉపాధ్యాయులకు స్వల్ప గాయాలయ్యాయి. దొరికిన వారిని దొరికినట్టుగానే అరెస్టు చేసి హైదరాబాద్‌లోని పలు పోలీస్ స్టేషన్లకు తరలించారు. సైఫాబాద్‌లో ఉన్న పాఠశాల విద్యాశాఖ సంచాలకుల కార్యాలయం ముందు శనివారం ఉపాధ్యాయ దంపతులు మౌన దీక్ష చేపట్టారు. 'సీఎం కేసీఆర్ తాత... మా అమ్మానాన్నను ఒకే జిల్లాకు పంపండి.'అంటూ చిన్న పిల్లలు ఫ్లకార్డులను ప్రదర్శించారు. 19 జిల్లాల్లో స్పౌజ్ బదిలీలకు అనుమతించిన రాష్ట్ర ప్రభుత్వం మరో 13 జిల్లాల్లో నిషేధం విధించడం అన్యాయమంటూ పలువురు ఉపాధ్యాయ దంపతులు ప్రశ్నించారు. వేర్వేరు జిల్లాల్లో విధులు నిర్వహించడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో 317 ద్వారా ప్రభుత్వం తమకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. సీఎం కేసీఆర్ తక్షణమే జోక్యం చేసుకుని తమ సమస్యలు పరిష్కరించాలనీ, లేదంటే పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

615 మంది చేయాలనుకోవడం సరికాదు : వివేక్

13 జిల్లాల్లో 2,100 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకుంటే 615 మంది స్కూల్ అసిస్టెంట్లకు మాత్రమే బదిలీలకు అవకాశం కల్పించడం సరైంది కాదని స్పౌజ్ టీచర్ల ఫోరం అధ్యక్షులు వివేక్ విమర్శించారు. దీంతో ఎస్జీటీలు, పండితులు, పీఈటీ ఉపాధ్యాయ దంపతులు ఆందోళనలో ఉన్నారని చెప్పారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని స్కూల్ అసిస్టెంట్లకు అవకాశం కల్పించడం ఎంత వరకు సమంజసమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఓట్ల కోసమే తప్ప ఉపాధ్యాయులు, పిల్లలు, వారి తల్లిదండ్రుల ఇబ్బందులు ఈ ప్రభుత్వానికి పట్టవా? అని అడిగారు. అన్ని జిల్లాల్లోనూ స్పౌజ్ బదిలీలు చేపట్టే అవకాశమున్నా ప్రభుత్వం అనుమతించడం లేదన్నారు. 317 జీవో ద్వారా భార్యాభర్తలను విడదీసిన ఘనత ప్రభుత్వానిదేనని విమర్శించారు. తమ పిల్లలనీ, తమని కన్న తల్లిదండ్రులను చూసుకోలేక సతమతమవుతున్నామని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తమ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. 13 జిల్లాల్లో ఉపాధ్యాయ దంపతులందరికీ బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్పౌజ్ టీచర్ల ఫోరం ప్రధాన కార్యదర్శి ఖాదర్, కోఆర్డినేటర్లు నరేష్, కృష్ణ, ఉపాధ్యక్షులు త్రివేణి, కోశాధికారి శిరీష, నాయకులు మమత, శోభ, సుజాత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల ఖండన

నిషేధం విధించిన 13 జిల్లాల్లో స్పౌజ్ బదిలీలు చేపట్టాలంటూ పాఠశాల విద్యాశాఖ కార్యాలయం వద్ద మౌనదీక్ష చేపట్టిన ఉపాధ్యాయ దంపతుల అరెస్టును ఉపాధ్యాయ సంఘాలు ఖండించాయి. పోలీసులు అమానుషంగా ప్రవర్తించడం సరైంది కాదని తెలిపాయి. ఈ మేరకు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి, ఎస్టీయూటీఎస్ అధ్యక్షులు జి సదానందంగౌడ్, ప్రధాన కార్యదర్శి ఎం పర్వత్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి బి భుజంగరావు, టీపీటీఎఫ్ అధ్యక్షులు వై అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్, తపస్ రాష్ట్ర అధ్యక్షులు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. బ్లాక్ చేసిన 13 జిల్లాల భార్యాభర్తల బదిలీలపై సాధారణ బదిలీలకు ముందే సానుకూల నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత ఉపాధ్యాయుల్లో నెలకొన్న ఆందోళనను నివారించాలని కోరారు.

విద్యుత్ సంస్థల ఆర్థిక పరిస్థితి బాలేదు

- అంతర్గత సామర్థ్యం పెంచుకోవాలి
- 'డైరీ' ఆవిష్కరణలో టీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ డీ ప్రభాకరరావు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో విద్యుత్ సంస్థల ఆర్థిక పరిస్థితి ఏమాత్రం బాగాలేదనీ, విద్యుత్ ఉద్యోగులు అంతర్గత సామర్థ్యాన్ని ఇంకా పెంచుకోవాలని టీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావు అన్నారు. సాంకేతిక వృద్ధి బాగున్నా ఆర్థిక పరిస్థితి ఎందుకు మెరుగుపడట్లేదో చర్చ జరగాలని చెప్పారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళా భవన్‌లో తెలంగాణ విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ 2023 నూతన డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. మీటర్ సేల్స్ పెంచడం, వృథా ఖర్చులు తగ్గించుకోవడమే తమ ముందు కనిపిస్తున్నాయని చెప్పారు. విద్యుత్ సంస్థల అకౌంట్స్ అన్ని సక్రమంగా ఉన్నాయనీ, బ్యాలెన్స్ షీట్ ఇండెక్స్ ఆఫ్ ద కంపెనీ బాగున్నదని తెలిపారు. రూ. 37 వేల కోట్లు కరెంట్ ఉత్పత్తి, పంపిణీ కోసం కేటాయించామన్నారు. ట్రాన్స్‌కో, జెన్‌కోల పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నా డిస్కంలు ఆర్థికంగా కుంగిపోతున్నాయని వివరించారు. సైబర్ క్రైమ్ పెరిగిందనీ, ఉద్యోగులు టెక్నాలజీ, కమ్యూనికేషన్ స్కిల్స్ మీద పట్టు పెంచుకోవాలని సూచించారు. రూ. 40 వేల కోట్ల కాంట్రాక్టు బీహెచ్ఇఎల్‌కు ఇచ్చినప్పుడు తనపై చాలా ఒత్తిడి ఒచ్చిందని అన్నారు. ఉద్యోగుల పీఆర్సీపై సీఎం కేసీఆర్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. విద్యుత్ సంస్థల్లోని ఉద్యోగ ఖాళీలను రాజ్యాంగ, న్యాయబద్ధంగా భర్తీ చేస్తామని వివరించారు. ట్రాన్స్‌కో జేఎమ్‌డీ శ్రీనివాసరావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు పెట్టక తప్పదనీ, భవిష్యత్‌లో మీటర్ రీడింగ్ ఉండక పోవచ్చని చెప్పారు. విద్యుత్ సంస్థలకు రూ. 26 వేల కోట్ల సబ్సిడీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు. గత ఏడాదిలో సంస్థకు రూ.600 కోట్ల నుంచి రూ.800 కోట్ల వరకు నష్టం వచ్చిందని వివరించారు. విద్యుత్ చట్టంలోని సెక్షన్ 176 ప్రకారం కొత్త నిబంధనలు రెగ్యులేటరీ కమిషన్‌కు వర్తిస్తాయనీ, అవి అమల్లోకి వస్తే విద్యుత్ సంస్థలపై ఆర్థిక భారం ఉండదన్నారు. కేంద్ర ప్రభుత్వం డిస్కంలను ప్రయివేటు పరం చేయాలని నిర్ణయించిందనీ, టెక్నాలజీని ఉపయోగించుకుని ముందుకు వెళ్తే ఆ ముప్పు ఉండదని ఆశాభావం వ్యక్తం చేశారు. టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ అన్నమనేని గోపాల్‌రావు, టీఎస్‌ఎన్పీడీసీఎల్ సీఎమ్‌డీ జీ రఘుమారెడ్డి తదితరులు మాట్లాడారు.

బదిలీలు, పదోన్నతుల ప్రారంభంపై హర్షం

- పీఆర్టీయూటీఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియపై ఉన్న నిషేధాన్ని తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 91ని విడుదల చేయడం పట్ల పీఆర్టీయూటీఎస్ హర్షం ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్, విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి, ఆర్థిక మంత్రి టి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

దళితబంధుకు నిధులు విడుదల చేయాలి :కేవీపీఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళిత బంధు పథకానికి నిధులు వెంటనే విడుదల చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్ వెస్లీ, టి స్కైలాబ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిధులు కాగితాల్లోనే ఉన్నాయనీ, వాటిని అర్హులకు అందేలా నిర్ణయాలు జరగాలని డిమాండ్ చేశారు. అర్హులందరూ ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు.ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించి రాజకీయ జోక్యం లేకుండా ఆ పథకాన్ని పారదర్శకంగా అమలు చేయాలని కోరారు. 2022- 23 సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం రూ. 17,700 కోట్లు కేటాయించి పది నెలలు గడుస్తున్నా పది పైసలు కూడా విడుదల చేయలేదని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించినట్టుగా నియోజకవర్గానికి 1500 మందికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 1500 నుంచి 500కు,200కు లబ్ధిదారుల సంఖ్యను తగ్గించిందని పేర్కొన్నారు. దీంతో అర్హులైన లబ్ధిదారులు దళిత బంధుకు నోచుకోవటం లేదని తెలిపారు.

విద్యుత్ వినియోగదారుల ఏకరువు

ఏసీడీ డ్యూ, డెవలప్‌మెంట్ చార్జీలపై ఆగ్రహం

- ట్రాన్స్‌ఫార్మర్లకు మీటర్లు సరికాదని విన్నపం
- ఇవి విద్యుత్ ప్రయివేటీకరణ యత్నాలేనని ఆరోపణ
- దన్నుగా సీపీఐ(ఎం), ఎన్డీ, ప్రజాపంథా పార్టీలు
- ఖమ్మంలో విద్యుత్ నియంత్రణ మండలి వినియోగదారుల ముఖాముఖి



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

విద్యుత్ వినియోగదారులు సమస్యలను ఏకరువు పెట్టారు. అడిషనల్ కన్జమ్షన్ డిపాజిట్ (ఏసీడీ) డ్యూ, డెవలప్‌మెంట్ చార్జీల పేరుతో వినియోగదారులపై భారాలు మోపొద్దని డిమాండ్ చేశారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లకు మీటర్లు సరికాదని విన్నవించారు. సంస్థ నష్టాల్లో ఉందనే పేరుతో వాటిని భర్తీ చేసుకునేందుకు వినియోగదారులపై భారాలు వేయడం సరికాదని, ఇవన్నీ విద్యుత్ ప్రయివేటీకరణ చర్యల్లో భాగమేనని సీపీఐ(ఎం), సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ప్రజా పంథా నాయకులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా విద్యుత్ వినియోగదారులతో ముఖాముఖిని శనివారం స్థానిక జిల్లా పంచాయతీ మౌలిక వనరుల కేంద్రం (డీపీఆర్సీ) భవన్‌లో తన్నీరు శ్రీరంగారావు అధ్యక్షతన టెక్నికల్ మెంబర్ మనోహర్‌రాజు, మెంబర్ ఫైనాన్స్ బండారు కృష్ణయ్య నేతృత్వంలో నిర్వహించారు.

విద్యుత్ వృథాను అరికట్టేందుకే మీటర్లు: శ్రీరంగారావు, అధ్యక్షులు

వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పేరుతో విచ్చలవిడిగా వృథాకు పాల్పడుతున్న నేపథ్యంలోనే ట్రాన్స్‌ఫార్మర్లకు మీటర్లు పెడుతున్నట్టు అధ్యక్షులు శ్రీరంగారావు స్పష్టం చేశారు. రాష్ట్రంలో 27 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉండగా 5 లక్షలకు పైగా ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా, ఆరు వేల ట్రాన్స్‌ఫార్మర్లకు మాత్రమే ప్రయోగాత్మకంగా మీటర్లు ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్‌పరంగా ఏవైనా సమస్యలుంటే 040-23311127, 28 నంబర్లకు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు. పనిచేయని మీటర్లను ఏడురోజుల్లో మార్చాలని ఆదేశించారు. లేనిపక్షంలో సంబంధిత శాఖ బాధ్యులు రోజుకు రూ.200 చొప్పున పెనాల్టీ సంస్థకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రీపెయిడ్ మీటర్లు వచ్చేంత వరకే ఏసీడీ చార్జీలు అమల్లో ఉంటాయని టెక్నికల్ మెంబర్ మనోహర్‌రాజు తెలిపారు. ఏప్రిల్‌లో ఏసీడీ చార్జీల స్పెషల్ డ్రైవ్ ఉంటుందన్నారు. చార్జీల టారిఫ్ ఉండదని స్పష్టం చేశారు.

సమావేశంలో సంస్థ సీజీఆర్ఎఫ్ చైర్మెన్ సత్యనారాయణగౌడ్, జిల్లా ఎస్ఈ సురేందర్, డైరెక్టర్లు బుగ్గవీటి వెంకటేశ్వరరావు, గణపతి, సభ్యులు తిరుమలరావు, చరణ్‌దాస్, నరేందర్, కార్పొరేటర్లు కమర్తపు మురళి, కూరాకుల వలరాజు, రాపర్తి శరత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మిక్కిలినేని నరేందర్, ఎన్డీ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్, చందు తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటీకరణ యత్నాలు: సీపీఐ(ఎం)

గతేడాది డెవలప్‌మెంట్ చార్జీలు, ఇప్పుడు అడిషనల్ కన్జమ్షన్ డ్యూ పేరుతో పేద, మధ్యతరగతి వినియోగదారులపై భారాలు వేస్తున్నారని సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. జిల్లావ్యాప్తంగా 1017 మంది సిబ్బందితో సంస్థ నిర్వహణ కష్టతరం అవుతున్న దృష్ట్యా స్టాఫ్‌ను పెంచి మరింత నాణ్యమైన విద్యుత్ ను వినియోగదారులకు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేశారు. డిస్ట్రిబ్యూషన్ కంపెనీ(డిస్కాం) లకు విద్యుత్ నియంత్రణ మండలి ఇస్తున్న మితిమీరిన స్వేచ్ఛ ఫలితంగా వినియోగదారులపై భారాలు అధికమవుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ కార్యాలయాలు రూ.వేల కోట్లలో విద్యుత్ బకాయిలున్నా చర్యలు తీసుకోని నియంత్రణ మండలి.. ప్రజలపై భారాలు వేయడంలో మాత్రం ముందుంటోందన్నారు. ఆర్టిజన్స్‌ను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు కాలితే 48 గంటల్లో రీప్లేస్ చేయాలని కోరారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల కు మీటర్లు పెట్టడం వంటి చర్యలు ఉపసంహరించుకోవాలని, లోటుపాట్ల పేరుతో విద్యుత్ ప్రయివేటీకరణకు పూనుకోవడం సరికాదన్నారు. పలువురు సర్పంచ్‌లు సైతం లైన్ల విస్తరణ పేరుతో గ్రామపంచాయతీలపై భారాలను వ్యతిరేకించారు. ఇష్టానుసారంగా ఎల్‌సీలు ఇవ్వకుండా నిర్దిష్ట సమయంలోనే ఇచ్చేలా చూడాలని మరికొందరు వినియోగదారులు కోరారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల బిల్‌స్టాప్ సర్వీసులను పునరుద్ధరించాలని తెల్దారు పల్లి సర్పంచ్ సిద్దినేని కోటయ్య కోరారు. జామా యిల్, సుబాబుల్ తోటల మధ్య నుంచి పోతున్న కరెంట్ లైన్‌లను తొలగించాలని సభ్యులు నరేందర్ కోరారు. పల్లెప్రగతిలో ఇనుప స్తంభాలను తొలగించినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్‌కు టీఆర్ఎస్ నేతలు పగడాల నాగరాజు, డీసీఎంఎస్ చైర్మెన్ రాయల శేషగిరిరావు కృతజ్ఞతలు తెలిపారు.



ఐక్య పోరాటాలతోనే ఇండ్ల స్థలాలు సాధ్యం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ-గోవిందరావుపేట

ఐక్య పోరాటాల ద్వారానే ఇండ్ల స్థలాల సాధన సాధ్యమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. శనివారం ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా గ్రామంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ భూమిలో ఇండ్ల స్థలాల కోసం గుడిసెలు వేసిన గుడిసె వాసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో తమ్మినేని పాల్గొని మాట్లాడారు. ముందుగా పస్రా బస్టాండ్ సెంటర్ నుండి గుడిసెలు వేసిన ప్రాంతం వరకు తమ్మినేని గుడిసె వాసులతో కలిసి పాదయాత్ర చేశారు. దారి పొడవున ఎర్రటి తోరణాలతో పస్రా చౌరస్తా ఎరుపెక్కి పోవడంతో పాటు ర్యాలీలో పాల్గొన్న ప్రజలు చేస్తున్న నినాదాలతో మార్మోగిపోయింది. అనంతరం తమ్మినేని మాట్లాడుతూ.. ఎన్ని అవాంతరాలు వచ్చినా, నిర్బంధాలు ఎదరైనా.. కేసులు నమోదైనా.. వెరవకుండా, బెదరకుండా ఐక్యంగా పోరాడాలని సూచించారు. ఈ విషయంపై ముఖ్యమంత్రితో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు, పక్కా గృహాలు ఇప్పించిన చరిత్ర సీపీఐ(ఎం)కి మాత్రమే ఉందని అన్నారు. గుడిసెలు పీకినా, కాలబెట్టినా మళ్ళీ గుడిసెలు వేద్దామని, అరెస్టులు, కేసులకు భయపడేది లేదని, పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కులమతాలు, పార్టీలు, జెండాలు ప్రధానం కాకుండా పోరాటం ముందుకు సాగాలని సూచించారు. ప్రస్తుతం ఎన్నికల వాతావరణం కొనసాగుతున్నందున సాధ్యమైనంత త్వరలోనే ఫలితం వస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.అనంతరం గుడిసేవాసులు తమ్మినేని వీర భద్రంకు లెనిన్ చిత్రపటాన్ని కానుకగా అందించారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి, బండారి రవికుమార్, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వెంకటరెడ్డి, జిల్లా నాయకులు ఎండీ అంజద్ పాష, ప్రవీణ్ కుమార్, ఎండీ దావూద్, దొబగట్ల లక్ష్మయ్య, బి రెడ్డి సాంబశివ, మండల కార్యదర్శి తీగల ఆదిరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు అంతటి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

జీరో సర్వీసు బదిలీలకు అనుమతివ్వాలి

- ఐదేండ్లు నిండిన హెచ్‌ఎంలను తప్పనిసరిగా బదిలీ చేయాలి: టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయులకు కనీస సర్వీసు నిబంధన లేకుండా అందరికీ బదిలీకి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక స్టేషన్‌లో ఐదేండ్ల సర్వీసు పూర్తైన ప్రధానోపాధ్యాయుల (హెచ్‌ఎం)ను తప్పనిసరిగా బదిలీ చేయాలని కోరింది. గతేడాది 317 జీవో అమల్లో భాగంగా ఇతర జిల్లాలకు కేటాయించిన టీచర్లను మారుమూల ప్రాంతాల్లో నియమించారని తెలిపారు. ప్రస్తుతం జరిగే సాధారణ బదిలీల్లో వారికి అవకాశం కల్పించాలంటూ అన్ని సంఘాలూ కోరినా విద్యాశాఖ అంగీకరించకపోవటం సమంజసం కాదని పేర్కొన్నారు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారానే బదిలీలు కొనసాగుతున్నాయి కాబట్టి వారికి దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చినంత మాత్రాన ప్రభుత్వానికి నష్టమేం లేదని వివరించారు.

హెచ్‌ఎంలు ఒక పాఠశాలలో ఐదేండ్లకు మించి పని చేయించకూడదంటూ గతంలో నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేశారు. ఇప్పుడు ఏ ఉపాధ్యాయ సంఘం అడగకుండానే ఎనిమిదేండ్ల వరకు ఒకే పాఠశాలలో కొనసాగించే అవకాశమివ్వటం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నదని తెలిపారు. ఎవరో కొద్దిమంది వ్యక్తుల ప్రయోజనం కోసం వ్యవస్థను ఆగం చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. సంఘాలతో చర్చించి అంగీకారానికి వచ్చిన అంశాలకు అనుగుణంగా నిబంధనలు రూపొందించి జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ సజావుగా సాగేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

వాటిని బ్లాక్ చేయండి..

- బీబీసీ డాక్యుమెంటరీపై మోడీ సర్కార్ గరం గరం
- ట్విట్టర్, యూట్యూబ్‌కు కేంద్రం ఆదేశాలు

న్యూఢిల్లీ: బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీపై మోడీ సర్కార్ గరం గరం అవుతోంది. ఈ డాక్యుమెంటరీ వీడియో ఎట్టి పరిస్థితుల్లో వివిధ మాధ్యమాల్లో ప్రసారం కావడానికి వీల్లేదనే ధోరణితో కేంద్ర ప్రభుత్వ వర్గాలు రంగంలోకి దిగాయి. మైక్రోబ్లాగింగ్, వీడియో షేరింగ్ సైట్లలో అందుబాటులో ఉండటానికి వీల్లేదని మోడీ సర్కార్ ఆదేశాలు జారీచేసింది. వీడియో లింక్స్ ఇవ్వరాదు అంటూ ట్విట్టర్, యూట్యూబ్‌ను ఆదేశించింది. వీడియో లింకులను బ్లాక్ చేసేలా కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెంటనే చర్యలకు ఉపక్రమించారు. ప్రభుత్వం నుంచి లభించిన మద్దతుతోనే 2002 గుజరాత్ అల్లర్లు చెలరేగాయని, దీనికి ప్రధాన బాధ్యుడు ఆనాటి రాష్ట్ర సీఎం నరేంద్రమోడీ..అని బీబీసీ డాక్యుమెంటరీ పేర్కొంది. ఈ వీడియో భారత్, బ్రిటన్‌లో రాజకీయంగా తీవ్ర కలకలం రేపింది. రెండో వీడియో కూడా విడుదల కానున్నదని బీబీసీ కొద్దిరోజుల క్రితం ప్రకటించింది. మొదటి వీడియో విడుదలైన కొద్ది గంటల్లోనే బీబీసీ తొలగించటం చర్చనీయాంశమైంది. 'ఇండియా : ది మోడీ క్వశ్చన్' పేరిట విడుదలైన డాక్యుమెంటరీని భారత్ తీవ్రంగా ఖండించింది. డాక్యుమెంటరీ ఒక విద్వేషపూరిత చర్యగా అభివర్ణించింది.

బీబీసీ డాక్యుమెంటరీపై మోడీ సర్కార్‌కు మింగుడుపడటం లేదు. తాజాగా మరికొన్ని చర్యలు చేపట్టినట్టు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఆ డాక్యుమెంటరీ లింకులను బ్లాక్ చేయాలని ట్విట్టర్, యూట్యూబ్‌లను కేంద్రం ఆదేశించినట్టు తెలిసింది. ఈ అంశానికి సంబంధించి మొదటి ఎపిసోడ్ లింకులను బ్లాక్ చేయాలని ఆ రెండు సామాజిక మాధ్యమ సంస్థలను సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఆదేశించినట్టు తెలుస్తోంది. 50 ట్వీట్లను తొలగించాలని చెప్పినట్టు ఆ వర్గాలు తెలిపాయి. ట్విట్టర్ తొలగించిన వాటిలో తృణమూల్ కాంగ్రెస్ నేత డెరిక్ ఓబ్రెయిన్ ట్వీట్ కూడా ఉంది. ఇదిలా ఉంటే..ఈ డాక్యుమెంటరీ అంశం బ్రిటన్ పార్లమెంట్‌లోనూ చర్చకు వచ్చింది. డాక్యుమెంటరీలోని విషయాలను తాను పూర్తిగా అంగీకరించలేనని ప్రధాని రిషి సునాక్ స్పందించిన విషయం తెలిసిందే.

రెజ్లర్లపై లైంగిక వేధింపులు

- బ్రిజ్ భూషణ్ శరణ్‌ను పదవి నుంచి తొలగించాలి
- ఐద్వా డిమాండ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భారత మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడయిన బ్రిజ్ భూషణ్ శరణ్‌ను వెంటనే బాధ్యతల నుంచి తొలగించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్ అరుణజ్యోతి, మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు.

రెజ్లర్లకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ఐద్వా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తమకు న్యాయం చేయాలని బ్రిజ్ భూషణ్‌ను సమాఖ్య అధ్యక్ష బాధ్యతల నుంచి తొలగించాలని భారత మహిళా రెజ్లర్లు చేస్తున్న ఆందోళనతో భారత ఒలంపిక్ సంఘం దిగొచ్చి ఏడుగురితో విచారణ కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. దీన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. కమిటీ నిష్పక్షపాత విచారణ జరపాలంటే.. సమాఖ్యకు అధ్యక్ష పదవి నుంచి భూషణ్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే కమిటీని ప్రభావితం చేయగలిగే అవకాశముందని అనుమానం వ్యక్తం చేశారు. విచారణ కమిటీ నిష్పక్షపాతంగా వ్యవహరించాలనీ, క్రీడాకారులకు రక్షణ కల్పించాలనీ, విచారణకు సహకరించిన వారి వివరాలను గోప్యంగా ఉంచి, వారి క్రీడా భవిష్యత్తును, గౌరవాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

మీ బడ్జెట్‌లోనే 'సదరన్ ట్రావెల్స్ హాలిడే మార్ట్'

- పర్యాటకుల కోసం మెగా ఆఫర్లు
- బుకింగ్‌లపై సిల్వర్ కాయిన్ గెలుచుకొనే అవకాశం, క్యాష్‌బ్యాక్ ఆఫర్లు



నవతెలంగాణ-సిటీబ్యూరో

భారతదేశపు అగ్రశ్రేణి పర్యాటక, ఆతిథ్యరంగ సంస్థల్లో ఒకటైన సదరన్ ట్రావెల్స్.. అందరికీ అందుబాటు ధరల్లో ట్రావెల్స్ హాలిడే ఆఫర్లు ప్రకటించింది. 1970లో తొలిసారిగా న్యూఢిల్లీ ప్రధాన కేంద్రంగా ఏర్పాటై భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖచే గుర్తించబడింది. దేశమంతటా తన బ్రాంచ్‌లను విస్తరించింది. తాజాగా అతి పెద్ద ఫ్లాష్ సేల్ 'హాలిడే మార్ట్'తో కస్టమర్ల ముందుకు వచ్చింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కోల్‌కత్తా, ఛత్తీస్‌గఢ్‌లో శనివారం హాలిడే మార్టులను ప్రారంభించింది. హైదరాబాద్‌లో సదరన్ హాలిడే మార్ట్‌ను సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశంలోని వివిధ నగరాల్లో ఈనెల 23వ తేదీ నుంచి సదరన్ ట్రావెల్స్ గ్రాండ్ హాలిడే రోడ్ షోలను నిర్వహిస్తుందన్నారు. ఈ హాలిడే మార్ట్‌లో దేశీయ, అంతర్జాతీయ టూర్లపై ఆఫర్లు, అతి పెద్ద డిస్కౌంట్లు అందిస్తున్నా మని చెప్పారు. టూర్ బుకింగ్‌లపై సిల్వర్ కాయిన్ గెలుచుకొనే అవకాశం, క్యాష్ బ్యాక్ ఆఫర్లు, అంతర్జాతీయ హాలిడే టూర్ల బుకింగ్స్‌పై దేశీయ హాలిడే టూర్లను ఉచితంగా అందించడంతో పాటు లక్కీ డ్రాలపై ఎన్నో బహుమతులు కూడా అందిస్తామన్నారు. హాలీడే మార్ట్ ప్రదేశానికి వెళ్లలేని ఔత్సాహిక ప్రయాణికులు ఆన్‌లైన్‌లో స్లాట్స్ బుక్ చేసుకోవచ్చన్నారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణమోహన్ మాట్లాడారు. ప్రయాణికు లు ఇష్టమైన టూర్ ప్యాకేజీని ఎంచుకుని డిస్కౌంట్‌తోకూడిన తగ్గింపు ధరను చెల్లించొచ్చని తెలిపారు. టోకెన్ మొత్తం ధర రూ.5000 అని, దీన్నే బుకింగ్ మొత్తంగా పరిగణిస్తారని వివరించారు. టోకెన్ అమౌంట్ డిసెంబర్ వరకు బుక్ చేసుకుని ఏ టూర్లకైనా సర్దుబాటు చేసుకోవచ్చని చెప్పారు. ఈ సంవత్సరం సదరన్ ట్రావెల్స్.. దేశీయ, అంతర్జాతీయ గమ్యస్థానాలకు 440కి పైగా కస్టమైజ్డ్, గ్రూప్ ప్యాకేజీలను ప్రవేశపెట్టిందని తెలిపారు.

దేశ, విదేశీ టూర్ ప్యాకేజీలు

కస్టమర్లు యూరోప్, ఆఫ్రికా, స్కాండినేవియా, ఆస్ట్రేలియా, దక్షిణ ఆసియా, మధ్య తూర్పు, దుబాయ్, యూ.ఎస్.ఏ, కెనడా వంటి విదేశీ టూర్ ప్యాకేజీలతోపాటు భారతదేశంలోని నార్త్ ఇండియా నుంచి సౌత్, ఈస్ట్, వెస్ట్ ఇండియాలో ఎక్కడికైనా టూర్ ప్యాకేజీలను బుక్ చేసుకోవచ్చునని మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణ మోహన్ వివరించారు. ఈ హాలీడే మార్ట్‌తో దేశంలోని రాజస్థాన్, కేరళ, అండమాన్, చార్‌ధామ్, హిమాచల్‌ప్రదేశ్, కాశ్మీర్, నార్త్ ఈస్ట్, తమిళనాడు, గుజరాత్ వంటి ప్రధాన పర్యాటక స్థానాలన్నీ కవర్ చేస్తామని తెలిపారు. కస్టమర్లకు వారి బడ్జెట్‌లోనే కుటుంబంతో కలిసి ప్రయాణం, హనీమూన్, వెల్నెస్, సాహసోపేత టూర్లు, గ్రూప్ ప్రయాణాలు వంటి సౌలభ్యతలను మెగా హాలీడే మార్ట్ కస్టమర్లకు అందిస్తుందని వివరించారు.

సదరన్ ట్రావెల్స్ ఖ్యాతి

పర్యాటక, ఆతిథ్య రంగంలో 5 దశాబ్దాలపైగా సదరన్ ట్రావెల్స్ విశిష్టమైన సేవలు అందిస్తోంది. వ్యక్తిగత సెలవుల టూర్లు, నిర్దిష్ట స్థిర ప్రయాణాలు, ప్రోత్సాహక సెలవుల టూర్లు, ప్రత్యేక ఆసక్తితో కూడిన టూర్లు, వీసాలు, హోటల్ బుకింగ్స్ అందజేస్తూ ఈ రంగంలో తనకు తానే సాటి అని నిరూపించుకుంది. కస్టమర్ల అవసరాలను బట్టి టూర్లను డిజైన్ చేసి అందించడంలో అగ్రశ్రేణి సంస్థగా సదరన్ ట్రావెల్స్ విలక్షణమైన ఖ్యాతిని సొంతం చేసుకుంది. న్యూఢిల్లీ, జైపూర్, విజయవాడ నగరాల్లో సదరన్ ట్రావెల్స్ సంస్థ 200కుపైగా రూమ్స్‌తో కూడిన హోటళ్లను కలిగి ఉంది. వారణాసిలోని కాశీ దేవాలయ ఆవరణలోని ప్రతిష్టాత్మకమైన 'భీమశంకర్ గెస్ట్ హౌస్' నిర్వహణకుగాను అవార్డు సొంతం చేసుకుంది. ఈ గెస్ట్ హౌస్‌ను ఇటీవల భారత ప్రధానమంత్రి ప్రారంభించారు. 'హాలీడే మార్ట్'కు సంబంధించిన వివరాల కొరకు 9848023236 నెంబర్‌ను సంప్రదించవచ్చు.

ఐసీఎస్ఐ హైదరాబాద్ చాప్టర్‌కు కొత్త ఆఫీస్ బేరర్లు

హైదరాబాద్ : ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) హైదరాబాద్ చాప్టర్‌కు 2023 ఏడాదికి కొత్త ఆఫీస్ బేరర్లు ఎన్నికయ్యారని హైదరాబాద్ చాప్టర్ ఎగ్జిక్యూటివ్ అధికారి వి.శ్రీనివాస్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఛైర్‌పర్సన్‌గా సీఎస్ తంగిరాల లలితాదేవి, వైస్ ఛైర్‌పర్సన్‌గా సీఎస్ అక్షితా సురానా, కార్యదర్శిగా సీఎస్ మంజీత్ బుచా, ట్రెజరర్‌గా సీఎస్‌గా శ్రీలక్ష్మీ నారాయణ గుప్త నియమితులయ్యారు. సీఎస్ ఎ.కార్తిక్, సీఎస్ పవన్ కంకాణి, సీఎస్ శిల్పా బంగ్ మేనేజింగ్ కమిటీ సభ్యులుగా ఎంపికకాగా, ఎక్స్‌అఫిషియో సభ్యులుగా రాజవోలు వెంకట రమణ, మహ దేవ్ తిరునగరి ఎన్నికయ్యారు. భారత ప్రభుత్వ కార్పొరేట్ వ్యవ హారాల మంత్రిత్వ శాఖ పరిధిలో ఐసీఎస్ఐ పనిచేస్తుంది. కంపెనీ సెక్రటరీస్ (సీఎస్) కోర్సులోని విద్యార్థులకు ఉత్తమమైన, అత్యుత్తమ నాణ్యత విద్యపై హైదరాబాద్ చాప్టర్ సభ్యులు దృష్టి పెడతారు.

నకిలీ డాక్టర్లపై ఏమి చర్యలు తీసుకున్నారు?

- వారం రోజుల్లో వివరాలు తెలపాలి
- ఫిబ్రవరిలో ప్రజారోగ్య పరిరక్షణ సభ
- టీఎస్ఎంసీకి హెచ్ఆర్డీఏ వార్నింగ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అర్హత లేకుండా మందులను సిఫారసు చేస్తున్న నకిలీ డాక్టర్లపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో వారం రోజుల్లో తెలపాలని హెల్త్‌కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్ఆర్డీఏ), తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ (టీఎస్ఎంసీ)ని డిమాండ్ చేసింది. ఈ మేరకు హెచ్ఆర్డీఏ అధ్యక్షులు డాక్టర్ కె.మహేశ్ కుమార్ టీఎస్ఎంసీ రిజిస్ట్రార్, యాంటీ-క్వాకరీ కమిటీ చైర్మెన్‌కు లేఖ రాశారు. గతంలో ఐదు దఫాలుగా ఆధారాలతో సహా తాము ఇచ్చిన ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో పూర్తి వివరాలు తెలపాలని కోరారు. ఎన్ఎంసీ సెక్షన్ 34, తెలంగాణ మెడికల్ ప్రాక్టీషనర్స్ రిజిస్ట్రేషన్ యాక్ట్ 20,21,22 సెక్షన్ల ప్రకారం క్రిమినల్ ప్రొసీడింగ్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదులను టీఎస్ఎంసీతో పాటు డైరెక్టర్ ఆఫ్ హెల్త్, వైద్యారోగ్యశాఖ కార్యదర్శికి పంపించినట్టు వెల్లడించారు. అన్ని మెడికల్ కాలేజీల విద్యార్థులు, డాక్టర్లతో సంప్రదించిన తర్వాత ఫిబ్రవరి రెండో లేదా మూడో వారంలో హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద గల ధర్నాచౌక్‌లో ప్రజారోగ్య పరిరక్షణ సభ నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు ప్రగతిభవన్‌లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే జిల్లాల వారీగా యాంటీ-క్వాకరీ కమిటీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు టీఎస్ఎంసీ ఎన్నికల కోసం వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ఎంబీబీఎస్ ఎంఎల్‌హెచ్‌పీలకు వేతనం పెంచాలనీ, ప్రాథమిక ఆరోగ్య రంగం బలోపేతానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా హాస్పిటళ్లకు బడ్జెట్ కేటాయింపులు పెంచాలనీ, టీవీవీపీ స్పెషలిస్ట్ డాక్టర్ల నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. క్లినిక్కులు, ఆస్పత్రుల అనుమతులు, రెన్యూవల్స్ కోసం జీవో నెంబర్ 47, జీవో నెంబర్ 48 అమలు చేయాలని, ఎంహెచ్ఎస్ఆర్బీ ద్వారా క్యాలెండర్ ఇయర్ రిక్రూట్ మెంట్ షెడ్యూల్ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఫలితాలేవి....

డాక్టర్ల సంఘాలు నకిలీ వైద్యం, నకిలీలపై ఇచ్చిన ఫిర్యాదులపై టీఎస్ఎంసీ తీసుకున్న చర్యలేంటని తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్ (టీడీఎఫ్) కన్వీనర్ డాక్టర్ విజయేందర్ ప్రశ్నించారు. ఈ మేరకు శని వారం ఒక ప్రకటన విడుదల చేశారు. పలు సార్లు చట్ట విరుద్ధంగా ఏర్పాటైన వాటిపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినట్టు గుర్తు చేశారు. ఫిర్యాదుతో వస్తున్న ఫలితాలేంటో వెల్లడించాలని డిమాండ్ చేశారు.

మహిళా న్యాయవాదులను వేధిస్తే కఠిన చర్యలు

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-అంబర్ పేట

మహిళా న్యాయవాదులను, అధికారులను ఇబ్బందులకు గురి చేస్తే ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. అఖిల భారత యాదవ మహాసభ న్యాయ విభాగం ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యాదవ మహిళా న్యాయవాదులు, అధికారుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ యాదవ విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని కోకాపేటలో రూ.300 కోట్ల విలువైన స్థలాన్ని కేటాయించి.. భవన నిర్మాణానికి రూ.5 కోట్లు ఇచ్చారని, అవసరమైతే రూ.8-9 కోట్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. యాదవ మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. దేశంలో యాదవులకు ప్రత్యేక గుర్తింపు ఉందని, ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ మాజీ ముఖ్య కార్యదర్శి ఉదయలక్ష్మి మాట్లాడుతూ.. అవకాశాలు రావడం లేదనే నిరాశ, నిస్పృహలు విడనాడి కష్టపడటం ద్వారా సుఖ పడతారనే సత్యాన్ని గుర్తించి ముందుకు సాగాలని సూచించారు. తాము "బ్యాక్ వర్డ్ కాదు.. బ్యాక్ బోన్" అనే విషయాన్ని గ్రహించాలన్నారు. అఖిల భారత యాదవ మహాసభ న్యాయ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు చలకాని వెంకట్‌యాదవ్ మాట్లాడుతూ.. న్యాయ వ్యవస్థ నియామకాల్లో యాదవ మహిళా న్యాయవాదులకు సముచితస్థానం కల్పించాలని కోరారు. న్యాయవాదులకు స్పెషల్ గ్రాంట్ ఏర్పాటు చేసి, డెత్ బెనిఫిట్, రిటైర్మెంట్ బెనిఫిట్‌గా మార్చి రూ.25 లక్షలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే నోముల భగత్ యాదవ్, ఏపీ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, సమాచార హక్కు చట్టం మాజీ ప్రధాన కమిషనర్ డాక్టర్ వర్రే వెంకటేశ్వర్లు తదితరులు ప్రసంగించారు. న్యాయవాది అచ్యుత యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజాగాయని విమలక్క, రాష్ట్రపతి భవన్ బొల్లారం ఎస్టేట్ ఆఫీసర్ రజినీ ప్రియయాదవ్, అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ మహేశ్వరీ యాదవ్, ఓయూ లా కాలేజీ ప్రిన్సిపల్ రాధిక యాదవ్, డాక్టర్ శిరీష యాదవ్, డాక్టర్ రమాయాదవ్, అఖిల భారత యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్ యాదవ్, మహిళా అధ్యక్షులు రాగం సుజాత యాదవ్, కార్పొరేటర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. న్యాయవాదులకు ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో హెల్త్ కార్డులు ఇవ్వాలని, దాన్ని కుటుంబ సభ్యులందరికీ వర్తింపజేయాలని తీర్మానించారు. జూనియర్ న్యాయవాదులకు ఐదు సంవత్సరాలపాటు నెలకు పదివేల గౌరవ వేతనం అందించాలని, 41ఏ సి.ఆర్.పి కింద స్టేషన్ బెయిల్ ఇచ్చే పద్ధతిని అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం కొలీజియం నియామకాల్లో అసమా నతలు రూపుమాపే వైఖరి తీసుకోవాలని, న్యాయ వ్యవస్థ నియామకాల్లో రిజర్వేషన్స్ అమలు చేయాలని, పశుసంవర్ధక శాఖ ఉద్యోగాల్లో యాదవులకు ప్రత్యేక రిజర్వేషన్‌లు ఇవ్వాలని తదితర తీర్మానాలు చేశారు.

రాష్ట్రానికి రూ.21 వేల కోట్ల పెట్టుబడులు

- ముగిసిన కేటీఆర్ దావోస్ పర్యటన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ దావోస్ పర్యటన విజయవంతమైంది. ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొన్న ఆయన నాలుగు రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వ విధానాలను, రాష్ట్రంలో పెట్టుబడులకున్న అనుకూల వాతావరణాన్ని, ప్రభుత్వ విధానాలను వివరించారు. ఫలితంగా రాష్ట్రంలో రూ.21 వేల కోట్ల మేర పెట్టుబడులను పెట్టేందుకు ప్రముఖ సంస్థలు ముందుకొచ్చాయి. తన పర్యటనను విజయవంతం చేసిన అధికారులకు మంత్రి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు.ఆర్థిక సదస్సు వేదిక నేపథ్యంలో రూ.రెండు వేల కోట్లతో ఇండియాలోనే అతిపెద్ద గ్రీన్ ఫీల్డ్ డేటాసెంటర్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు భారతీ ఏయిర్ టెల్ గ్రూప్ ముందుకొచ్చింది. హైదరాబాద్ కేంద్రంగా భారతీయ మార్కెట్‌లో తమ పెట్టుబడులను విస్తరిస్తామని ఫ్రాన్స్‌కు చెందిన ప్రఖ్యాత ఔషధ పరిశోధన, తయారీ సంస్థ యూరోఫిన్స్ తెలిపింది. లండన్ తర్వాత హైదరాబాద్‌లో డిజిటల్ ఇన్నోవేషన్ సెంటర్‌ను అపోలో టైర్స్ ప్రారంభించనున్నది.. రూ.210 కోట్లతో అలాక్స్ అడ్వాన్స్ మెటీరియల్స్ ప్రైవేట్ లిమిటెడ్. తెలంగాణలో మల్టీ గిగా వాట్ లిథియం క్యాథోడ్ మెటీరియల్ తయారీ కేంద్రాన్ని నెలకొల్పనున్నది. రాష్ట్రంలో తమ కంపెనీ కార్యకలాపాలను రెట్టింపు చేస్తున్నట్టు పెప్సికో ప్రకటించింది. రీహాబిలిటేషన్ థెరపీలో రోగులు, వైద్య సంస్థలకు అవసరమయ్యే డిజిటల్ సేవలను అందించే వెబ్ పీటీ రూ. 150 కోట్లతో హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీస్ సెంటర్‌తో సేవలందించనున్నది.

విజయవంతంగా కంటి వెలుగు

- సీఎస్ శాంతికుమారి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కంటి వెలుగు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నదని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్ నుంచి ఈ కార్యక్రమంపై ఆమె కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు రోజుల్లో 3.87 లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన 97,335 మంది కి కండ్లద్దాలను పంపిణీ చేసినట్టు తెలి పారు. అన్ని జిల్లాల్లో ఉన్న బఫర్ టీమ్‌లను ఉపయోగించుకుని ప్రభుత్వ కార్యాల యాలు, జిల్లా కోర్టు భవన సముదా యాలు, పోలీస్ బెటాలియన్లు, జర్నలిస్టుల కోసం ప్రెస్‌క్లబ్‌ల వద్ద ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలని ఆదేశించారు. కండ్లద్దాల నిల్వలను రోజువారీగా సరి చూసుకోవాలని అధికారులకు సూచించారు.

విద్య అనే మహా వృక్షానికి వ్రేళ్లు చేదుగాను, ఫలాలు మధురంగాను ఉంటాయి - అరిస్టాటిల్

మల్ల యుద్ధ మహిళ

సంపాదకీయం

"ఈ దుర్యోధన దుశ్శాసన దుర్వినీతి లోకంలో, రక్తాశ్రువులు చిందిస్తూ"నే ఉన్నది ఈ దేశపు మహిళ. మానభంగ పర్వంలో మాతృహృదయం నిర్వేదమవుతూనే ఉన్నది. అన్యాయం జరిగిందని గొంతెత్తి అరుస్తున్నా స్పందించని నేలపైన న్యాయం ఊసెత్తటమే

> భారత క్రీడా వ్యవస్థలో అవినీతి, అక్రమాలు, ఆశ్రిత పక్షపాతం మొదలైన అనేక రుగ్మతలు కొనసాగుతున్న విషయం ఎప్పటినుండో ఉంది. ముఖ్యంగా మహిళా క్రీడాకారిణుల విషయంలో గతంలో ఇలాంటి ఆరోపణలు అనేకం వచ్చాయి. క్రీడాభిరుచి కలిగి వచ్చిన మహిళలు బయటకు చెప్పుకోలేక లోలోపల కుమిలిపోతుంటారు. ఇప్పుడు ధైర్యంగా కొందరు ముందుకు రావడంతో అనేక మంది గొంతు కలుపుతున్నారు. ఈ రకమైన వేధింపుల వల్లనే మహిళలు క్రీడలకు దూరమవుతున్నారు.

అన్యాయమైపోతుంది. దుష్ట సంస్కృతీ వారసత్వం నేటికీ సమాజాన కొనసాగుతూనే ఉన్నది. నాడు 'భారతా'న ఒక్క దుశ్శాసనుడే ఉన్నాడు. నేడు వీధికొక్కడూ కనపడుతున్నాడు. ఆధిపత్య పర్వంలో విహరిస్తున్నారు. 'బేటీ పడావ్ బేటీ బచావ్' నినాదం నేడు జంతర్ మంతర్ నడి వీధిలో అణచివేయబడి హాహాకారాలు చేస్తున్నది. వొదిలే మాటలకు, కదలని హృదయాలకు సాక్షిగా మూగరోదన చేస్తున్నది. స్త్రీలను శక్తులుగా కొలిచే దేశం మనదని గొప్పలు చెప్పుకునే సాంస్కృతిక ప్రచార పటాటోపంలో 'నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి' అని నొక్కి వక్కాణిస్తున్న తీరుకు కించిత్ విచారమూ ప్రకటించము. మహిళకూ హృదయముందనీ, మెదడుందనీ, శరీరముందనీ, శక్తి వుందనీ, ఆకాశంలో సగమై ఈ లోకాన్ని ఏలుతుందనీ ఎందరెందరో చెబుతూ వచ్చినా సమానతా భావనకు విలువనిచ్చిందెప్పుడు? ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాల పేరుతో స్త్రీని సొంత ఆస్తిగా, బానిసగా చూస్తూ చెరబట్టే దుష్టత్వానికి అంతమెప్పుడు!



'భారతదేశంలో మహిళలకు ఎక్కడా రక్షణ లేదనుకుంటాను. దేశంలో ఆడపిల్లలు జన్మించకూడదని నేను అనుకుంటాను' అని ప్రపంచ దేశాలలో మన దేశం తలెత్తుకునేలా దేశ పతాకాన్ని ఎగరేసిన స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగటి ఆవేదన చెందారు అంటే... ఇక సామాన్య మహిళల పరిస్థితి ఎలావుందో అర్థమవుతుంది. ఇంత దుఃఖానికి గురవుతున్న ఆ మల్లయోధురాండ్ల వేదనను ఆలకించటానికి నాయకునికి తీరికలేకపోయింది. గత మూడు రోజులుగా రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో స్టార్ రెజ్లర్స్ న్యాయం జరగాలంటూ ధర్నా చేశారు. గత కొంత కాలంగా మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధిస్తున్న రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు, బీజేపీ పార్లమెంటు సభ్యుడు బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలని వారు ధర్నా నిర్వహిస్తున్నారు. కామన్‌వెల్త్ గేమ్స్‌లో బంగారుపతకాన్ని సాధించి దేశం గర్వపడేలా చేసిన క్రీడాకారిణిపై ఇంకా అనేక మంది జూనియర్ రెజ్లర్‌లపై లైంగిక వేధింపులకు, ఆ క్రీడా సమాఖ్య నిర్వాహకులే పాల్పడటం దుర్మార్గమైన విషయం. ఇప్పుడు ఒక్క ఐదుగురు స్టార్ రెజ్లర్‌లే కాదు, జూనియర్ క్రీడాకారిణులు వీరికి తోడయ్యారు, మిగతా ఆటగాళ్లు వీరి పోరాటానికి మద్దతు పలుకుతున్నారు. "ఇవి కేవలం ఆరోపణలు మాత్రమే కాదు, లైంగిక వేధింపులులకు సంబంధించి మా దగ్గర ఆధారాలున్నాయి" అని వారంతా చెబుతున్నారు. వెంటనే అధ్యక్షుడిని తొలగించి పాలకవర్గాన్ని రద్దు చేయాలని, చట్టప్రకారం వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

భారత క్రీడా వ్యవస్థలో అవినీతి, అక్రమాలు, ఆశ్రిత పక్షపాతం మొదలైన అనేక రుగ్మతలు కొనసాగుతున్న విషయం ఎప్పటినుండో ఉంది. ముఖ్యంగా మహిళా క్రీడాకారిణుల విషయంలో గతంలో ఇలాంటి ఆరోపణలు అనేకం వచ్చాయి. క్రీడాభిరుచి కలిగి వచ్చిన మహిళలు బయటకు చెప్పుకోలేక లోలోపల కుమిలిపోతుంటారు. ఇప్పుడు ధైర్యంగా కొందరు ముందుకు రావడంతో అనేక మంది గొంతు కలుపుతున్నారు. ఈ రకమైన వేధింపుల వల్లనే మహిళలు క్రీడలకు దూరమవుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లో రెజ్లింగ్ పోటీ శిక్షణకు అసలు మహిళలే లేకుండా పోయారు. లైంగిక వేధింపులు, చెబితే చంపేస్తామనే బెదిరింపులు, నియంతృత్వ విధానాలు, ఆటగాళ్లకు అన్యాయం చేసే పద్ధతులు... ఇవన్నీ కలిపి మహిళలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా సదరు కాషాయ ఎంపీ, ఫెడరేషన్ అధ్యక్షుడు మాత్రం తన పదవిని వదిలేదే లేదని చెబుతున్నాడు. అంతే కాదు, రెజ్లర్లు చేస్తున్న ధర్నాను, సీఏఏకు వ్యతిరేకంగా షహీన్‌బాగ్‌లో చేసిన ఆందోళనతో పోల్చి హేళన చేస్తున్నాడు. వాస్తవంగా షహీన్‌బాగ్‌లో చేసింది ఎంత ప్రజాస్వామిక న్యాయపోరాటమో, ఇది కూడా న్యాయబద్ధ పోరాటమే.

కాషాయ దళాలకు మహిళల పట్ల ఎలాంటి చూపున్నదో ఈ సంఘటన తెలియజేస్తుంది. నీతులు, ధర్మాలు వల్లించేవారి నిజస్వరూపమేమిటో కూడా బయటపెడుతుంది. మాట్లాడే మాటలకు, చేతలకూ ఉన్న వ్యత్యాసం అవగతమవుతుంది. అందుకే వేధింపులకు వ్యతిరేకంగా న్యాయం కోసం రెజ్లర్లు చేస్తున్న పోరాటానికి మేమూ మీతో గొంతు కలుపుతామని సంఘీభావం తెలిపిన బృందాకారత్‌లాగా మన గొంతుకనూ జోడిద్దాము. మల్లయుద్ధ మహిళలకు అండగా నిలుద్దాం.

మహాసమీకరణ - లౌకికశక్తుల ఏకీకరణ



పాలకవర్గాల ప్రయోజనాలకు అనుగుణంగా రెండుగా చీలిపోయిన మన మీడియాలో వాస్తవాలు తెలుసుకోవడం రానురాను దుస్సహంగా తయారవుతున్నది. దేనికి హైప్ లభిస్తుందో ఏది అవహేళనకు గురవుతుందో తమ తమ ఎజెండాలను బట్టి నిర్ణయించడం తప్ప జరిగిన దాన్నిచెప్పి తర్వాత తమ అభిప్రాయం అనే ప్రాథమికసూత్రం తలకిందులైంది. ఆయా మీడియా సంస్థలు తలుచుకుంటే ఒక పక్షానికి సంబంధించిన అతిచిన్న అంశం కూడా రోజులతరబడి రొదచేస్తుంది. అదేవారికి మింగుడు పడకపోతే వేలు, లక్షల మంది ప్రజలు ప్రత్యక్షంగా కనిపిస్తున్నా అప్రధానమై పోతుంది. వారి కథనాలు కబుర్లే మొత్తం నిండిపోతాయి. మీడియా అనబడే మోడియాలో ఇది నిత్యకృత్యం. 18వ తేదీన ఖమ్మంలో జరిగిన బిఆర్ఎస్ ఆవిర్భావ సభ సందర్భానికి ఇది అక్షరాలా వర్తిస్తుంది. రాష్ట్రాధినేత కేసీఆర్‌తో పాటు ముగ్గురు ముఖ్యమంత్రులు ఒక పెద్ద రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ఒక పార్టీ జాతీయ కార్యదర్శి, ఇద్దరు రాష్ట్ర కార్యదర్శులు, ఇంకా ఎందరో నేతలు అపూర్వమైన స్థాయిలో అశేష జనవాహిని పాల్గొన్న ఆ సభ ఇచ్చిన పిలుపు సంకుచిత వ్యాఖ్యలు సత్యదూరమైన విశ్లేషణల మరుగున కప్పిపుచ్చే ప్రయత్నం పెద్దఎత్తునే జరిగింది. వచ్చినవారు ఇచ్చిన పిలుపూ కంటే రానివారిపై రాగాలాపన అధికమైంది. సాధించిన ఫలితాలను పక్కకు నెట్టి అయాచిత రాజకీయ జోస్యాలతో ముంచెత్తడం ప్రహసన ప్రాయంగా సాగుతున్నది. ఉదాహరణకు ఆపరేషన్ ఫాంహౌస్ ఎంత అప్రజాస్వామికమో ఎంత కుట్రపూరితమో చూడకుండా కేసీఆర్ నాటకమని కొట్టిపారేయడం!

బీజేపీపై శంఖారావం

బిఆర్ఎస్ ఆవిర్భావ సభకు నిజంగానే ఒక ప్రత్యేకత ఉంది. టీఆర్ఎస్‌గా కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ

> సీతారాం ఏచూరి పదేపదే గుర్తు చేస్తూనే ఉన్నారు. అయినా సరే కృత్రిమంగా దాన్ని ముందుకు తెచ్చి నితీశ్ వర్సెస్ మమత వర్సెస్ కేసీఆర్ వర్సెస్ కేజ్రీవాల్ అంటూ అసందర్భ చర్చలతో పక్కదోవ పట్టించడం బీజేపీకే దోహదకరం. కాంగ్రెస్ పాత్ర గురించి సవాళ్లు తీసుకురావడం. బాగా బలహీనపడినప్పటికీ కాంగ్రెస్ రాజకీయ స్థానం వారి విధానాలపైన ఇతర పార్టీల ప్రభావాన్ని గుర్తించడంపైనా ఆధారపడివుంటుంది. అదీ ఇప్పటి చర్చ కాదు. రేపు తొమ్మిది రాష్ట్రాల శాసనసభ ఎన్నికలలో మూడు ఉత్తరాది రాష్ట్రాలలోనూ ఈశాన్యంలోనూ అది ఏ మేరకు పోరాడుతుందనే దాన్ని బట్టి ప్రజలకు స్పష్టత వస్తుంది.

రాష్ట్రం సాధన, వరసగా రెండు సార్లు ఎన్నికల్లో గెలవడం కూడా ప్రత్యేకతలే. అలాంటి ప్రాంతీయ పార్టీ జాతీయ పార్టీగా మారడం, ఇతర జాతీయ పార్టీలు హాజరుకావడం గతంలో చూడలేదు. కాంగ్రెస్ లేదా బీజేపీలకు వ్యతిరేకంగా భావసారూప్యత గల పార్టీలు వివిధ చోట్ల శిఖరాగ్రసభలు జరపడం, సభల్లో పాల్గొనడం ఎన్టీఆర్ హయాంలోనూ చూశాం, అయితే అది ప్రాంతీయ పార్టీగానే ఉండి జాతీయ కూటమికి నాయకత్వం వహించింది. కాంగ్రెస్ వ్యతిరేక కూటమి ఏర్పాటైనప్పుడు బీజేపీని బయిటే ఉంచడం జరిగేది. కేంద్రంలో ఏర్పడిన మూడు ప్రత్యామ్నాయ ప్రభుత్వాలలోనూ ఈ రెండు పార్టీలు లేవు. కనుకనే వాటిని బతకనివ్వలేదు. మొదట్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా అన్నిపార్టీల ఐక్యత సిద్ధాంతం తెచ్చిన ఎన్టీఆర్ అద్వానీ రథయాత్ర తర్వాత మళ్లీ ఎప్పుడూ బీజేపీతో కలవలేదు. చివరి వరకూ ఆయన రాజకీయం అలాగే ముగిసిపోయింది. చంద్రబాబు నాయుడు మాత్రం అనేకసార్లు అటూ ఇటూ మారుతూ అవకాశవాద ముద్ర వేసుకున్నారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక చాలాకాలం రాజ్యాంగ ధర్మం పేరిట బీజేపీతో సఖ్యతగానే ఉన్నా మోడీ సర్కారు నిరంకుశ మతోన్మాద పోకడల కారణంగా కేసీఆర్ గట్టి వ్యతిరేకవైఖరి తీసుకున్నారు. తనతోపాటు ఇతరులనూ కలుపుకువస్తానని ప్రకటించారు. వామపక్షాలను మినహాయిస్తే ఇప్పుడు మరో ముఖ్యమంత్రి ఎవరూ ఈ స్థాయిలో బీజేపీపై సైద్ధాంతిక రాజకీయ ప్రతిఘటన చేయడం లేదనేదివాస్తవం. షరామామూలుగా ఇందుకుగాను ఆయన పార్టీనేతలు కూడా కేంద్ర సంస్థల దాడులూ దర్యాప్తుల తంతును ఎదుర్కొంటూనే ఉన్నారు. అయినా వెనకడుగు వేయకుండా మతతత్వ రాజకీయాలను ఎదుర్కొంటానికే కట్టుబడటం తప్పక గుర్తించాల్సిన విషయం. బిఆర్ఎస్‌ను ఏపీతో సహా వివిధ చోట్ల విస్తరించే చర్యలూ ఏకకాలంలో కొనసాగించడం ఇందులో భాగమే. ఈ విధంగా వివిధ కోణాలలో బిఆర్ఎస్ విస్తరణ కార్యకలాపాలు పోటీలు వంటివాటిని గరిష్టస్థాయికి చేర్చే తొలి ప్రయత్నం ఖమ్మం సభ.



తెలకపల్లి రవి

ఈ సభలో పాల్గొన్న అగ్రనేతలూ, హాజరైన ప్రజా సముద్రమూ చూసినవారెవరరైనా జయప్రదంగా క్రమశిక్షణగా జరిగిందని చెబుతారు. పలువురు జాతీయ నాయకులు ఇతర భాషల్లో మాట్లాడినా, ప్రజలు చెదిరిపోయింది లేదు. ఎక్కువ మంది ఉన్నా విషయం ఒక్కటే అన్న అవగాహనా కనపర్చారు. బీజేపీ కేంద్రీకృత పెత్తనం, మతతత్వం, రాష్ట్రాలపై దాడి వీటిని ఏకోన్ముఖంగా ఎదుర్కోవాలన్నదే వారందరి ప్రసంగాల సారాంశం. కేసీఆర్ ప్రభుత్వ పథకాలు కొన్ని చూసిన మేరకు వారు అభినందించారు. తమ రాష్ట్రాలలో విజయాలు కొన్ని ప్రస్తావించారు. సమాఖ్యతత్వంపై నడిచే విశాల భారతంలో నిజంగా జరగాల్సిందే అది. అక్కడెవరూ కృత్రిమమైన నాటకీయమైన విన్యాసాలు చేయలేదు. అతిశయాలు చెప్పలేదు. మోడీపై వ్యక్తిగత దాడీ చేయలేదు. ఈ ఏడాది తొమ్మిది రాష్ట్రాల శాసనసభ ఎన్నికలు, వచ్చే ఏడాది మొదట్లోనే లోక్‌సభ ఎన్నికలు రానుండగా ప్రతిపక్షాల మధ్య సదవగాహన ఆహ్వానించదగింది. ప్రయోజనకరమైంది. దేశానికి తొలి కాంగ్రెసేతర ప్రభుత్వాన్నిచ్చిన కమ్యూనిస్టు కేరళ, దేశంలోనే పెద్దదైన ఉత్తరప్రదేశ్, నూతనశక్తుల ప్రభావానికి ప్రతీకగా పెంపొందుతున్న ఆప్ వంటి పార్టీల నేతలు ఒక వేదికపైకి రావడంలో విలక్షణత చూడటానికి కొందరికి మనస్కరించలేదు. వచ్చిన వారి విశిష్టతను చూడటానికి బదులు రానివారి గురించి ఎక్కువగా మాట్లాడటం మొదలెట్టారు.

కుటిల వ్యాఖ్యానాల బండారం

బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తమిళనాడు నుంచి స్టాలిన్ రాలేదేంటని ఇలా వెతకడం మొదలెట్టారు. వీరందరినీ వివిధ సందర్భాలలో కేసీఆర్ కలసివచ్చారనేది నిజం. వారిలో ఆయన అనుకున్న వారిని ఇక్కడకు పిలిచారు. మిగిలిన వారిని మరోచోటకి పిలవొచ్చు. లేదా తానే అక్కడకు వెళ్లొచ్చు. కొంతమంది రాకపోవచ్చు కూడా. అయితే దాన్ని బట్టి జరిగిన బ్రహ్మాండమైన సమీకరణ ఇచ్చిన కీలకసందేశం మరుగునపడతాయా? మోడీ అధికారం చేపట్టిన తర్వాత ఈ స్థాయిలో విశాల రాజకీయ సమీకరణల్లో ఇదీ ఒకటి అవుతుంది కదా? అంతేగాక దేశంలో లౌకిక శక్తులను ఒకతాటిపైకి తేవాలనే యత్నంలో ఇదొక ముందడుగుకదా? ఇవన్నీ తెలిసి కూడా సమస్యను కేసీఆర్‌కూ ఆయన కుటుంబానికో లేక తెలంగాణకో పరిమితం చేసి మాట్లాడ్డంలో విజ్ఞత ఎక్కడ? మోడీ ప్రభుత్వం విధానాలపై పోరాటం, వాటివల్ల కలిగిన దుష్ఫలితాలను ఎదుర్కొనే కార్యక్రమం అవగాహన వంటివాటిపై కేంద్రీకరించడం ఇక్కడ ముఖ్యం. విశాలమైన అత్యవసరమైన ఈ జాతీయ పరిస్థితిని విస్మరించి కేవలం తెలంగాణలో ఏం జరిగింది? ఏం జరగలేదు? కేసీఆర్ గతంలో ఏం చెప్పారు? ఏం చేశారు? అనేదానిచుట్టూనే చర్చను గింగిరాలు తిప్పడం దుర్బుద్ధి గాక ఏమిటి? అది కూడా రాజకీయంగా గాక కుటుంబాలు వ్యక్తులపై కేంద్రీకరించడం... మరోవైపున సర్జికల్ స్ట్రయిక్స్, హిందూత్వ రాజకీయాల బెదిరింపులతో బండి సంజయ్ వంటివారు మాట్లాడే దూషణలను దురహంకార భాషణలను పట్టించుకోకపోవడం! తెలంగాణలో ఏకదం బీజేపీ అధికారంలోకి వచ్చేస్తుందని జోస్యాలు చెప్పి జోష్ పెంచిన వారికి మునుగోడు ఎదురుదెబ్బ తగిలినా కూడా వాస్తవాలను గమనించలేకపోవడం. పైగా అక్కడ టీఆర్ఎస్ విజయానికి కీలకంగా సహకరించిన సీపీఐ(ఎం), సీపీఐలను ఆడిపోసుకోవడం ఏమిటి? బీజేపీపై పోరాటంలో టీఆర్ఎస్‌ను ఎందుకు ఏ మేరకు బలపరుస్తున్నదీ తమ్మినేని వీరభద్రం వంటివారు ప్రతిసందర్భంలోనూ చెబుతున్నా సరే. ఇదేదో ఎన్నికల రాజకీయంగా ముద్ర వేయడంవారి నిజ స్వరూపాన్నే చెబుతుంది. నిజానికి మొన్నటి సభలోనూ ఆయన అనేక సమస్యలు ప్రస్తావించారని గమనించాలి. కేసీఆర్ నాయకత్వం, తెలంగాణ మోడల్ వంటివి బిఆర్ఎస్ చెప్పుకోవడంలో ఆశ్చర్యం లేదు. కాని ఖమ్మం సభ ఉద్దేశం లేదా కమ్యూనిస్టుల లక్ష్యం బీజేపీని ఓడించడం నిరోధించడం. అది అవసరమో కాదో చెప్పకుండా మంచిదో కాదో తేల్చకుండా కెసిఆర్ చుట్టూనే చర్చ తిప్పడం తీరం చేర్చదు.

మౌలిక ప్రశ్న

ఈ నానా రకాల వ్యాఖ్యలు చేసేవారు చెప్పవలసింది ఒకటే - మతతత్వ రాజకీయాలనూ మోడీ సర్కారు అప్రజాస్వామిక విధానాలను ఓడించాలా? వద్దా? ఆ దిశలో సాధ్యమైనంత ఐక్యతతో లౌకిక పక్షాలు కలసి సాగాలా వద్దా? బిఆర్ఎస్ ఎంత విస్తరిస్తుందనేది భవిష్యత్తు చెబుతుంది. ప్రత్యేకించి ఏపీలో స్పందన ఎలావుండేది కూడా తెలుస్తుంది. కాని అటూ ఇటూ చర్చ దానికే పరిమితం చేయడమేమిటి? తెలంగాణలో జరిగే పోరాటం మాత్రం తక్కువ కీలకమా? దక్షిణాదిన ఉన్న కర్నాటకలో కూడా బీజేపీ మెజార్టీ తెచ్చుకోలేకపోవచ్చని సర్వేలు చెబుతుంటే తెలంగాణ గడ్డపై గెలిచే అవకాశం ఇవ్వడం ప్రజాస్వామిక వాదుల పవిత్ర కర్తవ్యమా? పొత్తులు కలయికల గురించి అక్కడ ఎవరూ మాట్లాడింది లేదు. దాదాపు ముప్పై ఏండ్లలో ఎన్నికల తర్వాతనే ప్రభుత్వాల ఏర్పాటు ప్రధాని అభ్యర్థి వంటివి ముందుకొస్తాయని చరిత్ర చెబుతున్నది. సీతారాం ఏచూరి పదేపదే గుర్తు చేస్తూనే ఉన్నారు. అయినా సరే కృత్రిమంగా దాన్ని ముందుకు తెచ్చి నితీశ్ వర్సెస్ మమత వర్సెస్ కేసీఆర్ వర్సెస్ కేజ్రీవాల్ అంటూ అసందర్భ చర్చలతో పక్కదోవ పట్టించడం బీజేపీకే దోహదకరం. కాంగ్రెస్ పాత్ర గురించి సవాళ్లు తీసుకురావడం. బాగా బలహీనపడినప్పటికీ కాంగ్రెస్ రాజకీయ స్థానం వారి విధానాలపైన ఇతర పార్టీల ప్రభావాన్ని గుర్తించడంపైనా ఆధారపడివుంటుంది. అదీ ఇప్పటి చర్చ కాదు. రేపు తొమ్మిది రాష్ట్రాల శాసనసభ ఎన్నికలలో మూడు ఉత్తరాది రాష్ట్రాలలోనూ ఈశాన్యంలోనూ అది ఏ మేరకు పోరాడుతుందనే దాన్ని బట్టి ప్రజలకు స్పష్టత వస్తుంది. ఇక త్రిపురలో వామపక్షాలు కాంగ్రెస్ ఒక ప్రాథమికఅవగాహనకు వచ్చినట్టు వార్తలున్నాయి. తెలంగాణ వరకూ బిఆర్ఎస్‌ను బీజేపీ బిటీం అని కాంగ్రెస్ కొట్టిపారేయడం కనిపిస్తూనే ఉంది. దేశంలో చాలా చోట్ల వారి తీరుకు ఇది భిన్నంగా లేదు. ఖమ్మం సభకూ ఆ సమస్యకూ అసలు సంబంధం లేదు. ఏమైనా దేశంలో లోక్‌సభ ఎన్నికల దిశలో ఏడాది ముందుగానే లౌకిక ప్రతిపక్షాల మధ్య అవగాహన సూచనలు స్వాగతించదగినవి. ఎవరెన్నివిధాల తక్కువ చేసినా తికమక పెట్టినా చెరిగిపోని సత్యమిది. షరా మామూలగా కమ్యూనిస్టుల విధాన స్పష్టతనూ కార్యాచరణ లో ప్రజా నిబద్ధతను వెనక్కునెట్టి అకారణ ఆరోపణలూ అవహేళనలకు గురిచేసే కుటిల రాజకీయాలూ ఎప్పటిలాగే విఫలమవడమూ అనివార్యం. ఎందుకంటే ఖమ్మం ఒక శుభారంభం. రాష్ట్రానికి దేశానికీ కూడా!



సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిద్దాం... ప్రపంచశాంతిని కాపాడుకుందాం...

ప్రపంచవ్యాప్తమైన విప్లవ ప్రతీక 'చే'.
అతడో ఉత్తేజం, ఉద్వేగం,
మానవీయ చైతన్యపు శబ్దం!
అతనిని తలచుకుంటేనే వేలరెట్ల శక్తి గుండె నిండుతుంది.
ఆశయం, లక్ష్యం జెండాలై ఎగురుతాయి.
ఆయన స్మృతి కవాతు గీతం పాడుతుంది.
లాంగ్ మార్చ్ నినాదమై మ్రోగుతుంది.
ఇప్పుడు ప్రపంచంలోని ప్రతి యువ హృదయంపై
కదలాడే సజీవ స్ఫూర్తి చిత్రం 'చే'.

విప్లవవాదులకే కాదు, సమస్త ప్రజల సమరస్వరం 'చే'ను ప్రతిధ్వనిస్తోంది.

'చే' చరిత్రలో గొప్ప స్థానం ఆక్రమించాడు. ఎందుకంటే జన విముక్తి కోసం తన ప్రాణాన్ని తృణప్రాయంగా అర్పించాడు. ఆలోచనను, ఆచరణను, జ్ఞానాన్ని ప్రతి నిముషం మానవాళి మహాభాగ్యం కోసం వెచ్చించిన ఘన గుణసంపన్నుడతడు. మనుషుల స్వేచ్ఛకు ముళ్ల కంచెలు చుడుతున్న వ్యవస్థపై, బతుకులను దుఃఖమయం చేస్తున్న దుర్మార్గంపై, సామ్రాజ్యవాదపు కొండచిలువపై విప్లవ గండ్రగొడ్డలినెత్తిన ధీరుడతడు. అందువల్లనే ఆయన జీవితం ఇతిహాసమే కాదు, నిత్య చైతన్య ప్రేరణ.

అర్జెంటీనాలో జన్మించినా లాటిన్ అమెరికా అంతటికీ విస్తరించిన విప్లవ కెరటమై ఎగిసిపడ్డాడు. అమెరికన్ సామ్రాజ్యవాదులు ఎంతోకాలంగా లాటిన్ అమెరికా దేశాలపై దోపిడీని, ఆధిపత్యాన్ని సాగిస్తూ అక్కడి ప్రజల సంపదను కొల్లగొడుతున్న అన్యాయంపై తుపాకీలా పేలిన దళపతి చేగువేరా. ఫిడెల్ కాస్ట్రోతో కలిసి క్యూబా నియంతృత్వ బతిస్తా వ్యతిరేక పోరాటంలో, విప్లవ సాధనలో అగ్రభాగాన నిలిచి విముక్తి సాధించిన సమూహ నాయకుడు చే. క్యూబాలో సమసమాజ నిర్మాణంలో కాస్ట్రోతోపాటుగా కష్టించి పనిచేసిన నిర్మాణదక్షుడు. అర్జెంటీనా, బొలీవియా, పెరూ, గ్వాటిమాలా, హైతి, చిలీ, కొలంబియా, మెక్సికో మొదలైన ప్రాంతాల విప్లవ సమూహాలకు స్ఫూర్తి శిఖరం 'చే'.

అందుకే అంత పెద్ద అమెరికా సామ్రాజ్యవాద డేగను సైతం ఎదిరిస్తూ నిలబడ్డ ఎర్రపావురం క్యూబా. ఈరోజు ప్రపంచ ప్రజలకు ఆదర్శంగా నిలిచింది. స్వావలంబనను కాపాడుకుంటూనే ప్రపంచ ప్రజలకు ఆపన్నహస్తం అందిస్తోంది. మొన్న అగ్రరాజ్యాలలోని ప్రజలను కరోనా అల్లకల్లోలపరిస్తే కనీస బాధ్యతను వహించలేకపోయిన సంపన్న దేశాలు దీనపరిస్థితికి భిన్నంగా క్యూబా ప్రపంచ దేశాలకు వైద్యం, మందులు అందజేసి ఆదుకున్నది. అది 'చే', కాస్ట్రోల కమ్యూనిస్టు స్ఫూర్తి ఫలితం. నిత్యం సామ్రాజ్యవాదం ఆ అరుణ స్ఫూర్తిని హత్యగావించేందుకు తన కుట్రను సాగిస్తూనే ఉంది. 'చే'ను హతమార్చిందీ అదే. కాస్ట్రోపై వందలసార్లు దాడులు చేసిందీ అదే. ఇప్పుడు యుద్ధాలకు సూత్రధారి, ప్రపంచ దోపిడీదారు, ప్రపంచశాంతి విఘాతక కేంద్రం అమెరికన్ సామ్రాజ్యవాదం. ప్రపంచీకరణ పేరుతో తన నెత్తుటి కాళ్లను భూమినంతా మోపుతున్న తరుణంలో చేగువేరాను తలుచుకోవటం - ఆ దుష్టత్వానికి వ్యతిరేకంగా చేసే పోరాటానికి మహోత్తేజాన్ని నింపుతుంది.

చేగువేరా క్యూబా విప్లవానంతరం భారతదేశాన్ని సందర్శించాడు. భారత జాతీయోద్యమ నాయకుడు మహాత్మాగాంధీని ఎంతగానో ప్రేమించినవాడు. గాంధీని హతమార్చిన మతోన్మాద శక్తులు నేడు ఆధిపత్యంలో ఉన్న సందర్భంలో 'చే'ను స్మరణకు తెస్తూ ఆయన కుమార్తె కామ్రేడ్ అలైదా గువేరా, మనవరాలు ప్రొఫెసర్ ఎస్తెఫినా గువేరా మన దేశంలోకి వచ్చారు. మతోన్మాదమూ, కార్పొరేట్లు ఏకమై ఒక ఫాసిస్టు తరహా పాలన సాగుతున్న తరుణాన క్యూబా దేశపు ఆచరణ, ఆలోచన దేశ ప్రజలందరికీ అనుసరణీయం. ఆ నేలనుండి, చే వారసత్వం నుండి వచ్చిన కామ్రేడ్ అలైదా గువేరా, ప్రొ॥ ఎస్తెఫినా గువేరా మనలో పోరాటశీలతకు, ప్రజాస్వామిక చైతన్యానికి మరింత ప్రేరణ ఇవ్వనున్నారు. ఆమెకు సాదరంగా ఆహ్వానం పలుకుదాం. 'చే' స్ఫూర్తిని మళ్లీ మళ్లీ నింపుకుందాం. తిరోగమన మతోన్మాద శక్తులపై పోరాటానికి పదును పెడదాం.

- నేషనల్ కమిటీ ఫర్ సాలిడారిటీ విత్ క్యూబా - జప్సో



అలైదా గువేరా

ఎస్తెఫినా గువేరా

విశ్వగురువు

> జై జవాన్, జై కిసాన్ అంటూనే అగ్నివీరుల తయారు చేయటం, రైతు వ్యతిరేక చట్టాలు తీసుకుని రావటం మనం చూడలేదా! అంతెందుకు? నిన్న వందేభారత్ రైలు పూర్తి స్వదేశీ తయారీ అంటూనే సేమెన్స్ కంపెనీ స్పేర్‌పార్టు వాడటం లేదా? ఈ విషయాల లోతుపాతులు మనం అర్థం చేసుకోకుండా, వాట్సప్ యూనివర్సిటీ పరిశోధనలుఫాలో అయిపోతున్నాం!"

శంకర్‌కు పొద్దున్నే పేపర్ చదివినప్పటి నుండీ కిందా మీద పడుతున్నాడు. ఇది ఎలా సాధ్యం? అని ఇప్పటికి కొన్ని వందల సార్లు తనను తాను ప్రశ్నించుకున్నాడు. కానీ సమాధానం మాత్రం రావటం లేదు. ఎవరినైనా అడగటానికి మనస్కరించటం లేదు! ఇంట్లోనే అటూ ఇటూ తిరుగుతున్నాడు! పార్వతి భర్త తిరుగుళ్ళు చూసి విషయం ఏమిటో అడుగుదామని అనుకుంది! కానీ ఎందుకో ఆగిపోయింది! శంకర్ మాత్రం తిరుగుతూనే ఉన్నాడు!

ఇంతలో కృష్ణ వచ్చాడు! శంకర్ కృష్ణ చిన్ననాటి సన్నిహిత మిత్రులు! కృష్ణ వచ్చి సోఫాలో కూర్చున్నాడు. పార్వతి వచ్చి కృష్ణను పలకరించి టీ కూడా ఇచ్చింది! కాని శంకర్ మాత్రం కృష్ణను గమనించనే లేదు! కృష్ణ ఆశ్చర్యపోతున్నాడు! శంకర్‌కి ఇంత పరధ్యాన్యం ఎట్లా వచ్చింది! అనుకున్నాడు.

ఇక తప్పని సరై తానే పలకరించాడు! "ఒరేయి ఏమిట్రా? అట్లా తిరుగుతున్నావు?" అని అడిగాడు.

అప్పుడు కృష్ణను చూశాడు!" ఏరా ఎంతసేపైంది! పార్వతీ! మీ అన్నకు టీ తీసుకురా?" అన్నాడు శంకర్.

"ఆఁ చల్లాన్లే! నీవు, నీ మర్యాదలు! వచ్చి అరగంటైంది! మా చెల్లెలు టీ తెచ్చింది! తాగాను! ఇంకా ఐదు నిమిషాలైతే భోజనమే పెడుతుంది! కాని నా ప్రశ్నకి సమాధానం చెప్పు! ఎందుకలా తిరుగుతున్నావు?" అన్నాడు కృష్ణ.

శంకర్ చప్పున వచ్చి, కృష్ణ చేతులు గట్టిగా పట్టుకున్నాడు. శంకర్ చేతులు వణుకుతున్నాయి! కృష్ణ ఆశ్చర్యపోతూ శంకర్ మొహంలోకి చూశాడు! శంకర్ కళ్ళలో సన్నటి నీటి చారికలు! కృష్ణ ఆశ్చర్యపోయాడు! శంకర్‌కి ఇంత బాధ కలిగించిన విషయమేమిటా అని ఆలోచిస్తున్నాడు.

"ఒరేయ్ కృష్ణా! ఏమిట్రా ఈ అన్యాయం?" అంటూ వార్తపత్రికలు కృష్ణముందు వేశాడు! అది చూసిన కృష్ణకు ఏమీ అర్థంకాలేదు! ఏమిటన్నట్లు చూశాడు!

"ఇదిగో ఈ వార్త చూడు! మన దేశంలో విదేశీ యూనివర్సిటీలు పెట్టొచ్చు అంటూ కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇస్తుందట!" అంటూ మళ్ళీ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు శంకర్!

"ఇదిగో మీరు కళ్ళు తుడుచుకోండి!" అంటూ ఒక పెద్ద టర్కీ టవల్ తెచ్చి ఇచ్చింది! పార్వతి.

ఆ టవల్ విసిరి కొట్టాడు శంకర్! "నా బాధ నీకు వేళాకోళంగా ఉందా! ఆఁ!" గయ్‌మన్నాడు.

"ఇంతకీ నీ బాధేంటో చెప్పు" అన్నాడు కృష్ణ అనునయంగా.

"భారతదేశమంటే ఏమిటి! విశ్వగురువు! సకల చరాచ విశ్వంలోని విజ్ఞానమంతా ఈ పవిత్ర భూమిలోనిదే! నాలుగు వేదాలు, అష్టాదశ పురాణాలు, ఉపనిషత్తులు, పంచమ వేదమైన భారతం, ఇంకా భగవద్గీత ఇక్కడే పుట్టాయి. ఈ భూమిని జ్ఞాన భూమిగా మార్చాయి." అని శంకర్ అంటుండగానే పార్వతి అందుకున్నది.

నజర్

"ఈ జ్ఞానభూమిలో లేని విజ్ఞానమేదో ఆ విదేశీ యూనివర్సిటీలల్లో ఉందేమో!" అన్నది.

పార్వతిని కొట్టినంత పని చేశాడు శంకర్. "మూర్ఖులారా! ఏం తెలుసే నీకు! ఈ



భూమి మీద మొదట విమానాలు వాడింది రావణాసురుడు అంటే త్రేతాయుగంలోనే విమానాలు అది కూడా 13 రకాల యుద్ధ విమానాలు వాడారు!" అన్నాడు శంకర్!

"ఇక్కడే విమానాలు అప్పుడెప్పుడో వాడితే రాఫెల్ విమానాలు ఎందుకు కొన్నారండీ!" మెల్లిగా అన్నది పార్వతి. ఈసారి కొట్టాలనే ప్రయత్నించాడు శంకర్! కాని కృష్ణ అడ్డుకున్నాడు.

"సరేలే! ప్రస్తుత విషయానికి రా!" అన్నాడు కృష్ణ.

"అదేరా నా బాధ! మన వేదభూమిలో తక్షశిల, నలంద లాంటి విశ్వవిద్యాలయాలు సాందీపని లాంటి మహామునుల ఆశ్రమాలు విజ్ఞాన భండాగారాలు ఉండగా మళ్ళీ విదేశీ యూనివర్శిటీలు ఎందుకు అనుమతించాలి?" ఆవేశంగా ప్రశ్నించాడు శంకర్.

పార్వతీ, కృష్ణ పెద్దగా నవ్వారు!

"ఈ ప్రశ్న ఎవరిని అడుగుతున్నావు!" అడిగాడు కృష్ణ.

శంకర్ తికమక పడ్డాడు! అవును! ఈ ప్రశ్న ఎవరిని అడిగినట్లు? కృష్ణ, పార్వతులను అడిగినట్టా లేక అనుమతి ఇచ్చిన కేంద్ర ప్రభుత్వాన్ని అడిగినట్టా! కేంద్ర ప్రభుత్వాన్ని అడగటం అన్న ఆలోచనలే తట్టుకోలేకపోతున్నాడు. ఎందుకంటే ఇతరులు ఇలాంటి ప్రశ్నలు కేంద్రాన్ని, కేంద్రంలోని పార్టీని అడిగితే తాను వారి నోరు మూయించేవాడు! కాని ఇప్పుడు తన నోరు మూతపడిపోయింది!

మిత్రుడి అంతర్మధనాన్ని గమనించి పార్వతికి సైగ చేశాడు కృష్ణ! పార్వతి వెళ్ళి అందరికీ మంచి టీ తీసుకువచ్చింది!

"ఏమిటీ పరిస్థితి! నాకెప్పుడూ ఎదురవ్వని దుస్థితి!" బయటికే అనేశాడు శంకర్.

అనునయంగా మిత్రుడి భుజం తట్టాడు కృష్ణ.

"అవున్రా! నేను ఇన్నాళ్ళు కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రతి పనిని చాలా బలంగా సమర్థించాను! దానికి కారణం ఒకటే! మన దేశ సంస్కృతీ, ఇక్కడి విజ్ఞానం ఎంతో గొప్పవనీ వాటిని పునరుజ్జీవింప చేస్తున్నది కేంద్ర ప్రభుత్వమేనని బలంగా విశ్వసించాను. గత ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు విదేశీ తొత్తులనీ, విదేశీ భావజాలంతో బతుకుతున్నాయనీ నమ్మాను! కాని మొదటిసారిగా నాకే వైరుధ్యం కొరసపడింది! మనదేశంలో ఎంతో విజ్ఞానం ఉంటే విదేశీ యూనివర్సిటీలు ఎందుకు? మనదేశంలో విజ్ఞానం అవాస్తవమా లేక కేంద్ర ప్రభుత్వ విధానం తప్పా?" అన్నాడు శంకర్.

నీకెదురైన వైరుధ్యం దేశంలోని ప్రజలందరికీ ఎదురైతూనే ఉన్నది! కాని దాన్ని మతపరమైన దుష్ప్రచారం. భావజాలం కమ్మేస్తున్నది! దాంతో రెండోవైపు కొట్టుకుని పోతున్నారు! పెద్ద నోట్లు రద్దుతో నల్లధనం వస్తుందని లేకపోతే 50రోజుల్లో ఉరితీయవచ్చునంటూ ఒక వంక ప్రకటిస్తూనే మరోవంక రద్దుచేసిన రూ.1000 నోటుకు పెద్దదైన రూ.2000 ముద్రించటంలో వైరుధ్యం లేదా! జై జవాన్, జై కిసాన్ అంటూనే అగ్నివీరుల తయారు చేయటం, రైతు వ్యతిరేక చట్టాలు తీసుకుని రావటం మనం చూడలేదా! అంతెందుకు? నిన్న వందేభారత్ రైలు పూర్తి స్వదేశీ తయారీ అంటూనే సేమెన్స్ కంపెనీ స్పేర్‌పార్టు వాడటం లేదా? ఈ విషయాల లోతుపాతులు మనం అర్థం చేసుకోకుండా, వాట్సప్ యూనివర్సిటీ పరిశోధనలుఫాలో అయిపోతున్నాం!" అన్నాడు కృష్ణ.

నిజమే! మనం జీవితంలో ప్రభుత్వ విధానం వల్ల ఇబ్బందికి గురి అవుతుంటే! మరో పక్క పాకిస్థాన్, చైనా వ్యతిరేకతలు, హైందవ మతానికి ప్రమాదం అంటూ చర్చలు మొదలవుతున్నాయి. వీటిని అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలి! అన్నాడు శంకర్.

- ఉషాకిరణ్, సెల్:9490403545

సరైన విప్లవకారుడిగా ఉండాలంటే ముందు ప్రేమ గురించి తెలిసి ఉండాలి. ఇతరుల కోసం తనను తాను అర్పించుకోగల సామర్థ్యం అత్యంత గొప్పది. అది చే గువేరాలో ఉంది. మనం అతనిని ఉదాహరణగా అనుసరించగలిగితే ప్రపంచం మరింత అందమైన ప్రదేశంగా ఉంటుంది"





"చే గువేరాను అనుసరిస్తే ప్రపంచం మరింత అందమైన ప్రదేశం"

క్యూబా... అత్యంత చిన్న దేశం. అయినా ప్రపంచాన్ని కుదిపేసిన కరోనా వైరస్‌ను తమ సరిహద్దుల్లోకి రానీయకుండా కట్టడి చేయగలిగింది. గొప్ప వారమంటూ విర్రవీగే పెద్ద పెద్ద దేశాలకు సైతం వైద్య సేవలు అందించి అండగా నిలిచింది. అమెరికన్ సామ్రాజ్యవాదం అనుక్షణం ఆంక్షలు పెడుతున్నా ఐక్యతతో తిప్పి కొడుతూ దృఢంగా నిలబడ్డ గొప్ప చరిత్ర కలిగిన దేశం. విప్లవ వీరుడు చే గువేరా స్ఫూర్తితో క్యూబా దేశాభివృద్ధిలో భాగం పంచుకుంటున్నారు ఆయన కూతురు డాక్టర్ అలైదా గువేరా. తండ్రి గుండెలపై ఆడింది అతి తక్కువ కాలమైనా... ఆయన పంచిన ప్రేమను, విప్లవ బాటను తన నిలువెల్లా నింపుకుంది. "సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిద్దాం... ప్రపంచ శాంతిని కాపాడుకుందాం.." అంటూ ప్రపంచ మంతా చాటిచెబుతుంది. క్యూబా సంఘీభావ యాత్రలో భాగంగా దేశమంతటా పర్యటిస్తూ ఈ రోజు హైదరాబాద్ నగరానికి విచ్చేసిన ఆమెకు తెలంగాణ గడ్డ ఘన స్వాగతం పలికింది. ఈ సందర్భంగా మన ప్రత్యేక అతిథి గురించి కొన్ని విశేషాలు...

అలైదా గువేరా మార్చ్ 24 నవంబర్, 1960లో పుట్టారు. తండ్రి క్యూబా విప్లవ వీరుడు ఎర్నెస్టో చే గువేరా, తల్లి అలైదా మార్చ్. వీరికి పుట్టిన నలుగురు పిల్లల్లో అలైదానే పెద్దది. ఈమె చిన్నతనం నుండి చదువులో ముందుండేది. ప్రస్తుతం ఆమె హవానాలోని విలియం సోలర్ చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో వైద్యురాలిగా పని చేస్తున్నారు. "ప్రపంచంలో ఎక్కడ ఎప్పుడు ఎవరికి అన్యాయం జరిగినా స్పందించేందుకు సిద్ధంగా ఉండు" అన్న తండ్రి మాటలను స్ఫూర్తిగా తీసుకున్నారు. ఆ మాటలను నిజం చేస్తూ అంగోలా, ఈక్వెడార్, నికరాగ్వాలో ప్రజలకు వైద్య సేవలు అందించారు.

స్వతంత్ర భావాలతో ఎదిగారు

కాంగోలో విప్లవం తీసుకొచ్చేందుకు చే గువేరా క్యూబాను విడిచిపెట్టి వెళ్ళినపుడు అలైదా వయసు కేవలం నాలుగున్నర సంవత్సరాలు. బొలీవియాలో తండ్రి కాల్చివేయబడినపుడు ఆమెకు ఏడు సంవత్సరాలు. అయినప్పటికి తండ్రికి సంబంధించిన జ్ఞాపకాలు ఆమెలో అలా నిలిచిపోయాయి. తండ్రి మరణించిన తర్వాత తల్లితో పాటు క్యూబా మాజీ అధ్యక్షుడు ఫైడల్ కాస్ట్రో దిశానిర్దేశంలో ఆమె పెరిగారు. విద్యార్థి, యువజన ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. స్వతంత్ర భావాలతో ఎదిగారు. గతంలో ప్రపంచ యువజన మహాసభలు జరిగినపుడు వాటిలో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చారు. 'చే'లోని సుగుణాలు, సమాజం పట్ల బాధ్యత, విప్లవ పోరాట తత్వాన్ని అణువణువునా నింపుకున్నారు. రాజకీయ పరంగా అనేక పదవులు ఆమె వద్దకు వచ్చిన తిరస్కరించి సేవకే అంకితమైన గొప్ప వ్యక్తిత్వం ఆమెది. తండ్రిలాగే అధ్యయనంలో ఆమెది అందెవేసిన చెయ్యి. ప్రతి విషయాన్ని సూక్ష్మంగా పరిశీలిస్తారు. ప్రభుత్వం, విప్లవ పార్టీలు తమ కుటుంబానికి సహాయసహకారాలు అందించేందుకు ముందుకు వచ్చినా వాటిని సున్నితంగా తిరస్కరించి సాదాసీదా జీవితాన్నే గడిపారు. దీంతో తండ్రికి అసలు సిసలైన వారసురాలిగా నిరూపించుకున్నారు.

అపురూపంగా చూసుకునే వాళ్ళం

తండ్రి గురించి మాట్లాడుతూ "మా బాల్యాన్ని ఆస్వాదించే అవకాశం నాన్నకు లేదు. మాతో ఉన్నప్పుడు జంతువుల కథలను ఎక్కువగా చెబుతుండేవారు. ప్రపంచంలో అణిచివేతకు గురౌతున్న మానవ సమూహాలను ప్రేమించాలని చెప్పేవారు. ఆయన మాకు దూరంగా ఉన్నా మా గురించి ఎప్పుడూ ఆలోచిస్తూనే ఉండేవారు. మా కోసం ఉత్తరాలు రాసే వారు. అందులో ఎన్నో మంచి కథలు ఉండేవి. కొన్ని సార్లు బొమ్మలు కూడా గీసి పంపించేవారు. వాటిని మేమెంతో అపురూపంగా చదువుకునే వాళ్ళం. అలాగే సామాజిక సేవా కార్యక్రమాలకు తీసుకుపోయేవారు" అంటూ గుర్తు చేసుకున్నారు.

తండ్రి ప్రభావం

అలైదా చిన్నతనం నుండి పుస్తకాలు విపరీతంగా చదివేవారు. వారి ఇంటి నిండా పుస్తకాలు ఉండేవి. ఒక రోజు తల్లి చేతితో రాతలో ఉన్న ఒక పుస్తకాన్ని



తల్లి, తండ్రి,సోదరులతో చిన్ని అలైదా

ఆమె చేతికి ఇచ్చింది. దాన్ని పూర్తిగా చదివి ఎంతో స్ఫూర్తిపొందానని చెప్పింది. అంతా చదివిన తర్వాత అది నీ తండ్రి జీవితమే అని చెబితే ఆమె ఉప్పొంగిపోయింది. తన తండ్రి అంతటి గొప్ప విప్లవ వీరుడైనందుకు గర్వపడింది. తర్వాత కాలంలో ఆ పుస్తకం 'చే గువేరా మోటర్ సైకిల్ డైరీ' పేరుతో ముద్రితమై ప్రపంచ వ్యాప్తంగా ప్రచారమయింది. ఎందరిలోనే స్ఫూర్తి నింపింది.

మెరుగైన స్థితిలో ఉంటాము

'మా నాన్న రచనలు జోస్ మార్టీ లాగా ఉంటాయి. ఆయన నేర్చుకున్న విలువలు శాశ్వతమైనవి" అంటారు అలైడా. తనకు స్ఫూర్తి తన తండ్రే అంటారు. ప్రపంచవ్యాప్తంగా పర్యటిస్తున్నపుడు తన ప్రసంగాలలో తండ్రి రచనలను ప్రస్తావిస్తూ "రాజకీయ అవగాహన, భావోద్వేగ పరిపక్వత" కోసం నాకు మా నాన్న డైరీలు ప్రత్యక్షంగా సహాయపడతాయని చెబుతారు. "మనం ఆయన సూచనను ఆచరణలో పెట్టినపుడు మనం మెరుగైన స్థితిలో ఉంటాము" అంటారు ఆమె. తిరుగుబాటుకు చిహ్నంగా తన తండ్రి గురించి అందరూ మాట్లాడుకుంటుంటే ఆమె మరింత స్ఫూర్తి పొందుతున్నారు. ఒక పిల్లవాడు చే చిత్ర పటాన్ని పట్టుకొని ఊరేగింపులో వెళుతూ "నేను చే లాగా విజయం సాధించే వరకు పోరాడాలని కోరుకుంటున్నాను" అని ఆ పిల్లవాడు చెప్పినప్పుడు ఆమె అంత గొప్ప వీరుడి కూతురిగా ఉప్పొంగిపోయారు.

ప్రేమించడం నేర్చుకోవాలి

"మా నాన్నకు ఎలా ప్రేమించాలో తెలుసు. అది అతనిలోని అత్యంత అందమైన లక్షణం. సరైన విప్లవకారుడిగా ఉండాలంటే ముందు ప్రేమ గురించి తెలిసి ఉండాలి. ఇతరుల కోసం తనను తాను అర్పించుకోగల సామర్థ్యం అత్యంత గొప్పది. అది చే గువేరాలో ఉంది. మనం అతనిని ఉదాహరణగా అనుసరించగలిగితే ప్రపంచం మరింత అందమైన ప్రదేశంగా ఉంటుంది" అంటారు ఆమె.

ఉదాసీనతకు వ్యతిరేకంగా...

ఎలైదా అంగోలాలో క్యూబన్ మెడికల్ మిషన్‌లో భాగంగా గడిపిన సమయాన్ని అత్యంత గొప్ప రోజులుగా గుర్తుపెట్టుకున్నారు. ఆ అనుభవాన్ని ఆమె మాటల్లోనే తెలుసుకుందాం. "నేను చాలా మంది పిల్లల ప్రాణాలను కాపాడగలిగాను. కానీ కొన్నిసార్లు నేను వారి కోసం ఏమీ చేయలేకపోయాను. అలాంటప్పుడు దుఃఖం, పశ్చాత్తాపం మనతో ఎప్పటికీ నిలిచి ఉంటాయి. ఆ సమయంలో అనుభవించిన బాధ, జాత్యహంకారం, మానవులపై జరిగే దోపిడీ, తరచుగా ఉదాసీనతకు వ్యతిరేకంగా పని చేసేలా నన్ను ప్రేరేపించాయి" అంటారు ఆమె.

నిర్ణయాధికారంలో క్యూబా మహిళలు

ఇటీవలె కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో జరిగిన ఐద్వా 13వ అఖిల భారత మహాసభలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ "ఇలా మిమ్మల్ని కలవడం చాలా సంతోషంగా వుంది. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా మా క్యూబా దేశం ఎంతో పోరాటం చేసింది. ఇంకా చేస్తూనే వుంది. క్యూబాలో మహిళలను నిర్ణయాధికారంలో భాగస్వామ్యం చేయడంలో అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రస్తుతం మా పార్లమెంటులో 52శాతం, రాష్ట్ర కౌన్సిల్స్‌లో 53శాతం మంది మహిళలు వున్నారు. అలాగే 4 రాష్ట్రాలకు గవర్నర్లుగా, 12 మంది వైస్ గవర్నర్లుగా, 88 మంది అధ్యక్షులుగా, 58 మంది మేయర్లుగా మహిళలు వున్నారు. మహిళలకు అన్నింట్లో సమాన బాధ్యలు ఇచ్చేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాం. తర్వాతి తరాల వారిని ఒక మంచి మార్గంలో నడిపేందుకు అవసరమైన విద్య అందిస్తున్నాము. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నాం. మహిళలకు ప్రత్యేక ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేశాము. వీటిలో ఎంతో మంది వాలింటీర్స్‌గా పని చేయడానికి వస్తున్నారు. గత ఏడాది 841 ట్రైనింగ్ సెంటర్లు పెడితే వీటిలో 50వేల మంది మహిళలు పాల్గొన్నారు. మహిళల కోసం ఇంకా చేయాల్సి వుంది. వాటిని కూడా చేస్తాం. ప్రపంచ వ్యాప్తంగా మహిళలు అద్భుతమైన పోరాటాలు చేయాలి. రేపటి వెలుగు కోసం ఉద్యమించాలి.

చావెజ్, వెనిజులా - న్యూ లాటిన్ అమెరికా

వెనిజులా మాజీ అధ్యక్షుడు చావెజ్‌ను ఆమె ఎన్నో సార్లు కలిసి ఇంటర్వ్యూ చేశారు. ఆ విశేషాలన్నింటిని కలిపి ఫిబ్రవరి 2004లో 'చావెజ్, వెనిజులా -న్యూ లాటిన్ అమెరికా' పేరుతో పుస్తకంగా తీసుకొచ్చారు. ఈ పుస్తకం ఒక డాక్యుమెంటరీగా మార్చబడింది. అందులో బొలివియ విప్లవం గురించి చావెజ్‌తో చేసిన ఇంటర్వ్యూ సారాంశాలు, ప్రపంచానికి సేవలు చేస్తున్న క్యూబా వైద్యులతో ఇంటర్వ్యూలు ఉన్నాయి.

వైద్యురాలిగా ఎన్నో సేవలు

ఎలైదా క్యూబాలో వికలాంగ పిల్లల కోసం రెండు ఆశ్రమాలు, శరణార్థి పిల్లల కోసం మరో రెండు ఆశ్రమాలు నడుపుతున్నారు. పుట్టుకతో అలెర్జీలతో బాధపడేవారి కోసం పని చేసే ప్రత్యేక శిశువైద్యురాలిగా ఆమె మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తూర్పు క్యూబాలోని రియో కౌటో చుట్టుప్రక్కల వరదలు ముంచెత్తే ప్రాంతంలో వైద్య సేవలు అందించారు. 2008లో తుఫానుల వల్ల నాశనమైన యూత్ ద్వీపంలో పని చేశారు. 2013 మే 4 నుండి 8 వరకు క్రొయేషియాలోని జాగ్రెబ్‌లో జరిగిన సబ్‌వర్సివ్ ఫెస్టివల్ సమావేశాలు, చర్చల్లో ప్రజా మేధావిగా, ఓ కార్యకర్తగా పాల్గొన్నారు. అక్కడ స్లావోజ్ జిజెక్, తారిక్ అలీ వంటి ప్రముఖుల పక్కన ముఖ్య వక్తగా మాట్లాడారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు. ప్రొ.ఎస్టీఫానియా, సెలియా.

– సలీమ

పత్తి ధర ఢమాల్..

(మొదటిపేజీ తరువాయి)

వరకు జాడలేదు. జిన్నింగ్ మిల్లుల్లోనే కొనుగోలు చేస్తారని ప్రకటన చేసినప్పటికీ ఎక్కడా కొన్నది లేదు. కేంద్రం నిర్ణయించిన మద్దతు ధర రూ.6,380 మాత్రమే సీసీఐ కొనుగోలు చేయాలి. అంత కంటే ఎక్కువ ధర మార్కెట్‌లో వ్యాపారులు పెడుతున్నందున రైతులు అటువైపే మొగ్గుచూపడం వల్ల సీసీఐ కొనుగోలు చేయకుండా చేతులు దులుపుకుంది. జిన్నింగ్ మిల్లుల్లోనూ పత్తి కొనుగోళ్లు సాగట్లేదు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 45 జిన్నింగ్ మిల్లులున్నాయి. సంగారెడ్డిలో 19, సిద్దిపేటలో 25 మిల్లులున్నాయి. అంతర్జాతీయం మార్కెట్‌లో పత్తికి డిమాండ్ తగ్గడంలో మిల్లర్లు కూడా కొనట్లేదు. దీంతో రైతులు పత్తిని ఇండ్లల్లో నిల్వ చేశారు. ఒక్కో రైతు ఇంట్లో 20 క్వింటాళ్ల నుంచి వంద క్వింటాళ్ల వరకు నిల్వ చేశారు.

గతేడాది కంటే సగం ధర

గతేడాది పత్తి క్వింటాల్‌కు రూ.14 వేల వరకు వచ్చింది. అదే ఆశతో రైతులు ఈసారి సాగు విస్తీర్ణం పెంచారు. ఈసారీ మొదట్లో బాగానే ఉన్నా.. పత్తి మార్కెట్‌కు రావడం పెరిగే సరికి ధర ఒక్కసారే పడిపోయింది. ఈ ఏడాది ముందస్తుగా సాగు చేసిన రైతులు పంట తొలుత ఏరి అమ్ముకుంటే రూ.9,500 వరకు పలికింది. గతేడాది కంటే నాలుగైదు వేలు తగ్గినా పర్వాలేదు అనుకున్న రైతులు పత్తిని మార్కెట్‌కు తీసుకెళ్లే కొద్ది ధర తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం రూ.7,500 నుంచి రూ.8,100 కంటే ఎక్కువ రావట్లేదు. ఇండ్లల్లో ఉన్న పత్తి నిల్వల్ని ఎలా అమ్ముకోవాలో అంతుచిక్కక రోడ్లెక్కి ఆందోళన చేస్తున్నారు.

తగ్గిన దిగుబడులు.. పెరిగిన పెట్టుబడి

ఈ ఏడాది పత్తి పెట్టుబడులు పెరిగాయి. జూన్, జులైలో పత్తి విత్తనం వేశాక భారీ వర్షాలు, వరదలొచ్చాయి. దీంతో పత్తి చేళ్లలన్నీ జాలువారిపోయాయి. మొలకెత్తకపోవడంతో రెండు మూడు సార్లు విత్తుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత పైర్లు పెరుగుతున్న క్రమంలోనూ వరుసగా వర్షాలు పడటంతో కలుపు పెరిగిపోయింది. పూత, కాత దశలోనూ వర్షాలు పడటంతో రాలిపోయింది. అధిక తెగుళ్లు ఆశించడం వల్ల పురుగు మందులు నాలుగైదు సార్లు పిచికారీ చేయడంతో ఎకరాలకు రూ.పది వేల వరకు ఖర్చు పెరిగింది.

వాతావరణం అనుకూలిస్తే ఎకరాకు 10 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయి. పైర్లకు నష్టమేర్పడటం వల్ల ఐదారు క్వింటాళ్ల దిగుబడే వచ్చిందని రైతులు పేర్కొంటున్నారు. మిట్ట ప్రాంతాల్లో వర్షాల వల్ల నష్టమేర్పకుండా పైర్లు బాగానే ఉన్న చోట ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది.

అంతర్జాతీయంగా తగ్గిన డిమాండ్

అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తికి డిమాండ్ తగ్గింది. పత్తి బేల్ రేటు రూ.1.14 లక్షల నుంచి రూ.65 వేలకు పడిపోయింది. దేశ వ్యాప్తంగా 30 శాతం జిన్నింగ్ మిల్లులు నడుస్తలేవు. దీంతో దారం(యార్న్) కూడా అమ్ముడుపోవడం లేదు. దారం ధర సగటున కిలోకు రూ.200 తగ్గింది. ఇలాంటి పరిస్థితుల్లో బేళ్లను గోదాముల్లో నిల్వ చేసే పరిస్థితి పోయి దారం నిల్వ చేయాల్సి వస్తుందంటున్నారు. పత్తి బేళు దారంతోపాటు గింజల ధరలు కూడా బాగా తగ్గిపోయాయి. సీజన్ మొదట్లో గింజలు టన్నుకు 38 వేల నుంచి రూ.40 వేలు ఉండగా ప్రస్తుతం రూ.33 వేలు కూడా లేదంటున్నారు. ముఖ్యంగా దేశంలోని తమిళనాడుతో పాటు అంతర్జాతీయ మార్కెట్ అయిన బ్రెజిల్, బంగ్లాదేశ్, చైనా, వియత్నాం, ఆఫ్రికా, యూరప్ దేశాల్లో కూడా డిమాండ్ లేదని జిన్నింగ్ మిల్లుల యజమానులు, వ్యాపారులు పేర్కొంటున్నారు.

దిగుమతులపై సుంకం భారం

కేంద్ర ప్రభుత్వం పత్తి దిగుమతులపై 11 శాతం సుంకం విధించింది. ఒక్కో క్యాండీకి రూ.7 నుంచి 8 వేల భారం పడటంతో దారం దిగుమతులు నిలిచిపోయాయి. సుంకం చెల్లించడం భారమని చెప్పి వ్యాపారులు స్థానికంగా ఉన్న బేళ్లు, దారాన్నే కొంటున్నారు. గార్మెంట్ తయారీకి దేశీయ పత్తినే వినియోగిస్తున్నారు. మరో పక్క గార్మెంట్ ఎగుమతులకు గిరాకీ లేదు. ప్రధాన మార్కెట్ అయిన బంగ్లాదేశ్ దగ్గర యూరప్ దేశాలు కొనడం లేదు. తక్కువ ధరకు ఇస్తున్న ఆస్ట్రేలియా, బ్రెజిల్ నుంచే కొనుగోలు చేస్తున్నట్టు తెలుస్తుంది.

మద్దతు ధర రూ.12 వేలివ్వాలి
గొల్లపల్లి జయరాజు– సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి

పత్తికి క్వింటాల్‌కు రూ.12 వేలు ఇవ్వాలి. సీసీఐ ద్వారా పండిన పత్తినంతా కొనుగోలు చేయాలి. కేంద్ర ప్రభుత్వం పత్తికి కనీస మద్దతు ధర రూ.6380 మాత్రమే ప్రకటించింది. దీంతో సీసీఐకి రైతులెవ్వరూ అమ్మట్లేదు. మార్కెట్‌లో వ్యాపారులు పది వేలలోపుకు కొంటుంటే సీసీఐ మాత్రం రూ.6380కే కొంటామనడం సరికాదు. పత్తి సాగు పెరుగుతున్నందున కేంద్రం మద్దతు ధరను పెంచాలి. రైతుల ఇండ్లల్లో క్వింటాళ్ల కొద్ది పత్తి నిల్వలున్నాయి. వెంటనే ధర పెంచి కొనుగోలు చేయాలి.

కౌలుకు సరిపోవట్లేదు



ఐదెకరాలు స్వంత భూమితో పాటు ఏడెకరాలు కౌలుకు సాగు చేశా. 70 క్వింటాళ్ల పత్తి పండింది. అమ్ముకుంటే కౌలు, పెట్టుబడిపోగా ఏమీ మిగల నట్టుంది. పోయినేడు క్వింటాకు రూ.14 ధర వచ్చింది. ఇప్పుడేమో రూ.7వేలే అంటున్నరు. తక్కువ ధరకు అమ్మితే పంట సాగు కోసం చేసిన అప్పు, కౌలు, ఆరుగాలం కష్టం ఏం కావాలి. బయటి దేశాలకు పత్తి పోతలేదని మిల్లుల్లో ధర పెడతలేరు. ధర లేదని నిల్వ చేసినం. ఎంత కాలం పంటను దాచుకోవాలి. ప్రభుత్వం పత్తికి ధర రూ.12 వేలు ఇవ్వాలి.

రైతు బాలయ్య

ధర లేకనే నిల్వ చేసుకుంటున్నాం



గ్రామంలో 10 ఎకరాల వరకు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేశాను. 75వేల క్వింటాళ్ల పంట దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో సరైన ధర లేని కారణంగా పత్తిని విక్రయించకుండా ఇంట్లో నిల్వ చేశాను. ధర పెరుగుతుందనే ఆశతో ఉన్నాం. కనీసం క్వింటాల్‌కు రూ.10వేల వరకైనా పెంచితే బాగుంటుంది.

కిల్చెట్టి సంతోష్– చెప్రాల– బేల మండలం– ఆదిలాబాద్ జిల్లా

ఐదెకరాల్లో పత్తేసిన ధరలేదు : రైతు డాకయ్య



సొంత భూమి రెండెకరాలు, కౌలుకు మూడెకరాల్లో పత్తి వేసిన. 15 క్వింటాళ్ల పత్తి వెళ్లింది. అమ్ముదామంటే ధర లేదు. క్వింటా ఏడు వేలకే అడుగుతున్నరు. రెండు సార్లు విత్తనాలు విత్తిన. పురుగుమందుల ఖర్చు రెండింతలైంది. వర్షాల వల్ల దిగుబడి తగ్గింది. పంట సాగు ఖర్చు పెరిగి, దిగుబడి తగ్గి బాధపడుతున్న వేళ ఉన్న ధర పడిపోయే సరికి గుండె ఆగేంత పనైంది. సర్కారే ధర పెంచి కొనాలి. లేదంటే రైతు వ్యవసాయం మానేయాల్సి వస్తది.

ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాణిక్ సర్కార్ మీడియాతో మాట్లాడుతూ, "ఇక్కడ బీజేపీ అధికారంలోకి వచ్చింది మొదలు, ప్రతిపక్ష నేతలపై దాడులకు పాల్పడుతోంది. వారి కార్యాలయాలను ధ్వంసం చేస్తోంది. 2018 తర్వాత ఇక్కడ జరిగిన ఏ ఎన్నికలూ స్వేచ్ఛగా నిర్వహించలేదు. ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు కనీసం నామినేషన్ వేసే పరిస్థితి లేదు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదు. మా ఫిర్యాదులేవీ పట్టించుకోవటం లేదు. రాష్ట్రంలో 48 మంది జర్నలిస్టుల హత్యలు జరిగాయి. అత్యంత జనాదరణ పొందిన ఆరు న్యూస్ ఛానల్స్ మూతపడ్డాయి. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పట్టపగలు ఐదు మీడియా కార్యాలయాలపై దాడులకు తెగబడ్డారు. ఐదేండ్లయినా దోషులపై చర్యలు లేవు. ప్రతిపక్షాలపై జరిగిన 2500కుపైగా దాడులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు నమోదయ్యాయి. ప్రతిపక్షాలకు చెందిన ఎంతోమంది అమాయక కార్యకర్తల్ని చంపేశారు. ఇలాంటి తరుణంలో అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. వీటినైనా స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నా"మని చెప్పారు.

నాన్న విప్లవ స్ఫూర్తితో..

(మొదటిపేజీ తరువాయి)

కూడా హైదరాబాద్‌కు రానున్నారు. అలైదా గతంలో ఇండియాలో పర్యటించగా.. ఎస్తేఫానియా తొలిసారి మన దేశంలో అడుగుపెడుతున్నారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం నగరంలోని రవీంద్రభారతిలో 'క్యూబా సంఘీభావ సభ'ను నిర్వహించనున్నారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి వి.శ్రీనివాసగౌడ్‌తోపాటు ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, జస్టిస్ రాధారాణి, రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు, ప్రొఫెసర్ హరగోపాల్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, ప్రజా కళాకారిణి విమలక్క తదితరులు ఆ సభకు హాజరుకానున్నారు. సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, పలు పత్రికల సంపాదకులు కూడా సభలో పాల్గొంటారు. ప్రస్తుత బీజేపీ పాలనలో మనదేశం అత్యంత సంక్లిష్ట, సంక్షుభిత పరిస్థితులను ఎదుర్కొంటున్న తరుణంలో ఈ సభను జయప్రదం చేయటం ద్వారా అటు పెట్టుబడిదారీ విధానాన్ని, మతోన్మాదాన్ని వ్యతిరేకించటంతోపాటు ఇటు సామ్రాజ్యవాద ప్రతిఘటనా పోరులో భాగస్వాములు కావాలని ఆ సభ కో ఆర్డినేటర్లు ఎస్.బాలమల్లేశ్, డిజి నర్సింహారావు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

మోడీ ప్రభుత్వంపై కాంగ్రెస్ చార్జిషీట్

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ పార్టీ 'హాథ్ సే హాథ్ జోడో అభియాన్' ప్రచారాన్ని చేపట్టనుంది. ఇందుకు సంబంధించిన లోగోతో పాటు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక చార్జిషీటును శనివారం నాడిక్కడ విడుదల చేసింది. ఈ సందర్భంగా ఏఐసీసీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి రెండు నెలల పాటు 'హాథ్ సే హాథ్ జోడో' ప్రచారం సాగనుందని తెలిపారు. రాహుల్ గాంధీ సారథ్యంలోని జోడో యాత్ర సందేశాన్ని సామాన్య ప్రజానీకానికి సైతం చేరవేసేందుకు ఈ ప్రచారం చేపడుతున్నట్టు తెలిపారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విడుదల చేసిన చార్జిషీటును ప్రాతిపదికన ఆయా రాష్ట్రాలకు చెందిన ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలు (పీసీసీలు) చార్జిషీట్లు తయారు చేస్తాయని వేణుగోపాల్ తెలిపారు. మోడీ ప్రభుత్వ అవినీతి, అవకతవకల పాలన కారణంగా ప్రజలకు ఎదురైన ఇబ్బందులను పరిష్కరించేందుకు తమ పార్టీ కృషి చేస్తుందన్నారు. 130 రోజుల చారిత్రక ప్రోగ్రాం (భారత్ జోడో యాత్ర) తరువాత దేశ ప్రజల నుంచి విస్తృత సమాచారాన్ని కాంగ్రెస్ పార్టీ సేకరించిందనీ, లక్షలాది మంది రాహుల్ గాంధీ అడుగులో అడుగులు వేసి ఆయనతో సంభాషించారని అన్నారు. మోడీ ప్రభుత్వ తప్పిదాల పాలన కారణంలో ప్రజలు ఎదుర్కొన్న బాధలను తాము అవగతం చేసుకున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరామ్ రమేష్ మాట్లాడుతూ తమ పార్టీ చేపట్టనున్న ఇంటింటి ప్రచారం 6 లక్షల గ్రామాలు, 2.5 లక్షల గ్రామ పంచాయతీల్లోని 10 లక్షల పోలింగ్ బూత్‌లకు తీసుకువెళ్తామని చెప్పారు. 'హాథ్ సే హాథ్ జోడో' ప్రచారం జనవరి 26 నుంచి మార్చి 26 వరకూ జరుపుతామన్నారు. పార్టీ కార్యకర్తలు ఇంటింటికి తిరిగి రాహుల్ గాంధీ లేఖను ప్రజలకు అందజేస్తారని చెప్పారు.

సగం సగం..

(మొదటిపేజీ తరువాయి)

అంటున్నారు. దీంతో ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతులు లేకపోవటం ఉన్నత విద్యారంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. వర్సిటీల్లో పరిశోధన, ఆవిష్కరణలు పడిపోతున్నాయి. ఈ రంగంలో స్వల్ప, మధ్య ఆదాయ దేశాల వ్యయం (జీడీపీలో) 1.5శాతం దాటుతోంది. భారత్‌లో మాత్రం 1శాతం లోపే. ఆరోగ్యం, రక్షణ, వ్యవసాయ పరిశ్రమల్లో పరిశోధన, ఆవిష్కరణల్ని ప్రోత్సహిస్తూ పలు దేశాలు ముందుకెళ్తుంటే, మనదగ్గర వ్యయంపై కోతలు విధిస్తున్నారు.

సామాజిక సంక్షేమం

ఉపాధి హామీ, గ్రామ్ సడక్ యోజన, మధ్యాహ్న భోజనం, ఆయుష్మాన్ భారత్.. మొదలైన వాటిపై బడ్జెట్ గణాంకాలు అంత గొప్పగా ఏమీలేవు. ప్రపంచంలోనే అతిపెద్ద సంక్షేమ పథకంగా పేరొందిన 'ఉపాధి హామీ' (నరేగా)ని బలహీన పర్చడానికి కేంద్రం చేయని ప్రయత్నం లేదు. క్రితం బడ్జెట్‌లో రూ.98వేలు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్ (2022–23)లో రూ.73వేల కోట్లు కేటాయించింది. 25.2శాతం నిధులు కోతపెట్టింది. కోవిడ్ సంక్షోభం, లాక్‌డౌన్ నిబంధనల వల్ల పట్టణాల్లోని కోట్లాది మంది ఉపాధి కోల్పోయి గ్రామాలకు తరలివెళ్లారు. వారిని ఆదుకునేందుకు 'నరేగా' పెద్ద దిక్కుగా మారింది. అయినా వేతనాల చెల్లింపుల్లో వేల కోట్లు బకాయిలున్నాయి.9ఏండ్ల క్రితం మన్మోహన్ సర్కార్ 'నరేగా'పై వ్యయం (మొత్తం బడ్జెట్‌లో) 2.4శాతం. ఇప్పుడు కేంద్రం చేసిన వ్యయం 2.6శాతం. సంక్షోభ సమయంలోనూ పథకంపై వ్యయాన్ని కేంద్రం పెంచలేదని గణాంకాలు చెబుతున్నాయి. ఆయుష్మాన్ భారత్ పథకంలో గణాంకాలతో గారడీ చేస్తోంది. 2018–19లో రూ.6400కోట్లు కేటాయించింది. వాస్తవ వ్యయం రూ.3200 కోట్ల దగ్గర ఆగిపోయింది. 2020–21లోనూ కేటాయింపు రూ.6వేల కోట్ల పైన చూపారు, వ్యయం రూ.3100 కోట్లు మాత్రమే. క్రితం ఏడాది (2021–22) వాస్తవ వ్యయం రూ.3199 కోట్లు ఉండగా, 2022–23లో దానికి రెట్టింపు రూ.6412 కేటాయింపులు చేసింది. వాస్తవ వ్యయానికి రెట్టింపు కేటాయింపులు చూపుతూ దేశ ప్రజల్ని కేంద్రం మభ్యపెడుతోంది.

ఫిబ్రవరి 3 నుంచి అసెంబ్లీ సమావేశాలు

(మొదటిపేజీ తరువాయి)

ఇస్తామని కేసీఆర్ గతంలో ప్రకటించడంతో వీటిపై అసెంబ్లీలో ఆయన ఏం చెప్పబోతున్నారనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. ప్రస్తుత ఏడాదిలో అంచనా వేసిన మేరకు కేంద్ర గ్రాంట్లు, అప్పులు అందడంలేదు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకునే బడ్జెట్ రూపకల్పన ఉంటుందని అధికారిక వర్గాలు అంటున్నాయి.

పసుపు బోర్డు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోండి

- తెలంగాణ రైతు సంఘం డిమాండ్

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

పసుపుబోర్డును ఏర్పాటు చేసి, ఆ రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. వ్యాపారస్తులంతా కుమ్మక్కై పసుపు ధరను ఒకేసారి క్వింటాలుకు రూ.5వేల నుంచి రూ.5,500 వరకు తగ్గించి కొనుగోలు చేస్తున్నారని పేర్కొంది. నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, వరంగల్, కరీంనగర్ తదితర ప్రాంతాల్లో రైతులు భారీగా నష్టపోతున్నారని వివరించింది.

ఈమేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్, టి సాగర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సీజన్‌లో పసుపు మార్కెట్‌కు రావడం ప్రారంభమైందనీ, రైతుల నిస్సహాయ స్థితిని దృష్టిలో ఉంచుకుని వ్యాపారస్తుల ఇలాంటి దుర్మార్గానికి ఒడిగడుతున్నారని విమర్శించారు. 2012లో పసుపు క్వింటాలు ధర రూ.15వేలు ఉండేదని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ధర పెరగలేదు కానీ భారీగా ఉత్పత్తి ఖర్చు పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఎకరానికి రూ. 1,25,000 నుంచి రూ. 1,50,000 వరకు కనీస ఖర్చు చేస్తుండగా, ఇదే సమయంలో ఈ సంవత్సరం ఉత్పాదకత కూడా బాగా తగ్గుతుందని పేర్కొన్నారు. ఇప్పటి పరిస్థితుల్లో సగం పెట్టుబడిని కూడా రైతులు రాబట్టుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ నేపథ్యంలో వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వ సంస్థ ద్వారా పసుపును కొనిపించి, ప్రాసెస్‌చేసి అమ్మించి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంలో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయోత్పత్తులు, టెక్స్‌టైల్స్, హ్యాండిక్రాఫ్ట్స్ లాంటి ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు జాతీయ సహకార ఎగుమతి సంస్థను ఏర్పాటు చేస్తున్నట్టు వార్తలొస్తున్నాయని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రం నుంచి వ్యవసాయోత్పత్తుల ఎగుమతిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర వ్యవసాయోత్పత్తులను సేకరించి, శుద్ధిచేసి, ఎగుమతి చేసేందుకు ఒక ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. రైతుల సంక్షోభ పరిస్థితులను చక్కదిద్దేందుకు చట్టబద్ధమైన కనీస మద్దతు ధరలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిచో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన పోరాటాలకు సన్నద్ధమవుతామని హెచ్చరించారు.

ఓయూ వీసీని కలిసిన విద్యార్థి నాయకులు

నవతెలంగాణ-ఓయూ



ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించిన పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష లో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు అన్యాయం జరిగిందంటూ ఓయూ వీసీ ప్రొ. రవీందర్ యాదవ్‌ను శనివారం సాయంత్రం పీహెచ్‌డీ ఆశావహులు కలిసి వినతి పత్రం అందజేశారు. విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. పీహెచ్‌డీ ప్రవేశపరీక్షకు సంబంధించి కనీస అర్హత మార్కులను ఓసీలకు 25 మార్కులు, బీసీలకు 20 మార్కులు, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు ఎలాంటి కనీస అర్హత మార్కులు లేకుండా ఇంటర్వ్యూలకు పిలిచి ఖాళీగా ఉన్న సీట్లను నింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో శరత్ నాయక్, రమేష్, అశోక్ నాయక్, నాగరాజు గౌడ్, రాజు నేత, మధు యాదవ్ , పాల్గొన్నారు.

సింహవాహిని దేవాలయ చైర్మెన్‌కు జాతీయ ఐక్యత అవార్డు

నవతెలంగాణ-ధూల్‌పేట్



లాల్ దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళి దేవాలయ చైర్మెన్ (ఫోర్ మెన్ కమిటీ) పోసాని సురేందర్ జాతీయ ఐక్యత అవార్డ్ అందుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సి . కృష్ణ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలుపుతూ శాలువాతో సన్మానించారు. సురేందర్ ముదిరాజ్ చేస్తున్న సేవలను అభినందించారు. అదే విధముగా సమాజ శ్రేయస్సుకు నిరంతరం పాటుపడాలని ఆకాంక్షించారు. ప్రత్యేకంగా యువత సమాజ శ్రేయస్సుకు ఎప్పుడు ముందు నడవాలని సూచించారు

కొల్లూరు 'డబుల్' ఇండ్ల సముదాయం అద్భుతం

- కొల్లూరులో పర్యటించిన హౌసింగ్, పట్టణ వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

హౌసింగ్, పట్టణ వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ శనివారం కొల్లూరులో పర్యటించి డబుల్ బెడ్ రూం ఇండ్ల డిగ్నిటీ హౌసింగ్ ప్రాజెక్టును పరిశీలించింది. రాజీవ్ రంజన్ సింగ్ అధ్యక్షతన గల కమిటీ రాజ్యసభ, లోక్‌సభ సభ్యులతో ఏర్పడిన కమిటీ తెలంగాణలో అమలు చేస్తున్న డబుల్ బెడ్ రూం ఇండ్ల పథకం పై అధ్యయనం చేయడానికి హైదరాబాద్‌కు వచ్చారు.

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిగ్నిటీ హౌసింగ్ పథకం గురించి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ డాక్టర్ ఎన్ సత్యనారాయణ కమిటీ సభ్యులకు వివరించారు. భారత ప్రభుత్వం పీఎంఏవై (అర్బన్) పథకం ద్వారా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న తక్కువ పేదలకు ఆశ్రయం కల్పించడానికి



తెలంగాణ ప్రభుత్వం కొల్లూరులో 15660 2 బీహెచ్‌కే గృహాలు నిర్మించారు. పేదలు ఆత్మ గౌరవంతో బతుకాలనే ఉద్దేశంతో లబ్దిదారులకు ఉచితంగా అందిస్తున్నారు. ఈ పథకంలో ఒక యూనిట్ ధర రూ. 6.05 లక్షలు. ఇందులో మౌలిక సదుపాయాల ఖర్చు రూ.75 వేలు. భారత ప్రభుత్వ వాటా రూ.1.50 లక్షలు కాగా రాష్ట్ర వాటా రూ.4.55 లక్షలుగా వివరించారు.

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు విజన్ మేరకు రెండు పడక గదుల ఇండ్లను లబ్ధిదారులకు ఉచితంగా అందజేస్తున్నట్టు కమిటీ సభ్యులకు తెలియజేశారు. రాష్ట్రంలో ఈ కార్యక్రమం అమలు తీరును కమిటీ సభ్యులు అడిగి తెలుసుకుని ఇంత భారీఎత్తు గృహ నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టినందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించారు. కమిటీ సభ్యులు గృహ సముదాయాలు చుట్టూ తిరిగి ఫ్లాట్లను పరిశీలించారు. నిర్మాణ ఖర్చులను భరించేందుకు ఆదాయ ఉత్పత్తికి వినూత్న చర్యలు చేపట్టడాన్ని సభ్యులు అభినందించారు. సంగారెడ్డి కలెక్టర్ శరత్, రంగారెడ్డి కలెక్టర్ అమోయ్‌కుమార్, జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ లు సంతోష్, ప్రియాంక అలా హౌసింగ్ అధికారి సురేష్ కుమార్,రెవెన్యూ పోలీసు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధిని పట్టించుకోని గత పాలకులు

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నవతెలంగాణ-అంబర్‌పేట



గత పాలకులు అంబర్‌పేట నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు.అంబర్‌పేట డివిజన్ పరిధిలోని ఓవైసీ నగర్‌లో రూ. 9 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా వేయనున్న డ్రయినేజీ పైప్ లైన్ నిర్మాణ పనులకు అంబర్ పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ ప్రాంత ప్రజలు ఇబ్బంది కలగకుండా డ్రయినేజీ పైప్ లైన్ వేసిన వెంటనే దానిపై రోడ్డు వేయాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గాన్ని నగరంలోని అత్యుత్తమ డివిజన్‌గా తీర్చిదిద్దుతానని ప్రజలు ఏమైనా సమస్యలుంటే నేరుగా తనను కలవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ ఏఈ మాజీద్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ రమేష్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు సిద్ధార్థ్ ముదిరాజ్, నాయకులు అమనూరి సతీష్ బాబ్జీ, రాగుల ప్రవీణ్ పటేల్, ఆకుల మల్లేష్, శ్రీనివాస్ యాదవ్, మహేష్ ముదిరాజ్ సంతోష్ చారి, విష్ణు తదితర నాయకులు అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషన్‌ను తక్షణమే అరెస్టు చేయాలి

- ఐద్వా నగర కార్యదర్శి కె.నాగలక్ష్మి



నవతెలంగాణ-ముషీరాబాద్

మహిళా రెజ్లర్ల పై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు,బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషన్‌ను తక్షణమే అరెస్టు చేయాలని ఐద్వా నగర కార్యదర్శి కె.నాగలక్ష్మి డిమాండ్ చేశారు. ఐద్వా గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీ క్రాస్ రోడ్డు వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు దేశంలో ఏ రంగంలోనూ రక్షణ లేకుండా పోతోందన్నారు. మహిళలు క్రీడారంగంలో రాణిస్తూ దేశానికి బంగారు పతకాలు సాధిస్తూ దేశానికి గర్వ కారణంగా ఉంటున్నా ఇంకోవైపు వారిని లైంగికంగా వేధించడం అందోళనకరమన్నారు. బీజేపీ ఎంపీ అయిన బ్రిజ్ భూషన్ ఇటువంటి చర్యలకు పాల్పడడం సిగ్గుచేటని ఒకవైపు బేటీ బచావో అని చెప్పున్న బీజేపీ నేతలు చేతలలో ఇటువంటి చర్యలకు పాల్పడడం దుర్మార్గమని చెప్పారు. బ్రిజ్‌భూషన్ ను తక్షణం అరెస్టు చేయాలని ఐద్వా హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐద్వా నగర నాయకులు వరలక్ష్మి, రాణి, అన్నమ్మ, పద్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

ఇఫ్లూలో విద్యార్థిని అనుమానాస్పద మృతి

- ఆత్మహత్యగా కేసు నమోదు చేసిన పోలీసులు
- పూర్తి విచారణ జరపాలంటున్న విద్యార్థిని తల్లిదండ్రులు

నవతెలంగాణ-ఓయూ



హైదరాబాద్ ది ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ)లో పీజీ విద్యార్థిని అనుమానాస్పద మృతి క్యాంపస్‌లో సంచలనం సృష్టించింది. యువతి హాస్టల్ బిల్డింగ్ పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తుండగా, విద్యార్థిని మృతిపై అనుమానాలు ఉన్నాయని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. తమ కూతురు మృతి గల కారణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని విద్యార్థి తల్లిదండ్రులు కోరుతున్నారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హర్యానా రాష్ట్రం బహాదుర్‌గడ్ జజ్జర్ ప్రాంతానికి చెందిన అంజలి (22) ఇఫ్లూ క్యాంపస్‌లో ఇంగ్లీష్ సబ్జెక్టులో ఎంఏ సెకండ్ ఇయర్ చదువుతూ క్యాంపస్‌లోని మహిళ చందాభాయి (ఎంబీసీ) హాస్టల్ నాలుగో ఫ్లోర్‌లో ఉంటోంది. శనివారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో వర్సిటీలో తాను ఉంటున్న హాస్టల్ భవనం నాలుగో అంతస్తు నుంచి దూకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న ఓయూ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. విద్యార్థిని మరణానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

విద్యార్థిని మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆమె కుటుంబసభ్యులు హుటాహుటిన నగరానికి చేరుకున్నారు. కాగా కుటుంబ కలహాలతో విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు భావిస్తున్నారు. అయితే విద్యార్థిని మృతి పట్ల విద్యార్థి సంఘాలు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నాయి. యువతి పీహెచ్ మాట్లాడుతుండగా కింద పడిపోయిందని పేర్కొన్నారు. దాంతో పాటే విద్యార్థులు వెంటనే క్యాంపస్‌లో ఉండే వర్సిటీ ప్రొఫెసర్ శ్యామ్‌నను, ఇతర అధికారులకు సుమారు 20 సార్లు కాల్ చేసినా స్పందించలేదని, దాదాపు రెండు గంటల వరకు ఎవరూ సంఘటనా స్థలానికి రాలేదని, దీంతో తీవ్ర రక్తస్రావం జరిగి విద్యార్థిని మృతి చెందినట్టు విద్యార్థి సంఘ నాయకులు కుమార్ ఆరోపించారు. లేడీస్ హాస్టల్ సెక్యూరిటీ రక్షణ చర్యలు, గ్రిల్స్ లేకపోవడం వల్లే ఆ యువతి కింద పడి చనిపోయిందని ఆరోపిస్తున్నారు. విద్యార్థిని మృతి పట్ల సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు.

అగ్ని ప్రమాద బాధితులకు ముజీబ్ ఆహార వితరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

బేగంపేటలోని డెక్కన్ స్టోర్ భవనంలో చెలరేగిన మంటల కారణంగా రెండు రోజులుగా తీవ్రమైన పొగతో స్థానికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దాంతో స్థానికంగా నివసించే సుమారు 200 కుటుంబాలను సికింద్రాబాద్ మండల రెవెన్యూ అధికారి, ఫైర్, పోలీస్ సిబ్బంది సురక్షిత శిబిరంలోకి తరలించారు. ఈ క్రమంలో టీఎన్‌జీవో యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, అసద్ అన్సార్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు 'సేవరత్న' సేవా భూషణ్, ప్రజారత్న డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వాశ్రయులైన వారి కుటుంబాలతో పాటు పోలీస్, అగ్నిమాపక, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా సిబ్బందికి శాఖాహార భోజన సదుపాయం ఏర్పాటు చేసి.. ఆహార వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ మండల రెవెన్యూ అధికారిణి శైలజ, జిల్లా కార్యదర్శి ఎస్.విక్రమ్ కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు కె.ఆర్.రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు ఉమర్ ఖాన్, కుర్మాడి శ్రీనివాస్, సభ్యులు బి.శంకర్, వైదిక్ శాస్త్ర, శ్రీధర్, మహమ్మద్ నవీద్, శివ కుమార్, ముస్తఫా, చావన్, అక్రమ్ పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ ముజీబ్ మీడియాతో మాట్లాడుతూ ఈ సంఘటన చాలా దురదృష్టకరమని, అమాయకుల ప్రాణాలతో చెలగాటం ఆడిన వారిపై కఠినంగా చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి విపత్తు సమయంలో తమ జీవితాలను లెక్కచేయకుండా పనిచేసిన అగ్నిమాపక సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

దివ్యాంగులకు రాజకీయాల్లో 5 శాతం రిజర్వేషన్ కల్పించాలి

- వికలాంగుల సంక్షేమ సంఘం డిమాండ్

నవతెలంగాణ-అడిక్‌మెట్



వికలాంగులకు రాజకీయ రంగంలో ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని వికలాంగుల సంక్షేమ సంఘం చైర్మన్ గంగారాం డిమాండ్ చేశారు. 214 అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని శనివారం వికలాంగుల భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య, వికలాంగుల సంక్షేమ సంఘం చైర్మన్ గంగారాం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వికలాంగుల సంక్షేమానికి, అభివృద్ధికి అనేక చట్టాలు రూపొందించినప్పటికీ అవి అమలులోకి నోచుకోవడం లేదన్నారు. వికలాంగుల విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల్లో తెలివి తేటలు, ఆలోచన శక్తి, మేధాశక్తి అధ్భుతంగా ఉంటాయని.. వాటిని దేశ అభివృద్ధికి వినియోగించాలని సూచించారు. 5 శాతం ఉద్యోగాలను డైరెక్ట్‌గా ఇంటర్వ్యూ - రాత పరీక్ష లేకుండా భర్తీ చేయాలని కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నప్పటికీ ఆయా శాఖ అధికారులు అమలు చేయడం లేదని ఆరోపించారు. ఇప్పటికీ వరకు ఏ శాఖలో 5శాతం రిజర్వేషన్లు అమలు జరుగలేదన్నారు. రిజర్వేషన్లు ఖచ్చితంగా అమలు చేయాలని కోరారు. అలాగే ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్ నెలకు రూ. 3000 నుంచి రూ. 5000కు పెంచాలని కోరారు. అదనంగా వికలాంగుల కోసం హైదరాబాద్‌లో 10 హాస్టళ్లు మంజూరు చేయాలని అలాగే జిల్లాలలో మరో 15 హాస్టళ్లు మంజూరు చేయాలని కోరారు. "వికలాంగుల బంధు పథకం" ప్రవేశపెట్టి ప్రతీ కుటుంబానికి 20 లక్షల రూపాయలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గజ్జ కృష్ణ, కవిత షేర్ భాష, కనకరాజు ఫిరోజ్ ఖాన తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష పే చర్చలో విద్యార్థులు భాగస్వాములు కావాలి

నవతెలంగాణ-బంజారాహిల్స్



పరీక్షపై చర్చలో ప్రతి విద్యార్థి భాగస్వామ్యం కావాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.శనివారం జూబ్లీహిల్స్ డివిజన్, ఫిలింనగర్ రౌండ్ టేబుల్ ప్రభుత్వ పాఠశాలలో పరీక్షపే చర్చ కార్యక్రమంలో భాగంగా ఆయన ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డితో కలిసి నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. దీపక్ కుమార్ రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షులు డా.గౌతమ్ రావు, జీహెచ్‌ఎంసీ అధికారులు సందీప్ సాయి, బద్దం మహిపాల్ రెడ్డి, గడ్డం వెంకటస్వామి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నుమాయిష్‌లో ఫ్రీడమ్ హెల్దీ కుకింగ్ ఆయిల్స్ ఫన్ జోన్ ఏర్పాటు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఫ్రీడమ్ హెల్దీ కుకింగ్ ఆయిల్స్ మార్కెటర్లు జెమిని ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ (జీఈఎఫ్ ఇండియా), నాంపల్లిలోని 82వ నుమాయిష్ ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌లో సందర్శకుల కోసం ఫన్‌జోన్ ఏర్పాటు చేసింది. ఫ్రీడమ్ హెల్దీ కుకింగ్ ఆయిల్స్, ప్రతీ సంవత్సరం నుమాయిష్‌లో పాల్గొనడంతో పాటుగా, వినియోగదారులతో అనుసంధానమవుతుంటుంది. సందర్శకులకు వినూత్న మైన యాక్టివిటీలు, స్కీమ్‌లను అందిస్తుంది. ఈ సంవత్సరం, చిన్న పెద్ద వయసు వ్యక్తులతో పాటుగా చిన్నారులతో ఆనందం దానించడం కోసం, అత్యంత ఆహ్లాదకరమైన స్టాల్‌ను ఏర్పాటుచేసింది. తద్వారా సన్‌ఫ్లవర్ ఆయిల్ విభాగంలో నెంబర్ 1 హోదా పొందిన ఫ్రీడమ్ రిఫైండ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ నిలువడాన్ని వేడుక చేస్తుంది. (రిఫైండ్ ఆయిల్ కన్స్ ప్యాక్ (ఆర్‌ఓసీపీ) మార్కెట్ ఇన్ ఇండియా (యుంటిలో) పై నీల్సన్ ఐక్యు డాటా, మార్చి 31, 2022తో ముగిసిన సంవత్సరాంతానికి (మ్యాట్).

ఫ్రీడమ్ హెల్దీ కుకింగ్ ఆయిల్స్ అత్యంత ఆకర్షణీయ మైన ప్రమోషనల్ ఆఫర్లను తీసుకువచ్చింది. వినియోగదారులు ఫ్రీడమ్ రిఫైండ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ ఒక లీటర్ బాటిల్ కొంటే, దానిని నుమాయిష్ వద్ద ప్రత్యేక రాయితీ ధర రూ. 140కు అందిస్తున్నారు. అంతేకాదు రూ. 500 విలువైన ఫ్రీడమ్ హెల్దీ కుకింగ్ ఆయిల్స్ కొనుగోలు చేసిన ఎడల, వినియోగదారులకు హూప్లా రింగ్ గేమ్ ఆడే అవకాశం ఉంది. అక్కడ వినియోగదారులు ఫ్రీడమ్ హెల్దీ కుకింగ్ ఆయిల్స్ 500 మిల్లీ లీటర్ల పౌచ్ లేదా 500 మిల్లీ లీటర్ల ఫ్రీడమ్ కచ్చీ ఘని మస్టర్డ్ ఆయిల్ ఉచితంగా పొందే అవకాశం ఉంది. అంతే కాదు, నూతన 15 లీటర్ల ఫ్రీడమ్ రిఫైండ్ సన్ ఫ్లవర్ ఆయిల్ టిన్ కొనుగోలు చేసిన వినియోగదారులు, జీఈఎఫ్ ఇండియా నుంచి 500 మిల్లీలీటర్ల ఫస్ట్ క్లాస్ పామోలిన్ ఆయిల్‌ను ఉచితంగా పొందవచ్చు. స్టాల్ వద్ద అత్యంత ఆకర్షణీయమైన సెల్ఫీ జోన్‌ను సైతం అందుబాటులోకి తీసుకువచ్చారు.

ఫ్రీడమ్ హెల్దీ కుకింగ్ ఆయిల్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, సేల్స్ అండ్ మార్కెటింగ్ పి. చంద్రశేఖర రెడ్డి మాట్లాడుతూ "ఈ సంవత్సరం నుమాయిష్‌లో భాగం కావడం పట్ల సంతోషంగా ఉన్నాము. దీనిద్వారా వినియోగదారులతో నేరుగా అనుసంధానమయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భాన్ని మేము సన్ ఫ్లవర్ ఆయిల్ విభాగంలో ఫ్రీడమ్ రిఫైండ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌కు నెంబర్ 1 స్థానం పొందడాన్ని వేడుక చేస్తున్నాము. ఫన్ జోన్‌లో సందర్శకులు ఉత్సాహవంతంగా, ఆటలాడుతూ, విరామం తీసుకోవడంతో పాటు ప్రత్యేకంగా డిజైన్ చేసిన స్కీమ్‌ల నుంచి ప్రయోజనాలను పొందవచ్చు. ఫ్రీడమ్ హెల్దీ కుకింగ్ ఆయిల్స్‌తో మా వినియోగదారులు విలువ ప్రతిపాదనలను వృద్ధి చేయడంతో పాటుగా వినియోగదారులకు ఉత్సాహాన్ని తీసుకువచ్చేందుకు మరిన్ని మార్గాలను సృష్టించేందుకు అన్వేషణ కొనసాగించనున్నాం" అన్నారు.

నాంపల్లి ఎగ్జిబిషన్ పార్కింగ్‌లో అగ్నిప్రమాదం

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



నాంపల్లి ఎగ్జిబిషన్ కు సంబంధించిన పార్కింగ్ ఏరియాలో శనివారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పార్కింగ్‌లో ఉన్న ఎలక్ట్రికల్ కారులో నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించి ఒక కారు నుంచి మరో నాలుగు కార్లకు మంటలు చెలరేగాయి. సంఘటన స్థలానికి చేరుకున్న గౌలిగూడ అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసింది. అగ్ని ప్రమాద ఘటనతో నాంపల్లి పరిసర ప్రాంతాలలో భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది.

PUBLIC NOTICE

The General public is hereby informed that our clanet Shriram Finance Limited Boduppal Branch, Hyderabad Dist is dealing with financing business in the course of business Sri. Boddu Rajendra Prasad, S/o. Boddu Mahendar, approached our client for finance and accepted to deposit his title deeds in respct of his property i.e. All that the Open Plot No.147/West Part, admeasuring 143.56 Sq.yards or 120.03 Sq.mtrs, in the layout Known as "True Land Mark-8", in Survey No.11 & 12, T.L.P. No.83/2016/H, Situated at Raikal Village & G.P., Farooqnagar Mandal, Ranga Reddy District and Bounded as follows:
NORTH : Plot No.147 (East Part), SOUTH: Plot No.146 & 144, EAST : Plot No.152, WEST : Z.P. Road
towards security for the loan availed by him. If any person or persons having any claim, right, title or interest in the above said property may approach the undersigned within 7 days from the date of this publication or else our clinet will proceed with the transaction.

S.SRINIVAS RAO
A.SUPRIYA
Advocates
H.No.2-19-79/A/10/A, Balaji Enclave Extn, East Kalyanpur, Uppal, Hyderabad - 500 039 Cell : 9948104019

IN THE COURT OF THE M.A.C.T - CUM- XII -ADDL CHIEF JUDGE: CITY CIVIL COURTS AT : SECUNDERABAD.
O.P.NO. 623 OF 2021

Rallabandi Anjaneyulu & Others
V/S
Sanjecva Nomula & Others

NOTICE

To,
1. R1. Sanjeeva Nomula S/o. Ilaiah. Aged about 27 years, Occ: Driver, R/o.H.no.12-10-1930, Warasiguda, Sitafal Mandi, Secunderabad.
2. R2. Sanjaya Kumar Vuppulappu S/o. V. Satyanarayana, Age: Major, Occ: Business, R/o. Hno.9-167/1, Rajiv Park Road, Gajwel, Telangana-502278.
WHEREAS the Petitioner has filed the above case for compensation under M.V Act and Rules and the same is posted for your appearance and counter on 24.01.2023. Hence, you are requested to appear before the said Hon'ble Court, at 10.30 AM either in your person or through your Advocate on the said date, otherwise, the matter will be decided in your absence.

// BY ORDER //
M/s P.Srinivas, M.Dhanalakshmi, N.Raju Naik K.Sneha
Advocates.
H.NO.6-18/1,"SHREE" NIVAS, Sreeram Nagar Colony, Anupuram, Kapra, ECIL, Hyderabad - 500 062
Mobile: 9246365011

PUBLIC NOTICE

The general public are hereby informed that **Boda Christopher S/o Late Boda Peter** Aged about 57 Years Occ:- Business, R/o H-No:- 142-563, Greenhills Colony, Moula-Ali, Secunderabad-40 has approached M/s Shriram Finance Ltd, Ameerpet Branch Hyderabad for depositing his title deeds by way of equitable mortgage in respect of schedule property for securing his future liability towards the loan amount. If any person or persons are having any objections, right, claim, title, interest over the schedule property they shall approach the undersigned with certified copies of documents in support of their claim within (7) Seven days from today, failing which the loan amount will be sanctioned **Boda Christopher S/o Late Boda Peter** and no claim or no objection of any nature thereafter will be entertained thereafter. Hence the notice.

SCHEDULE OF THE PROPERTY

All that Plot bearing No. 03 admeasuring 500 Sq.yds Plot bearing No. 05 admeasuring 500 Sq.yds Plot bearing No. 14 admeasuring 500 Sq.yds, Plot bearing No.15 admeasuring 500 Sq.yds Total admeasuring 2000.00 Sq.yds equivalent to 1672.00 Sq.mtrs in Sy No. 402 Part, Situated at Rampally (Village), Under Nagram Municipality, Keesara Mandal, Medchal -Malkajgiri District and bounded by: North 40"ft wide Road, South : 25' Wide Road, East : Plot No. 5 & 16, West : Plot No-2 & 13

For NomosVistas, The Lawyers, Govardhan Venu, Advocate & CEO
C-701 Skyline & Sterling Residency, Basheerbagh, Hyderabad 29.
Mob:-9849091266

NOTICE
IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT JUDGE AT SIRCILLA
I.A. No. 176 of 2021
In
O.S. No. 19 of 2018

Between: -
Gandra Umarani & Another
...Petitioners/Plaintiffs
And
Ponugoti Rama Devi & 4 Others
...Respondents/Defendants
V. Prashanth Kumar & 26 Others
....Res/Proposed Defendants no. 6 to 32

To,
R8: Kiranmai V.S.L. Pothuraju w/o. Srikanth V. Potharaju, aged 45 years, occ: Household, r/o. Flat no. 404, Surya Towers, H.No. 1-1-486 to 507, New Bakaram, Gandhi nagar, Hyderabad.
R9: Ambadas Diggikar s/o. Sridha Rao Diggikar, aged 82 years, occ: Retired Employee, r/o. H.No. 1-1-296/3/2, Ashok Nagar, Hyderabad.
R10: Karra Srihari s/o. Someshwara Rao, aged 58 years, occ: Service, r/o. H.No. 6-3-1068/A, N.G.O.S Colony, Vanasthalipuram, Hyderabad.
R14: K.S.R. Murthy s/o. K.S.N. Prasad, aged 50 years, occ: Advocate, r/o. Flat no.314, Block-B, Green Gold Apartments, Station Road, Malkajgiri, Hyderabad.
R17: Dr. Bhagavanthula Suryanarayana Murthy late Bhagavanthula Tandava Krishna Murthy, aged 78 years, occ: Doctor, r/o. H.No. 2-8-293/82/A/788, Plot no. 788, Road no. 36, Jubilee Hills, Hyderabad.
R18: P. Mrudula D/o. Hanuma Prasad, aged 31 years, occ: Household, r/o. H.No.3-11-41/2, Mallapur, HCL Nagar, Nacharam, Hyderabad.
R20: Ivaturi Ajoy Kumar s/o. Chinna Veera Basava Raju, aged 58 years, occ: Former, r/o. Flat no. 304, Ashiana Apartments, Gold Spot House, Ananda Nagar Colony, Khairathabad, Hyderabad.
R21: Vadier Subramanya Bhat s/o. Neelakanta Bhat, aged 82 years, occ: Retired Army Officer, r/o. H.No. 3-6-69/3, Avanthi nagar, Basheerbagh, Hyderabad.
R22: Mukkamala Satya Sudhakar s/o. Venkata Laxmi Narsimha Rao, aged 46 years, occ: Employee, r/o. MCH No. 371, Manikanth Apartments, Vidyanagar, Hyderabad.
Whereas the above named petitioners filed above referred I.A. for amendment of pleadings due to the impleading of defendants no. 6 to 32 in the above referred suit.
Take notice that the above I.A. is **posted on: 31-01-2023 at 10.30 A.M.** for the appearance of you the respondents no. 8 to 10, 14, 17, 18 & 20 to 22 in person or through duly authorized Counsel, before this Hon'ble Court, failing which the matter would be adjudged in your absence.
////BY ORDER OF THE COURT////
Sd/-
S. VASANTHAM
ADVOCATE, SIRCILLA
MOBILE NO: 9440432632

IN THE COURT OF THE HON'BLE ADDL.JUNIOR CIVIL JUDGE-CUM- VII ADDDL. METROPOLITAN MAGISTRATE, RANGA REDDY DISTRICT, AT: HAYATH NAGAR
O.S.No.953 OF 2022

Between:-
Sanem Yadagiri Goud & 2 others
.....Plaintiff No.1 to 3
AND
The Tahsildar, Abdullapurmet Mandal & All Concerned
.......Defendants

PUBLIC NOTICE

To,
THE ALL CONCERNED
...Defendant No.2
Please take the notice that the Plaintiffs have filed the above Suit for Declaration of Legal Heir of Late. Sanem Rangamma W/o Late. Sanem Kistaiah Goud to claim the suit schedule property and the matter is posted on 08-02-2023 for appearance of the parties. Hence, it is directed to appear before the Hon'ble Court on 08-02-2023 at 10.30 am, failing which the matter will be decided on the merits of the case.

SUIT SCHEDULE PROPERTY

All that piece and parcel of Open Plot admeasuring 196 Sq.Yards equivalent to 163.87 Sq.meters, Survey No. 445, situated at KOHEDA VILLAGE, Hayath Nagar Revenue Mandal, Under Koheda Gramapanchayat, Ranga Reddy District registration sub- District, Pedda Amberpet, through a Registered Sale Deed bearing No.28395 of 2006 dated 23-11-2006, and bounded by: NORTH : Open Plot of Keesari Bala Kistaiah; SOUTH : Open Plot of Kolanu Subadramma; EAST : Koheda Z.P. Road to Ibrahimpatnam; WEST : House of Galaiah.

// BY ORDER OF THE COURT //
Sd/-
M/s. BALLA RATNA KUMAR
MADEM LINGAIAH
ADVOCATES
Vanasthalipuram, Hyderabad.
Cell: 9391304243.
Counsel for the Plaintiffs

IN THE COURT OF THE HON'BLE PRICIPAL JUNIOR CIVIL JUDGE CUM METROPOLITAN MAGISTRATE: MEDCHAL-MALKAJGIRI DIST. AT: MALKAJGIRI
OS No. 5 Of 2023

BETWEEN :-
1. Rangaiah Naveen Naidu, S/o. R. Vijaya Lakshmi, 2. Rangaiah Perumbudursri Vinai Naidu, S/o. R. Vijaya Lakshmi, 3. Smt. Rekha Mohan Naidu, W/o. Late R. Mohan Kumar, 4. Smt. Diksha Dinesh Raju, D/o. Late R. Mohan Kumar, 5. Vedwamshi Mohan Naidu, S/o. Late R. Mohan Kumar, 6. Smt. Vada Vandana W/o. V. Suresh, 7. Smt. Sangeetha Harish W/o. Srinivasan Harish Kumar,
...Plaintiffs
And
The Tahsildar, Malkajgiri Mandal, And All Concerned
...Defendants

To,
All Concerned
Please take notice that the plaintiffs have filed the above suit against above mentioned defendant, seeking declaration of plaintiff No.1 is the sole legal heir of Sri Late Rangaiah Satyanarayana S/o. S.M.Rangaiah. Schedule of property of Sri Late Rangaiah Satyanarayana as follows: All that flat No. 404, in Manjeera Homes, Phase-II, Municipal H.No. 25-40/32/77/1/B-Block/404, on part of plot Nos. 83 & 84 and Plot Nos.82, 85 & 86, consisting built-up area 1380 Sft (including common areas) together with 100 Sft., earmarked car parking at stilt floor, together with an undivided share of land admeasuring 46 Sq.Yards out of 1092 Sq.Yards, situated at Ramachandra enclave, East Anandbagh, Malkajgiri, the then Malkajgiri Municipality now under GHMC Malkajgiri Circle and mandal, Medchal-Malkajgiri District. Flat Boundaries: NORTH: Flat No. 405, SOUTH: Flat No. 403, EAST: open to sky, WEST: Corridor. The above suit is posted to 22-02-2023 for appearance. If any person/s have any objection and interest for the said claim of the plaintiff, shall appear before the above Hon'ble court on 22-02-2023 at 10.30 A.M in person or through Advocate and file his objections, failing which the matter will be decided as per the law.

By order of the Court.
K. SRINIVASULU
Advocate
H.No. 1-1-523/B/3, Street No.7, Gandhi Nagar, Hyderabad - 500 080.
Mob: 9948664345
Email: srinivask.advocate@gmail.com

IN THE COURT OF HONBLE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE-Cum-V ADDL. METROPOLITAN MAGISTRATE :: MEDCHAL-MALKAJGIRI DISTRICT At L B Nagar
O.S. NO: 2688 OF 2022

Between:
CHINTHALA SRIRAMULU & 3 OTHERS
.......Plaintiffs 1 to 4
And
1.The Tahsildar Medipally Mandal
2. All Concerned ......Defendants No 2
To
All Concerned
That the above named plaintiffs filed the above suit for declaration to declare them as Class1 Legal Heirs of deceased Late Smt. CHINTHALA SUJATHA who died intestate 26.10.2005 Against you and another, said suit is posted on 14.02.2023 for objections. If any person or persons is /are having any objections may appear before the Hon'ble Court on dtd 14.02.2023 at 10:30 AM. Either in person or through an Advocate. Failing which the matter will be decided as per law in your Absence.

1. SCHEDULE OF PROPERTY: All that the open Plot bearing No.254 and Plot bearing No.255 , in Survey nos, 1 and 2 maji, area 200 sq.yards., or 167 sq. meters, Situated at Parvathapur Village and grampanchayat, Medipally Mandal (Then Ghatkesar mandal), Medchal-Malkajgiri district (then Rangareddy district), Telangana. and bounded by:-
North : Plot no. 255, South : Plot no. 253
East : Plot no. 274, West : 30' wide road.
North : Plot no. 256, South : Plot no. 254
East : Plot no. 273, West : 30' wide road.
//By Order of the court//
SD/-
Y BHARATH
Advocate.
H.No: 2-81/59/43 Dwaraka nagar phase 1, Chengicherla, Hyderabad 500098,
Ph: 9618214652,
Email: ybharath716@gmail.com

NOTICE
IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT JUDGE AT SIRCILLA
I.A. No. 176 of 2021
In
O.S. No. 19 of 2018

Between: -
Gandra Umarani & Another
...Petitioners/Plaintiffs
And
Ponugoti Rama Devi & 4 Others
...Respondents/Defendants
V. Prashanth Kumar & 26 Others
....Res/Proposed Defendants no. 6 to 32

To,
R7: A. Vashista Prakash s/o. late A.V.S.N. Murthy, aged 52 years, occ: Employee, r/o. H.No. 9-2-47/4, Guru Mandir, Hasmathpet, Old Bowenpally, Secunderabad
R15: Sivakumar Thiyagasamadram s/o. T.S. Sabesan, aged 52 years, occ: Employee, r/o. H.No. 12-5-65/1, Flat no. 102, Harsha Sethuram Unique Apartments, Vijayapuri Colony, Tarnaka, Secunderabad
R16: Soumya Sivakumar w/o. T.S. Siva Kumar, aged 45 years, occ: Household, r/o. H.No. 12-5-65/1, Flat no. 102, Harsha Sethuram Unique Apartments, Vijayapuri Colony, Tarnaka, Secunderabad
Whereas the above named petitioners filed above referred I.A. for amendment of pleadings due to the impleading of defendants no. 6 to 32 in the above referred suit.
Take notice that the above I.A. is **posted on: 31-01-2023 at 10.30 A.M.** for the appearance of you the respondents no. 7, 15 & 16 in person or through duly authorized Counsel, before this Hon'ble Court, failing which the matter would be adjudged in your absence.
//// BY ORDER OF THE COURT////
Sd/-
S. VASANTHAM
ADVOCATE, SIRCILLA
MOBILE NO: 9440432632

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



నవతెలంగాణ-మల్కాజిగిరి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమనీ, ప్రజా సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. శనివారం 139 ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని పివియన్ కాలనీలోని స్కూల్ దగ్గరలో రూ.45 లక్షలతో చేపట్టిన బాక్స్ డ్రైన్ పనులను కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్‌తో కలిసి పనులను ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఈఈ లక్ష్మణ్, డీఈ లౌఖ్య, డివిజన్ అధ్యక్షుడు సత్యమూర్తి, సతీసుకుమార్, రాముయాదవ్, ఫిట్ల్ శ్రీనివాస్, బాబు, సత్యనారాయణ, ఉపేందర్, సంతోష్, రాందాస్, మోహన్ రెడ్డి, కవిత, బ్రహ్మయ్య, ఉమా, నహీంఖాన్, రవీందర్, మబ్బు కన్నా, వైశాలి, ఉమాపతి, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ-మల్కాజిగిరి

మౌలాలి డివిజన్ పరిధిలోని కృష్ణానగర్‌లో రూ.70 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు శనివారం ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గం పరిధిలోని అన్ని కాలనీలను దశల వారీగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ లక్ష్మణ్, డీఈ మహేష్, ఏఈ మధురిమ, నాయకులు ఆమినుద్దీన్, సతిష్ కుమార్, పిట్ల శ్రీనివాస్, రాము యాదవ్, డివిజన్ అధ్యక్షుడు సత్తయ్య, బుద్ది నర్సింగ్ రావు, సంతోష్ నాయుడు, మంద భాస్కర్, ఇబ్రహీం, ఫైజల్, ఆదినారాయణ, చందు, గౌలికర్ దినేష్, షకీల్, నవాబ్, ఇర్ఫాన్, సంతోష్ గుప్త, జోగు శ్రీనివాస్, పిట్ల నాగరాజు, మైముద బేగం, జాన్ బి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ 'కంటి వెలుగు' శిబిరాలను పర్యవేక్షించాలి

- క్వాలిటీ కంట్రోల్ బృందాలు పర్యటించాలి
- బఫర్ వైద్య బృందాలతో ప్రత్యేక క్యాంపులు
- ట్యాబ్ ఎంట్రీలు సమర్థవంతంగా జరగాలి
- కండ్ల అద్దాల స్టాక్‌పై రెగ్యులర్ రివ్యూ తీసుకోవాలి
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ హరీశ్



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

కంటి వెలుగు శిబిరాలను ప్రతి రోజూ పర్యవేక్షించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ హరీష్ అన్నారు. శనివారం మేడ్చల్ కలెక్టరేట్‌లో జిల్లా వైద్య అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కంటి వెలుగు క్యాంపు నిర్వహణ సమయంలో పక్కాగా ట్యాబ్ ఎంట్రీ వివరాలు నమోదు కావాలన్నారు. ప్రతి రోజూ ట్యాబ్ ఎంట్రీ పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాలో క్వాలిటీ కంట్రోల్ బృందాల ద్వారా ప్రతి రోజూ ఫీడ్ బ్యాక్ తీసుకుని చిన్న, చిన్న లోటుపాట్లను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న రీడింగ్ కళ్ళద్దాల స్టాక్ ను అధికారులు లు ప్రతి రోజూ పర్యవేక్షించాలన్నారు. అవసరమైన కళ్ళద్దాల స్టాక్ వివరాలు పాయింట్ల వారీగా ముందుగా సమాచారం అందిస్తే సకాలంలో సరఫరా చేస్తామన్నారు. కంటి పరీక్షల శిబిరాలకు మరింత మంది వచ్చే విధంగా మోబిలైజేషన్ కార్యక్రమం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. శిబిరానికి వచ్చిన వారు సంతృప్తి పడేవిధంగా నాణ్యతతో కూడిన పరీక్షలు చేసి ఖచ్చితత్వంతో కూడిన ప్రమాణాలతో కంటి అద్దాలు ఇవ్వాలన్నారు. ఆన్లైన్ డేటా నమోదు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు. ఏమైనా సమస్యలు వస్తే అధికారులు నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణపై కళాశాల, విశ్వవిద్యాలయాల స్థాయిలో పాఠ్యాంశాలు

- ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్.లింబాద్రి



నవతెలంగాణ-కాప్రా

మాదకద్రవ్యాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా కళాశాల, విశ్వవిద్యాలయాల స్థాయిలో పాఠ్యాంశాలను ప్రవేశపెట్టబోతున్నట్టు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య ఆర్.లింబాద్రి అన్నారు. శనివారం చర్లపల్లి పారిశ్రామికవాడ లోని సిఐఎ భవన్ లో ధర్మసేవా సంస్థ ఆధ్వర్యంలో యువత సాధికారత పై నిర్వహించిన కర్యశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. యువత ప్రధానంగా సైబర్ నేరాల, మాదకద్రవ్యాల వ్యసన సమస్యలు ఎదుర్కొంటున్నట్టు స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణపై చట్టపరంగా తీసుకుంటున్న చర్యలను వివరించారు. యువతను, విద్యార్థులను చైతన్య పరిచేందుకు ధర్మసేవా సంస్థ, పోలీస్, న్యాయ సేవాధికర సంస్థలతో కలిసి ఉన్నత విద్యా మండలి పని చేస్తుందని తెలిపారు. ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సూపరింటెండెంట్ అంజిరెడ్డి మాట్లాడుతూ దేశంలోని ప్రధాన మెట్రోపాలిటన్ నగరాల్లో కంటే హైదరాబాద్‌లో మాదకద్రవ్యాల మాఫి యా ఉనికి చాలా వరకు తగ్గిందన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ చైతన్యవంతులైన కలసికట్టుగా మాదకద్రవ్యాల నిరోధానికి కృషి చేయాన్నారు. సిఐఎ అధ్యక్షులు గోవిం దరెడ్డి మాట్లాడుతూ మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రభు త్వం తీసుకుంటున్న చర్యలకు మద్దతుగా చర్లపల్లి పారిశ్రా మిక వేత్తల సంఘం పూర్తి సహకారాన్ని అందిస్తుందని తెలిపారు. ఈ కార్యశలలో ధీర కార్యక్రమంలో భాగంగా యువత సాధికారత కోసం చెపట్టబోతున్న కార్యకలాపాల ను ధర్మసేవ సంస్థ వ్యవస్థాపకులు జె.నిశాంత్ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో ధీర వాలింటీర్లు రమణి, వికాస్ భారత్, మనిందర్, అంకిత, జైనిక్, నేచర్ లైఫ్ స్టైల్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ధీన దయాళ్ నగర్‌లో మెగా మెడికల్ క్యాంపు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వినాయక్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం ధీన దయాళ్ నగర్‌లో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపును మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్ రావు ప్రారంభించారు. రోటరీ గ్లోబల్ విజార్డ్స్, మల్లారెడ్డి హాస్పిటల్ వారి ద్వారా డెంటల్, కార్డియో, జనరల్, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓపెన్ ఎన్‌జీఓ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 200 మందికి పైగా సేవలను ఉపయోగించుకున్నారు. రోటరీ క్లబ్ సభ్యులు ఫణి, మాలిని, గంట శ్రీవర్ధన్, సురేన్, అనిల్, సుకన్య సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు భాను ప్రకాష్, బీజేపీ మల్కాజిగిరి అసెంబ్లీ కన్వీనర్ సదానంద గౌడ్, బీజేపీ సీనియర్ నాయకులు వడ్డీ సుబ్బారావు, జీకే హనుమంత రావు, గోపు రమణారెడ్డి, ఉమామహేశ్వరి, నర్సింగ రావు, జిల్లా నాయకులు సర్వేశ్ యాదవ్, జ్యోతిర్మయి, వినాయక్ నగర్ డివిజన్ అధ్యక్షులు ఓం ప్రకాష్, రాష్ట్ర నాయకులు రవి యాదవ్, గోపాలకృష్ణ, మణిరత్నం, డివిజన్ నాయకులు సాయి సురేష్, శ్రీకాంత్ యాదవ్, సోమనాథ చారి, గోపాల్, జహంగీర్, నరేంద్ర, సురేష్, కాలనీ వాసులు ఆచారి, ఉపేందర్, సారిక, తదితరులు పాల్గొన్నారు.

బాదములతో చర్మ ఆరోగ్యం మెరుగు

నవతెలంగాణ- హైదరాబాద్

బాదములను ఏ రకంగా తీసుకోవడానికి అయినా ప్రజలు ఇష్టపడతారు. బాదంలలో 15అత్యవసర పోషకాలు ఉన్నాయి. నేషనల్ ఆల్మండ్ డే ప్రచారాన్ని 23 జనవరి 2023న ప్రారంభించనున్నారు. తద్వారా ప్రతి రోజూ 23 గ్రాముల బాదములు తినమని ప్రోత్సహిస్తారు. బాదంలలోని రోగ నిరోధక శక్తి లక్షణాలు, ఆకలి తీర్చే గుణాలను గురించి షీలా కృష్ణ స్వామి మాట్లాడుతూ... బాదములు అత్యంత సహజసిద్ధమైన యాంటీ ఆక్సిడెంట్స్ అన్నారు. ఆక్సిడేటివ్ ఒత్తిడి నుంచి బయటపడటానికి, రోగనిరోధక శక్తి మెరుగుపరుచుకోవడానికి ఇవి తోడ్పడతాయన్నారు. ఈ గింజల్లోని ఆకలి తీర్చే గుణాలు కారణంగా అధికంగా రిఫైండ్ అన్నారు. బరువు తగ్గాలనుకునే వారికి ఇది తోడ్పడుతుందన్నారు. మెడికల్ డైరెక్టర్ అండ్ కాస్మెటాలజిస్ట్ డాక్టర్ గీతికా మిట్టల్ గుప్తా మాట్లాడుతూ... బాదములలో అత్యధిక పరిమాణంలో విటమిన్ ఈ, పాలీఫీనాల్స్ ఉన్నాయన్నారు. ఇది చర్మ ఆరోగ్యం మెరుగుపరుస్తుందన్నారు. వీటిని తరచుగా తింటే అవి చర్మ మెరుపుకూ తోడ్పడతాయన్నారు. అలాగే అతి ప్రమాదకమైన యువీ బీ కిరణాల నుంచి చర్మం కాపాడుకోవడంలోనూ తోడ్పడుతుందన్నారు. ముఖంపై ముడతలు రాకుండటం కోసం ఓ గుప్పెడు బాదములు తీసుకోవడం మంచిదన్నారు. ఫిటెనెస్ నిపుణురాలు, సెలబ్రిటీ మాస్టర్ ఇన్‌స్ట్రక్టర్ యాస్మిన్ కరాచీవాలా మాట్లాడుతూ... బాదములు అత్యంత సహజంగానే వ్యాయామాలకు ముందు, తరువాత తినే స్నాక్స్ గా నిలుస్తాయన్నారు. ఇవి అత్యధిక శక్తిని అందిస్తాయన్నారు. సుప్రసిద్ధ భారతీయ సినీ, టీవీ నటి నిషా గణేష్ మాట్లాడుతూ... ఆరోగ్యంగా ఉండాలంటే " సమయానికి తినడం అత్యంత కీలకమన్నారు.

కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ ఎగ్జామ్స్ అగ్రస్థానంలో నిలిచిన 48మంది భారతీయులు

నవతెలంగాణ- హైదరాబాద్

కేంబ్రిడ్జ్ ఇంటర్నేనల్ స్కూల్, 222 ఔట్ స్టాండింగ్ కేంబ్రిడ్జ్ లెర్నర్ అవార్డులను భారతీయ విద్యార్థులకు అందించింది. ఈ అంతర్జాతీయ అవార్డులతో 40 దేశాల నుంచి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులను వేడుక చేశారు. భారతదేశం నుంచి 48 మంది విద్యార్థులు టాప్ ఇన్ ద వరల్డ్ అవార్డు గెలుచుకున్నారు. అంటే దీనర్థం ప్రపంచంలో అత్యధిక మార్కులను నిర్దేశిత సబ్జెక్ట్ లో సాధించారని. ఈ 48 మంది విజేతలలో, 22 మంది విద్యార్థులు మేథమెటిక్స్‌లో అసాధారణ ప్రదర్శన కనబరిచారు. ఈసందర్భంగా కేంబ్రిడ్జ్ యూనివర్శిటీ ప్రెస్ అండ్ ఎస్సెస్మెంట్ సౌత్ ఆసియా మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ రాజమణి మాట్లాడుతూ... ఈ ఔట్ స్టాండింగ్ కేంబ్రిడ్జ్ లెర్నర్ అవార్డులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కేంబ్రిడ్జ్ పరీక్షల్లో మెరుగైన ప్రదర్శన కనబరిచిన అసాధారణ విద్యా నిపుణులు సాధించిన విజయాలకు గుర్తించి వేడుక చేసే రీతిలో ఉంటాయన్నారు. ప్రతి సంవత్సరం భారతదేశం నుంచి పెద్ద సంఖ్యలో అభ్యాసకులు స్టెమ్, నాన్ స్టెమ్ బోధనాంశాల్లో అద్భుతమైన ప్రదర్శన చేస్తూ ఆకట్టుకుంటున్నారన్నారు. 2022 సంవత్సరంలో 187 మంది విద్యార్థులు ప్రశంసలను పొందడం ఇందుకు మినహాయింపేమీ కాదన్నారు. ఈ ఫ లితాలు భారతదేశంలో అద్భుతమైన ప్రతిభ ఉందని ప్రతిబింబిస్తున్నాయన్నారు.

కమలానగర్‌లో కామ్రేడ్ లెనిన్ వర్ధంతి సభ



నవతెలంగాణ-కాప్రా

భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో జిల్లా ఆఫీసు కమలానగర్లో సోవియట్ యూనియన్ నిర్మాణానికి దోహదపడి కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు నడిపించిన మహోన్నత నాయకుడు కామ్రేడ్ విఐ లెనిన్ వర్ధంతి సభ జరిగింది. ఈ సభకు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. సభ ప్రారంభ సూచికంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రవి, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్ లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లెనిన్ కుటుంబం పోరాట స్ఫూర్తి కలిగిందన్నారు. ఆనాటి జార్ చక్రవర్తి వ్యతిరేకంగా పోరాటం చేసి తండ్రిని నిర్బంధానికి గురై, అన్న అలెగ్జాండర్ ఉరి తీయబడ్డారని చెప్పారు. ఆయన విద్యాభ్యాసం కూడా జరగకుండా జార్ ప్రభుత్వం అడ్డగించిందని చెప్పారు. ప్రవాసంలో ఉండి జారు ప్రభుత్వం దురాగతాలను ఎండగడుతూ పోరాడారన్నారు. మొట్టమొదటి కమ్యూనిస్టు ప్రభుత్వం విస్తారమైన సోవియట్ యూనియన్ నిర్మాణానికి కృషి చేశారన్నారు. కార్మిక వర్గ ప్రయోజనాలకు అదొక దిక్సూచిగా మారిందన్నారు. కామ్రేడ్ లెనిన్ ప్రపంచ దేశాలకు విప్లవ పోరాటాల మార్గదర్శకంగా నిలిచారన్నారు. వారు చూపిన బాటలో ప్రజలు నడవాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మిక ప్రయోజనాల కోసం లెనిన్ చేసిన కృషి మరువలేనిదన్నారు. భవిష్యత్తులో వారి స్ఫూర్తిని తీసుకొని భారతదేశ విప్లవం కోసం కృషి చేయాలని చెప్పారు. పార్టీ జిల్లా ఆఫీస్ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ లెనిన్ నిర్మాణం విధానం ఆచరణీయమని చెప్పారు. రేపు రవీంద్ర భారతిలో జరిగే చేగువేరా కుమార్తె, మనవరాలు రాక సందర్భంగా జరుగు సభకు అందరూ కుటుంబ సమేతంగా రావాలని కోరారు. అనంతరం లెనిన్ ఫోటోకు సభికులందరూ పూలు అర్పించి నివాళి అర్పించారు. సభలో జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులు, సంతోష్, శ్రీమన్నారాయణ, పి.బి చారి, వెంకటేష్, బంగారు నర్సింగ్ రావు, ఉనికిష్టన్, శోభ, గౌసియా, వెంకటరమణ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పల్ నియోజకవర్గం తెలంగాణ రాష్ట్ర సమితి కార్మిక విభాగం అనుబంధ సంస్థ టీఆర్ఎస్‌కేవీ ట్యాక్సీ సెక్టార్ నూతన సంవత్సర - 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించిన చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్. ఈ కార్యక్రమంలో ట్యాక్సీ సెక్టార్ యూనియన్ అధ్యక్షుడు నాగేష్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఫాహీముద్దిన్, జనరల్ సెక్రెటరీ రాజు యాదవ్, యూనియన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. నవతెలంగాణ-కాప్రా

కేసీఆర్ కిట్లు అందజేత



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ డివిజన్‌లోని పీహెచ్‌సీలో మల్లాపూర్ లోని పస్తం మైసమ్మ, కె.లక్ష్మిలకు కేసీఆర్ కిట్‌ని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, స్థానిక పీహెచ్‌సీ ఇన్‌చార్జి మాధవితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ కిట్ గర్భిణులకు, కొత్త శిశువుకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించడం ద్వారా గర్భం సంక్లిష్టతలను నిర్వహించడంలో సహాయపడుతుందన్నారు. కేసీఆర్ కిట్ ప్రధాన లక్ష్యం శిశు మరణాల రేటును తగ్గించడం అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పద్మా రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ముత్యాలు, పీఆర్ ప్రవీణ్, రమేష్, శ్రవణ్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

21వ డివిజన్‌ను హరిత వనంగా మారుస్తా



నవతెలంగాణ-జవహర్ నగర్

జవహర్ నగర్ కార్పొరేషన్‌లోని డివిజన్లను అభివృద్ధి చేసి హరిత డివిజన్‌గా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్ అన్నారు. శనివారం కార్పొరేషన్ లోని 21వ డివిజన్‌లో మున్సిపల్ సాధారణ నిధులు రూ.5లక్షలతో అంతర్గత డ్రయినేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో అభివృద్ధి పనులు ఉద్యమంలా సాగుతుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రతి కాలనీలో సీసీ రోడ్లు, డ్రయినేజీ పనులు గరుడ వేగంతో సాగుతున్నాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు గడపగడపకూ అందుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు దేశంలో ఎక్కడా లేవని పేర్కొన్నారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు భూమా విజయపౌలు, గండి నర్సయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ సింగన్న బాల్రాజ్, జవహర్ నగర్ ఎస్సీసెల్ అధ్యక్షుడు ప్రకాష్, డివిజన్ అధ్యక్షుడు జక్కుల భాస్కర్, నాయకులు నగేష్, చందు, గణేష్, కృష్ణ, శ్రీనివాస్, ముకుందం, రాంచందర్, కుమార్, రాంనర్సయ్య, శ్రీనివాస్, రాజమౌళి, కాలనీవాసులు పాల్గొన్నారు.

నష్టం జరగకుండా బ్రిడ్జి నిర్మాణం చేపట్టండి



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ నియోజకవర్గం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని సుభాష్ నగర్ కాలనీలో మధ్యలో నుంచి రోడ్డు కన్వెన్షన్ పనుల్లో భాగంగా తమ ఇండ్లు పోతున్నాయనీ, మాకు నష్టం జరగకుండా బ్రిడ్జి నిర్మాణం చేపట్టి తమకు న్యాయం చేయాలని బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డిని కోరగా ఆయన శనివారం కాప్రా మునిపల్ కమిషన్‌ని కలిసి వారికి న్యాయం చేయాలని కోరారు. మధ్యతరగతి కుటుంబాలు రోడ్డున పడకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుభాష్ నగర్, బాలాజీ వర్మ నగర వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు కె.కేశవ రెడ్డి, బాలకృష్ణ, రామచారి, మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'మేరు యూనివర్సిటీ' ఫెయిర్

- 6 దేశాల నుంచి 400పైగా విద్యార్థుల భాగస్వామ్యం
- సందడిగా విశ్వవిద్యాలయాల స్టాల్స్



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేరు యూనివర్సిటీ ఫెయిర్ మేరు ఇంటర్నేషనల్ స్కూల్, మియాపూర్‌లో శనివారం జరిగింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 50కి పైగా విశ్వవిద్యాలయాల ప్రతినిధులను తీసుకురావడానికి పాఠశాలలో కెరీర్ కౌన్సెలింగ్ సెల్ ఈ ఫెయిర్‌ను నిర్వహించింది. వారంతా విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అందుబాటులో ఉన్న కోర్సులు వారు ఎంచుకునే కెరీర్ ఎంపికల గురించి మార్గనిర్దేశం చేశారు. పిల్లలు ఉత్సాహంగా ఒక స్టాల్ నుంచి మరో స్టాల్‌కి వెళ్లి బ్రోచర్‌లను సేకరించి, మన దేశం నుంచి అశోక విశ్వవిద్యాలయం, క్రైస్ట్ విశ్వవిద్యాలయం, మణిపాల్ విశ్వవిద్యాలయం వంటి విశ్వవిద్యాలయ ప్రతినిధులతో మాట్లాడుతూ మేరు యూనివర్శిటీ ఫెయిర్‌లోని విశ్వవిద్యాలయ స్టాళ్లు సందడిగా మారాయి. వివిధ దేశాల నుంచి జేవియర్ విశ్వవిద్యాలయం, జేమ్స్ కుక్ విశ్వవిద్యాలయం, స్వాన్సీ విశ్వవిద్యాలయం ఉన్నాయి. సైన్స్, మ్యాథ్, ఇంజినీరింగ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, డిజైన్, హ్యుమానిటీస్ తదితర విభాగాల్లో అన్వేషించడానికి అనేక కోర్సులు ఉన్నాయని యూనివర్సిటీ ప్రతినిధులు పిల్లలకు అవగాహన కల్పించారు. స్కూల్ హెడ్ బిజు బేబీ మాట్లాడుతూ "భారతదేశం, విదేశాల నుంచి 60కి పైగా విశ్వవిద్యాలయాలు మేరు పాఠశాలను సందర్శించడం ఒక ముఖ్యమైన సందర్భం. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కొత్త అభివృద్ధి చెందుతున్న రంగాలు, కొత్త కోర్సుల గురించి లోతైన అంతర్దృష్టితో కెరీర్ చర్చల నుంచి ప్రయోజనం పొందారు. స్కాలర్‌షిప్‌లను ఎలా పొందాలనే దానిపై విద్యార్థులకు ఇన్‌పుట్‌లు కూడా అందించబడ్డాయి" అని తెలిపారు. ప్రిన్సిపాల్ సత్యకి బెనర్జీ మాట్లాడుతూ మేరు యూనివర్శిటీ ఫెయిర్ చాలా ముఖ్యమైన ఈవెంట్‌లలో ఒకటి అన్నారు. ప్రతి ఏడాదీ మరింత పెద్దదిగా పెరుగుతుందన్నారు. మంచి విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందడం ద్వారా విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించడంలో సహాయపడటానికి తమ పాఠశాల ప్రయత్నాల్లో ఇది ఒక భాగం అన్నారు. మరింత సరైన ఉద్యోగాలను పొందడం, బాధ్యతాయుతమైన ప్రపంచ పౌరుడిగా జీవితాన్ని గడపడం ముఖ్యం అన్నారు.

'ఆహా' అధ్యక్షులుగా డాక్టర్ మార్త రమేశ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆహా అధ్యక్షులుగా డాక్టర్ మార్త రమేశ్ ఎన్నికయ్యారు. శనివారం గాంధీ హాస్పిటల్ అలుమ్నీ ఎడ్యుకేషన్ సెంటర్‌లో హెల్త్ అకార్డ్ 2023 సెమినార్ తర్వాత జరిగిన అసోసియేషన్ ఆఫ్ హెల్త్ అండ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ తరపున జరిగిన ఎన్నికల్లో నిమ్స్ హాస్పిటల్, రాష్ట్ర ప్రభుత్వ అనుసంధానకర్త డాక్టర్ మార్త రమేష్ అసోసియేషన్ ఆఫ్ హెల్త్ అండ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ ప్రెసిడెంటుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ మార్త రమేశ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. అసోసియేషన్ అభివృద్ధికి తనవంతుగా ఎక్కువ సమయం కేటాయించి శాయశక్తులా అసోసియేషన్ లక్ష్యాలను సాధించేందుకు సీనియర్ల సహాయ సహకారాలతో పని చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మార్త రమేష్, నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

నూతన కార్యవర్గం ఇలా..

ప్రెసిడెంట్‌గా డాక్టర్ మార్త రమేష్, వైస్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ మసూద్, జనరల్ సెక్రెటరీగా డాక్టర్ నరేందర్ కుమార్, జాయింట్ సెక్రెటరీగా డాక్టర్ శ్రీనివాస్ రావు, ట్రెజరర్‌గా విజయారెడ్డి ఎన్నికయ్యారు. చీఫ్ ప్యాట్రన్‌గా డాక్టర్ పి.సత్యనారాయణ, అడ్వైజర్‌గా డాక్టర్ టి.దయాకర్, డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, డాక్టర్ కె.టి.రెడ్డి, తదితరులు ఎన్నికయ్యారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత : ఎమ్మెల్యే

- సీసీ రోడ్డు, బాక్స్‌డ్రైన్ పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. శనివారం మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని మౌలాలి డివిజన్ పరిధిలోని కృష్ణానగర్‌లో రూ.70 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని పీవీఎన్ కాలనీ సెంట్ ఆన్స్ స్కూల్ దగ్గర రూ.45 లక్షలతో బాక్స్ డ్రైన్ పనులను ఎమ్మెల్యే, డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను నిరంతరం అన్ని డివిజన్‌లలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని వారి అవసరాలకనుగుణంగా సదుపాయాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగానే నియోజకవర్గంలోని అన్ని డివిజన్ లలో అభివృద్ధి పనులను వేగవంతం చేశామన్నారు. ఈ కార్యక్రమాలలో ఈఈ లక్ష్మణ్, డీఈ లౌక్య, మహేష్, ఏఈ మధురిమ, బీఆర్ఎస్ మల్కాజిగిరి అధికార ప్రతినిధి సతీష్ కుమార్, సర్కిల్ అధ్యక్షుడు పిట్ల శ్రీనివాస్, నాయకులు ఆమినుద్దీన్, రామూ యాదవ్, డివిజన్ అధ్యక్షులు సత్తయ్య, సత్యమూర్తి, బుద్ది నర్సింగ్ రావు, సంతోష్ నాయుడు, పాల్గొన్నారు.



మంత్రి సబితా ఇంద్రారెడ్డికి ఆహ్వానం



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని జల్‌పల్లి మున్సిపాలిటీలో వాది ఏ ముస్తఫా కాలనీలో జరుగనున్న ప్రీమియర్ క్రికెట్ లీగ్‌కు మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి, తెలంగాణ రాష్ట్ర యువ నాయకులు పట్లోళ్ల కార్తీక్ రెడ్డిని శనివారం వారి నివాసంలో కలిసి టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి జల్‌పల్లి మున్సిపల్ కౌన్సిలర్లు షేక్ అబ్బల్, సాద్ అవల్గి ఆహ్వానం పత్రికను అందచేశారు. జల్‌పల్లి మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు షేక్ జహంగీర్, మున్సిపాలిటీ మైనార్టీ ప్రెసిడెంట్ సయ్యద్ హుస్సేన్, మున్సిపాలిటీ మైనార్టీ ఉపాధ్యక్షులు షేక్ సలేహు బావాజీర్ తదితరులు ఉన్నారు.

ఆర్కే పురంలో అన్నదానం

నవతెలంగాణ-సరూర్‌నగర్

ఆర్కేపురం డివిజన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌నగర్‌లో శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ డీసీ కృష్ణయ్య, జిల్లా యూత్ అధ్యక్షులు కొత్త రవి, ఆలయ కమిటీ సభ్యులు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, ఆర్గనైజింగ్ సెక్రెటరీ బాల శ్యామ్, ఎర్రం శ్రీనివాస్, రవి, చంద్రశేఖర్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



పన్నుల వసూళ్లలో పారదర్శకత ఉండాలి

- మౌలిక సదుపాయాల కల్పనలో ఇబ్బందులు రావొద్దు
- సిబ్బంది సమీక్షా సమావేశంలో మేయర్ జక్క వెంకట్ రెడ్డి



నవతెలంగాణ-బోడుప్పల్

స్థానిక సంస్థలైన కార్పొరేషన్లు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు నిరంతరం కల్పించాలంటే అవసరమైన మేరకు ప్రజల నుండి పారదర్శకంగా పన్నుల వసూళ్ల చేయాలని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారంనాడు పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో వివిధ విభాగాల (రెవెన్యూ, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, అకౌంట్స్, శానిటేషన్, స్వచ్ఛ సర్వేక్షన్) అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రజలకు పారదర్శక పాలన, మెరుగైన సేవలు, మౌలిక సదుపాయాల కల్పన అందించాలనే ఉద్దేశంతో నగరాలు, పట్టణాల్లోని ఇంటి, ప్లాట్ల పూర్తి సమాచారాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో జియో ట్యాగింగ్ చేసి డిజిటలైజ్ చేసే ప్రక్రియే "భువన్ సర్వే". దీని ద్వారా పట్టణ ప్రాంతాల్లోని అన్ని భవనాల సమాచారాన్ని మొబైల్ ఫోన్లలో బంధించి.. ఆయా భవంతుల నుంచి ఏ శ్లాబ్ కింద ఎంత పన్ను వసూలు చేయాలనేది నిర్ణయించడం జరుగుతుంది. ఆస్తి పన్ను మదింపులో శాస్త్రీయత పాటించకపోవడం, గృహ, వాణిజ్య కేటగిరీల నిర్ధారణలో హేతుబద్ధీకరణ లేకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడటంతోపాటు ప్రభుత్వ రికార్డుల్లో రెసిడెన్షియల్ ప్రాపర్టీగా కొనసాగుతూ.. కమర్షియల్‌గా మారిన పాత పద్ధతుల్లోనే పన్నులు వసూలు చేస్తుండటం కూడా రాబడిలో తేడా రావడానికి దారితీస్తోందన్నారు. కొందరు లేనిపోని అపోహలు ప్రజల్లో సృష్టిస్తు గందరగోళానికి గురిచేస్తున్నారని, కావున ఇట్టి అంశాలను క్షేత్ర స్థాయిలో ప్రజలకు క్షుణ్ణంగా అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలు ఆస్తి పన్ను చెల్లించే విషయంలో ఎలాంటి అనుమానాలు, అపోహలు ఉన్నా నేరుగా మున్సిపల్ కార్యాలయానికి వచ్చి సంబంధిత అధికారులతో సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ) ఇప్పటికే తీసిన ఉపగ్రహ ఛాయచిత్రాల సహకారంతో భవనాల సమాచారాన్ని డిజిటలైజ్ ప్రక్రియ జరుగుతుందని ఈ క్రమంలో ఆ భవనం ఏ కేటగిరీలో ఉంది? ప్రస్తుతం ఏ కేటగిరీలోకి వస్తోంది.. భవనంలో జరుగుతున్న వాణిజ్య కార్యకలాపాలు, నల్లా, విద్యుత్ కనెక్షన్లు, జీఎస్టీ, ట్రేడ్ లైసెన్సు కలిగి ఉన్నారా.. అనే పూర్తి సమాచారాన్ని సేకరించి ఇందులో పొందుపరచడం జరుగుతుంది. తద్వారా ప్రజలకు పారదర్శక పాలన అందించడంతోపాటు మెరుగైన సేవలు, మౌళిక సదుపాయాలు కల్పించడంలో దోహద పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఓ శ్రీనివాస్ రెడ్డి, మేనేజర్ జ్యోతి, సానిటరీ ఇన్స్‌పెక్టర్ జానకి, సీనియర్ అసిస్టెంట్ జగన్ మోహన్, బిల్ కలెక్టర్లు, వార్డ్ ఆఫీసర్లు, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్లో ఆకట్టుకున్న వినూత్న ఎడ్యుఫేర్



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ అమ్మసాని వెంకటరెడ్డి నగర్‌లోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్లో వినూత్న పేరుతో ఏర్పాటు చేసిన ఎడ్యుఫేర్ అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి సీసీఎంబి సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ కిరణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరైయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో నూతన ఆవిష్కరణలు రూపుదిద్దే ప్రేరణ కలిగించడానికి ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని సూచించారు. అనంతరం స్కూల్ రీజినల్ డైరెక్టర్ కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించడానికి ప్రయోజనం చేకూరుస్తాయన్నారు. అకాడమిక్ కోఆర్డినేటడ్ జి.సునీత మాట్లాడుతూ.. విద్యార్థులలోని వివిధ నైపుణ్యాలకు పదును పెట్టేందుకు ఇటువంటి ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నళిని, వైస్ ప్రిన్సిపాల్ నీలిమా దేవితోపాటు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేదవాడికి ధరణి శాపంగా మారింది : ఎంపీపీ



నవతెలంగాణ-ఘట్కేసర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పేద ప్రజలకు శాపంగా మారిందని సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఘట్కేసర్ మండల ఎమ్మార్వో కార్యాలయంలో ధరణి వల్ల పేద ప్రజలకు అన్యాయం జరుగుతుందని రాష్ట్ర ఎంపీపీల ఫోరం అధ్యక్షులు ఘట్కేసర్ మండల ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఎమ్మార్వో విజయలక్ష్మితో చర్చించారు అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ధరణి తెచ్చిన తర్వాత ఉన్నోడికి వరంగా, లేనోడికి శాపంగా మారిందని ఇప్పటికీ పేద ప్రజలు మండల ఆఫీసులో చుట్టూ కలెక్టర్ ఆఫీస్‌ల చుట్టూ తిరిగి తమ ప్రాణాలు పోగొట్టుకున్నా ఎవరూ స్పందించడంలేదని, ధరణి అనేది కొంతమంది అవినీతి అధికారులకు, నాయకులకు వ్యాపారంగా మారిందని, కోట్ల రూపాయలు చేతులు మారుతున్ననాయని విమర్శించారు. మేడ్చల్ జిల్లాలో పేద ప్రజలు తమ భూ సమస్యలపై ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోవడంలేదు మోటేషన్ సక్సేషన్ పేరిట మీ సేవలో కట్టిన డబ్బులు వేల కోట్ల రూపాయలు ఎక్కడికి వెళ్తున్నాయో అర్థం కావడంలేదు. మీ సేవలో పేద ప్రజలు తమ కుటుంబ సభ్యులు చనిపోయిన వారి నుండి వారి పిల్లలకు పేర్లు రావాలంటే ఐదు ఆరుసార్లు వేల రూపాయలు కట్టినా పనులు కావడంలేదు. మాదారం గ్రామంలో 225 సర్వే నెంబర్లలో భూములు కోల్పోయిన దళిత బాధితులకు అందరికీ న్యాయం జరగకపోవడం, ఒక కుటుంబంలో నలుగురు అన్నదమ్ములు ఉంటే ధరణిలో అప్లై చేసి ఒకరే ఎక్కించుకోవడం, మిగిలిన ముగ్గురు కొడుకులకి అన్యాయం జరుగుతుందని ఇలా చెప్పుకుంటూ పోతే ధరణి వల్ల చాలా సమస్యలు వస్తున్నాయని, వెంటనే ధరణి సమస్యలు పరిష్కారం చేయకపోతే పెద్ద ఎత్తున రైతులతో కలిసి ధర్నాలు నిర్వహిస్తామని అన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

టూరిజం చైర్మెన్ ఉప్పలశ్రీనివాస గుప్తా



నవతెలంగాణ-నాగోల్

క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి ఎంతో ఉపయోగపడతాయని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త అన్నారు. శనివారం నాగోల్ డివిజన్‌లోని బండ్లగూడలో గల వి సౌండ్ స్పోర్ట్స్ అకాడమీలో ఫ్రెండ్స్ క్లబ్ ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన ఫ్రెండ్స్ కప్ 2023 ఇంటర్ క్లబ్ బ్యాడ్మింటన్ టోర్నమెంటు ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో, నియోజకవర్గ కేంద్రాల్లో క్రీడా మైదానాలను నిర్మిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహిస్తూ స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలను కూడా కల్పిస్తున్నారని అన్నారు. నిర్వాకులు ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్తను శాలువాతో ఘనంగా సన్మానించారు. తెలంగాణ రాష్ట్రంలో వివిధ జిల్లాలోని క్రీడాకారులు ఈ టోర్నమెంటులో ఆడనున్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, వెంకట్రావు, శ్రీనివాస్ రెడ్డిలతో పాటు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి

కార్పొరేటర్ పద్మ ఐలయ్య యాదవ్



నవతెలంగాణ-బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ జెనిగా పద్మ ఐలయ్య యాదవ్ అన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్‌గూడ 2వ డివిజన్‌లో ప్రారంభమైన కంటి వెలుగు పరీక్షలు 2వ రోజు కార్పొరేటర్ పద్మ ఐలయ్య యాదవ్, మున్సిపల్ కమిషనర్ కృష్ణ మోహన్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటి పరీక్షలు చేసుకునే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సమస్య లేకుండా కమిషనర్ ఆదేశంలో జనరేటర్ ఏర్పాటు చేసి కరెంటు సమస్య లేకుండా కంటి వెలుగు కార్యక్రమం సురక్షితంగా సాగిస్తున్నారు.

ప్రభుత్వ స్థలాలు కబ్జా చేస్తే కఠిన చర్యలు

- రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సునీత
- 'ప్రభుత్వ భూమికి రెక్కలొచ్చినయ్' కథనానికి కదిలిన రెవెన్యూ యంత్రాంగం
- నిర్మాణాలు కూల్చివేసిన మేడిపల్లి రెవెన్యూ సిబ్బంది



నవతెలంగాణ-బోడుప్పల్

"ప్రభుత్వ భూమికి రెక్కలొచ్చినయ్" అనే శీర్షికతో జనవరి 17న నవతెలంగాణలో వచ్చిన కథనానికి మేడిపల్లి రెవెన్యూ అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. కథనం ప్రచురితం అయిన రోజే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి పూర్తి స్థాయిలో నివేదిక అడగడంతో నిర్మాణదారులకు నోటీసులు జారీ చేసి విచారణ జరిపిన రెవెన్యూ అధికారులు సదరు భూమి ప్రభుత్వ భూమేనని, అందులో చేపట్టిన నిర్మాణాలు, ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలేనని సదరు నిర్మాణాలను శనివారం నాడు మేడిపల్లి తహసీల్దారు ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సునీత ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో కూల్చివేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సునీత మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను దళారుల నుండి కొనుగోలు చేసి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వ స్థలాల్లో ఎవరైనా నిర్మాణాలు చేపడితే భూ కబ్జా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు పోటీ పరీక్షలు దోహదం



నవతెలంగాణ - హస్తినాపురం

విద్యార్థుల్లో దాగి వున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు పోటీ పరీక్షలు దోహదపడతాయని బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని సాహెబ్ నగర్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పరీక్షపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలని రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎల్బీనగర్ అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్‌లు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయిలో ఎదగాలని, పరీక్షా పే చర్చ ద్వారా విద్యార్థులకు ఒత్తిడి లేని వాతావరణాన్ని కల్పించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నిర్ణయం ఎంతో సాహసోపేతమైనదని వారు అభివర్ణించారు. అనంతరం పోటీ పరీక్షలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు లీలారాణి, మాజీ కౌన్సిలర్ అంజన్ కుమార్ గౌడ్, మహిళా అర్బన్ జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి పాల్గొన్నారు.

21న వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-వనస్థలిపురం

వనస్థలిపురం వాలీబాల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మన్నే కిరణ్ కుమార్ మరియు డానియల్ మెమోరియల్ వాలీబాల్ టోర్నమెంట్-2023 ఈనెల తేదీ 21 నుంచి 22 వరకు ఛత్రపతి శివాజీ స్టేడియం (నాగార్జున గ్రౌండ్), నాగార్జున హై స్కూల్ దగ్గర, ఎన్‌జీవో కాలనీ, వనస్థలిపురం నందు నిర్వహించబడును. ఆసక్తి గల క్రీడాకారులు తమ టీమ్స్‌ను రిజిస్టర్ చేసుకోవడానికి సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు 9347579545 (విజయ్), క్రిష్ణమోహన్‌రెడ్డి, 7995883724, అశోక్ రెడ్డి, 8639107715, సాయి 9542841615, హరినాథ్‌రెడ్డి, 9912579977 గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేయబడును.

భూదాన్ భూములను కాపాడాలని ఎమ్మెల్యేకు వినతి



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూదాన్ భూములను కాపాడాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజ్ రవీంద్రాచారి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజ్ రవీంద్రాచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాలరెడ్డిలు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని వివిధ గ్రామాల రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, వీటిపై ఎమ్మెల్యే కిషన్ రెడ్డి దృష్టి పెట్టి ప్రభుత్వ భూములను కాపాడి, ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాల కోసం భూదాన్ భూములను కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. అందుకు ఎమ్మెల్యే ప్రభుత్వ భూములను కాపాడడానికి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో పెద్ద అంబర్‌పేట మున్సిపల్ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, ఎఐటీయూసీ జిల్లా నాయకులు, మాజీ కౌన్సిలర్ హరిసింగ్ నాయక్, ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి వేణుగోపాలచారి, సర్వోదయం మండలి జిల్లా కన్వీనర్ పడసనబోయిన సైదులు తదితరులు ఉన్నారు.

క్షయ రోగులకు పౌష్టికాహార కిట్లు అందజేత



నవతెలంగాణ-సరూర్‌నగర్

ప్రధాన మంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో సరూర్‌నగర్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ రోగులకు అందచేశారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ రంగారెడ్డి జిల్లా కోశాధికారి రాఘవరెడ్డి మాట్లాడుతూ టీబీ రోగులు క్రమం తప్పకుండా మందులతో పాటు పౌష్టికాహారం తీసుకొన్నట్లయితే వ్యాధిని నివారించవచ్చునని తెలిపారు. టీబీ నివారణకు స్వచ్ఛంద సంస్థలు, ఎన్‌జీఓ ఆర్గనైజేషన్స్, ప్రైవేట్ రంగ సంస్థలు కృషి చేయాలి అని, వ్యాధి బాధితులకు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డా.అర్చన, డా.కిరణ్ కుమార్, సూపర్‌వైజర్ నాగిరెడ్డి పాల్గొన్నారు.

నూతన టీవీసీ విడుదల చేసిన లగ్జరీ బాత్ వేర్ బ్రాండ్ క్యుయో

నవతెలంగాణ- హైదరాబాద్

హిందేవేర్ లిమిటెడ్కు చెందిన అగ్రగామి లగ్జరీ బాత్ వేర్ బ్రాండ్ క్యుయో తమ నూతన టీవీసీ విడుదల చేసింది. లెట్ టైమ్ వెయిట్ అంటూ తీర్చిదిద్దిన ఈ టీ వీసీలో సుప్రసిద్ధ భారతీయ నటి, ప్రొఫెషనల్ థియేటర్ ఆర్టిస్ట్ అహానా కుమ్రా కనిపించనున్నారు. ఈ ప్రచారం గురించి హిండ్వేర్ లిమిటెడ్, బాత్ అండ్ టైల్స్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సుధాంశు పోఖ్రియాల్ మాట్లాడుతూ... లగ్జరీ బాత్ లాంజ్లను సృష్టించాలనే తమ సిద్ధాంతానికి అనుగుణంగా తాము తమ బ్రాండ్ ప్రచారం లెట్ టైమ్ వెయిట్ను తమ బ్రాండ్ క్యుయో కోసం విడుదల చేశామన్నారు. వినియోగదారులు తమ ప్రచారాన్ని అభినందించగలరని ఆశిస్తున్నామని తెలిపారు. హిండ్వేర్ లిమిటెడ్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ చారు మల్హోత్రా మాట్లాడుతూ... ఈ నూతనంగా విడుదల చేసిన ప్రచారం లెట్ టైమ్ వెయిట్ అనేది సమగ్రమైన 360 డిగ్రీ ప్రచారమన్నారు. ఈ ప్రచారం ద్వారా అత్యున్నత బాత్ స్పేస్ అంటే క్యుయో మించినది లేదని పునరుద్ఘాటిస్తున్నామన్నారు. ఇంక్నట్ డిజిటల్ డైరెక్టర్ జహంగీర్ ఇరానీ మాట్లాడుతూ...క్యుయో యూరోపియన్ లగ్జరీని జీవితానికి తీసుకురావడం పట్ల చాలా సంతోషంగా ఉన్నామన్నారు. ఈ ఉత్పత్తులు అత్యంత సున్నితమైనవి, నిస్సందేహంగా ఈ షోకు స్టార్స్ వెలుగొందుతాయన్నారు.

నేడు ఐద్వా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

నవతెలంగాణ-మీర్‌పేట్

మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ జనప్రియ మహనగర్‌లో ఐద్వా మహిళా సంఘం, ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా ఐద్వా నాయ కురాలు మస్తాన్ బీ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం పిల్లలకు డ్రాయింగ్, మ్యూజికల్ చైర్, ఉపన్యాస పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐద్వా రాష్ట్ర నాయకురాలు ఇందిర, మున్సిపల్ కమిషనర్ నాగేశ్వర్, స్థానిక కార్పొరేటర్ విజయలక్ష్మి రాజ్‌కుమార్, రంగారెడ్డి జిల్లా జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు సాయిబాబు పాల్గొంటారని తెలిపారు.

కళాకారుడు బిరుదుచందర్‌కు ఘన సన్మానం



నవతెలంగాణ-బడంగ్‌పేట్

ఇండియన్ జర్నలిస్టు జాతీయ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి ఓ దిన పత్రిక జర్నలిస్టు, కళాకారుడు బిరుదుచందర్‌ను మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకృష్ణ ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా మాడుగుల మండలం, గిరికొత్తపల్లి మారుమూల గ్రామంలో జన్మించిన బిరుదుచందర్ తెలంగాణ ఉద్యమంలో చురుకైన పోషించిన ఉ్యమకారులుగా, అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. గతంలో అంబేడ్కర్ అవార్డు గ్రహీతగా ఉండి, రానున్న కాలంలో మరిన్ని ఉన్నత పదవులు అందుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి బిల్లం మహేందర్, నాయకులు మొగుళ్ళ కృష్ణ, పవన్, డి.భాస్కర్, రాజు, కురుమూర్తి, శేఖర్ ఉన్నారు.

నాగార్జున విద్యాసంస్థల వార్షికోత్సవ వేడుకల్లో సినీ హీరో కార్తికేయ సందడి



నవతెలంగాణ-హస్తినాపురం

జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేసినప్పుడే ఎవరైనా ఎంచుకున్న రంగంలో విజయం సాధిస్తారని సినీ హీరో కార్తికేయ అన్నారు. బి.ఎన్‌రెడ్డి నగర్ పరిధిలో గల బి.డి. గార్డెన్‌లో శనివారం నిర్వహించిన నాగార్జున మోడల్ స్కూల్ 28వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారుల అభిరుచిని, వారిలో దాగి ఉన్న నైపుణ్యాలను గుర్తించి వారిని ఆయా రంగాలలో ప్రోత్సహించాలని కోరారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంటే పిల్లలు తమకు నచ్చిన రంగంలో విజయం సాధిస్తారని కార్తికేయ పేర్కొన్నారు. నాగార్జున విద్యా సంస్థల చైర్మెన్ గుమ్మకొండ విఠల్ రెడ్డి మాట్లాడుతూ బోధనలో విషయ పరిజ్ఞానానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నందున ప్రతి ఏడాది పదవ తరగతి పరీక్షల్లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు తెలిపారు. తమ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీ పరీక్షలలో నెగ్గి ఐఐటి మరియు మెడిసిన్ సీట్లను సాధించారని, ఏడాది పదవ తరగతి పరీక్షలలో జీపీఏ 10 పాయింట్లు సాధించిన 26 మంది విద్యార్థులకు ఐదు వేల రూపాయల బహుమానం మరియు మెమొంటో ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాగార్జున విద్యా సంస్థల వైస్ చైర్‌పర్సన్ జి.రజనీ, విఠల్‌రెడ్డి, డైరెక్టర్ లోహితా కార్తికేయరెడ్డి, సీ.ఏ.ఓ ఎ.శేషారావు, అకాడమిక్ డీన్ ఎస్.రాజశేఖర్, పాఠశాల ప్రిన్సిపాల్ అలుగుబెల్లి పద్మావతి వెంకటరెడ్డి, అధిక సంఖ్యలో విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణం కోసం పరిశీలన

- వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు సురక్షితంగా ఉండే విధంగా ప్రణాళికలు
- కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి



నవతెలంగాణ-హయత్‌నగర్

మన్సురాబాద్ డివిజన్ పరిధిలోని విజయవాడ నేషనల్ హైవే విస్తరణలో భాగంగా వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా ముందస్తు ప్రణాళికలో భాగంగా ఆర్అండ్‌బీ నేషనల్ హైవే అభివృద్ధి శాఖ అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులు వివిధ కాలనీవాసులతో స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి సందర్శించారు. గణేష్ నగర్ కాలనీ మొదలుకొని ఆగమయ్య నగర్ వరకు స్టార్మ్ వాటర్ డ్రైన్‌ను నిర్మాణం కొరకు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో గణేష్ నగర్, సాయినాథ్ కాలనీ, మల్లికార్జున నగర్ మొత్తం జలమయం అవుతాయని, దీని వలన కాలనీవాసుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్య పరిష్కారానికై స్టార్మ్ వాటర్ డ్రైన్‌ను నిర్మించాలని సూచనలు చేసి, రెండు శాఖల అధికారుల సమన్వయంతో జఠిలమైన సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ నేషనల్ హైవే శాఖ అధికారులు ఏఈ శరత్‌చంద్ర, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ శాఖ ఏఈ స్వప్న, సీతారామ్, వివిధ కాలనీవాసులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



నవతెలంగాణ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

నవతెలంగాణ తెలుగు దినపత్రిక నూతన డైరీ, క్యాలెండర్‌ని రాష్ట్ర రవాణాశాఖ డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ (డీటీసీ) కె.పాపారావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో జి.సురేష్ రెడ్డి, ఎంవీఐ వివేకనందరెడ్డి పాల్గొన్నారు.

శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌కు 50 బారికేడ్లు వితరణ

నవతెలంగాణ-శామీర్ పేట



రోడ్డు ప్రమాదాలకు బారికేడ్లు దోహదపడుతాయని శామీర్‌పేట సీఐ సుధీర్ కుమార్ అన్నారు. శామీర్‌పేట్ పీఎస్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు బేగంపేట్ మెడికవర్ హాస్పిటల్ యాజమాన్యం స్పందించి మెడికవర్ హాస్పిటల్ ఇన్‌చార్జి డా.రిషికేష్ శనివారం 50 బారికేడ్లను శామీర్‌పేట్ సీఐ సుధీర్ కుమార్‌కు అందజేశారు. మెడికవర్ హాస్పిటల్ యాజమాన్యాన్ని సీఐ ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ ఇన్‌చార్జి డా.రిషికేష్, సుధాకర్, ఎస్సైలు రవికుమార్, మునీందర్, అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని వినతి

నవతెలంగాణ-దుండిగల్



మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గాదయాకర్ రెడ్డి శనివారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ని ప్రగతినగర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో గ్రంథాలయ భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యేకి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రజలకు ఉపయోగపడేలా త్వరలోనే ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి గ్రంథాలయ భవనం కోసం కేటాయించేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల కలేనా..?

- 11 ఏండ్లుగా ధర్నాలు, రాస్తారోకోలు
- అయినా పట్టించుకోని ప్రజా ప్రతినిధులు

నవతెలంగాణ-మేడ్చల్

విద్యార్థుల భవిష్యత్ కోసం మేడ్చల్ పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని 11 ఏండ్లుగా విద్యార్థి సంఘాలు పోరాటాలు చేస్తున్నా ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రి, జిల్లా మంత్రిలో ఎలాంటి చలనం లేకపోవడం పట్ల పలువురు విద్యా సంఘాల నేతలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

వివరాలు ఇలా ఉన్నాయి..

కొన్నేండ్లుగా సుమారు 1500 మంది విద్యార్థులతో కలిసి పలువురు విద్యా సంఘాలు నాయకులు రోడ్లపై బైఠాయించి, రాస్తారోకో, సమ్మెలు నిర్వహించినా ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణ విషయంలో నిర్లక్ష్యమే జరుగుతోందని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మేడ్చల్ పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే మేడ్చల్ చుట్టు పక్కల 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాల నుంచి అనేక మంది విద్యార్థులు ఉన్నత చదువులకు నోచుకుంటారనీ, ఇందుకు మంత్రి మల్లారెడ్డి



సహకరించాలని బీసీ విద్యార్థి సంఘం, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, వివిధ విద్యా సంఘాల నాయకులు కోరుతున్నారు. ఇప్పటికైనా డిగ్రీ ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేయకపోతే భారీ ఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని వారు హెచ్చరిస్తున్నారు.

కేజీ టు పీజీ విద్య ఎక్కడ : గోదా అరుణ్ యాదవ్, బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు

11 ఏండ్లుగా మేడ్చల్ పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఉద్యమిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కేజీ టు పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తానని హామీనిచ్చిన ప్రభుత్వానికి ఇప్పటివరకు ఎలాంటి చలనం లేదు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నో వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదు. పేద విద్యార్థులు చదువుకోవాలంటే 30 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫైలు సీఎం దగ్గర పెండింగ్‌లో ఉంది : ఎర్రం ప్రవీణ్ యాదవ్

మేడ్చల్ పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసేంతవరకు పోరాటం ఆగదు. కొన్ని రోజుల క్రితం రాష్ట్ర విద్యాశాఖ మంత్రికి ఫోన్ లో మేడ్చల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విషయమై మాట్లాడగా మంత్రి స్పందిస్తూ ఫైలు సీఎం దగ్గర ఉంది రాగానే చేస్తాం మని చెప్పారు. నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలంటే ప్రయివేటు కళాశాలలో ఐదంకెల సంఖ్యలో ఉన్న ఫీజులు చెల్లించే స్తోమత లేక ఉన్నత విద్యకు నోచుకోలేక ప్రయివేటు పరిశ్రమల్లో, తల్లిదండ్రులకు తమ వంతు సాయంగా కూలీ పని చేస్తూ చేదోడువాదోడుగా ఉంటున్నారు.

గౌతంనగర్ రోడ్ల పై మురుగు ప్రవాహం

- దుర్వాసన దుర్గంధంతో స్థానికుల ఇక్కట్లు
- రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ-బాలానగర్

మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలో పారిశుధ్యం అధ్వాన్నంగా మారింది. గౌతమ్ నగర్, పలు కాలనీల్లో నిత్యం అంతర్గత ఎక్కడో ఒకచోట రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తూ పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కనిపిస్తుంటే మరో పక్క డివిజన్ల పరిధిలో అందుకు భిన్నంగా మురుగు రహదారులపై పరుగులు తీస్తూ దర్శనమిస్తున్నాయి. మురుగు ప్రవాహం వల్ల దోమలకు ఆవాకసాలుగా మారి ప్రజలు వ్యాధుల బారినపడే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేక డ్రైనేజీ లోని పూడికను పారిశుధ్య సిబ్బంది సరైన సమయంలో తొలగించకపోవడంతో మురుగు నీరు రోడ్డు పైకి చేరి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నా అధికారులు ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మురుగు సమస్యకు త్వరితగతిన పనులు పూర్తి చేసి స్థానిక నివాసితులకు మెరుగైన వాతావరణాన్ని కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

దుర్గంధంతో స్థానిక ప్రజల ఇబ్బందులు..

మ్యాన్‌హోళ్లలో చెత్తా చెదారం సకాలంలో తొలగించకపోవడం వల్ల తరచూ మురుగు లీకై రోడ్లపై అధికంగా ప్రవహిస్తోందని ఆరోపణలు ఉన్నాయి. మురుగును తీసి రోడ్లపై కుప్పలుగా వేసి తొలగించక పోవడంతో దుర్వాసన తో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తీసిన మురుగును వెంటనే తొలగించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్లు, చెరువుల సుందరీకరణ పనులపై ఎమ్మెల్యే సమీక్ష



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో హెచ్ఆర్డీసీఎల్ వారు చేపడుతున్న లింకు రోడ్లు, హెచ్ఎండీఏ చేపడుతున్న చెరువుల అభివృద్ధి పనులపై శనివారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రగతినగర్‌లోని మున్సిపల్ కార్యాలయం వద్ద స్థానిక మేయర్ కొలన్ నీలా గోపాల్ రెడ్డి, ఇన్‌చార్జి కమిషనర్ రామకృష్ణారావు, డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఆయా విభాగాల అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు లింకు రోడ్ల అభివృద్ధికి మంజూరైన నిధులతో పనులు వేగంగా చేపట్టి పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చెరువుల సుందరీకరణలో భాగంగా బైరం చెరువు, తుర్క చెరువుల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టి పనులను త్వరలోనే ప్రారంభించేలా సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఈ సమావేశంలో ఆయా విభాగాల అధికారులు, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

'అలైదా గువేరా' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



ప్రపంచ విప్లవకారుడు, ధైర్యశాలి, చేగువేరా కుమార్తె అలైదా గువేర మనవరాలు ప్రొఫెసర్. ఎస్తిఫెయినా గువేరా నేడు సాయంత్రం 3 గంటలకు నగరంలోని రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటున్నారనీ, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి ఈ.ఉమా మహేష్ శనివారం ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19వ శతాబ్దంలో ప్రపంచంలో అనేక దేశాలు అమెరికా, బ్రిటన్. సామ్రాజ్యవాద దేశాల పరిపాలనలో ఉన్నప్పుడు మెజార్టీ దేశాలు స్వాతంత్రం కోసం పోరాడుతున్న సందర్భంలో ఆయా దేశాలకు మద్దతుగా సోషలిస్టులు, కమ్యూనిస్టులు పిలుపునిచ్చి వారి స్వతంత్ర ఉద్యమంలో భాగస్వాములుగా పాల్గొన్నట్టు తెలిపారు. అలా అమెరికాకు కూతవేటు దూరంలో ఉన్న క్యూబా అమెరికా పరిపాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్నప్పుడు అర్జెంటీనలో పుట్టి క్యూబా దేశానికి స్వాతంత్ర్యం కోసం గెరిల్లా యుద్ధంలో పాల్గొని బాటిస్ట్ ప్రభుత్వాన్ని కులగొట్టి క్యూబా ప్రజలకు ఉచిత విద్య,వైద్యం అందించి ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. అనంతరం బొలివియా దేశ స్వతంత్ర కోసం పోరాడుతూ అమెరికా, సీఐఏ ఏజెంట్లకు చిక్కి చంపబడ్డారనీ, అలా ఒక దేశంలో పుట్టి ఇతర దేశాల విముక్తి కోసం పోరాడిన విప్లవకారుడు చేగువేరా అన్నారు. నేటికీ క్యూబా దేశం ప్రపంచ ప్రజలు కరోనాతో బాధపడుతుంటే సుమారు 40 దేశాలకు తమ వైద్య సిబ్బందిని పంపించి సహాయం చేసిందని దానికి కారణం అక్కడ సోషలిస్టు ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలే కారణమన్నారు.



195 మంది ఐపీఎస్ ట్రైనింగ్ అధికారులు శనివారం టీఎస్‌పీఐసీసీసీని సందర్శించారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరును సీపీ సీవీ ఆనంద్ వారికి వివరించారు. ఒకే గొడుగు వేదికగా అందుతున్న సేవలను వారికి వివరించారు. ఈ సమావేశంలో డీసీపీ డీ.సునితా రెడ్డి, సీహెచ్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-సిటీబ్యూరో

గొర్రెల మేకల పెంపకందారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-శామీర్ పేట



శామీర్‌పేట మండల తహసీల్దార్ టి.సత్యనారాయణ శనివారం గొర్రెల, మేకల పెంపకం దార్ల సంఘం జిల్లా 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎక్కల దేవి కొమురయ్య మాట్లాడుతూ సంఘం పేరుతో క్యాలెండర్ గొల్లకురుమల ఐక్యతకు ఉపయోగపడుతుందన్నారు. దీనికి పరోక్షంగా కొంతమంది పరోక్షంగా సహకరించి మద్దతు తెలుపుతున్న ప్రజాప్రతినిధులకు అధికారులకు సొసైటీ అధ్యక్షులకు ప్రత్యేకంగా ధన్యవాదములు తెలిపారు. జిల్లాలో గొల్లకురుమల సమస్యలు పరిష్కారం కోసం ఎల్లప్పుడూ పోరాటం చేసేది ఒక్క గొర్రెల మేకల పెంపకందారుల సంఘమే అన్నారు. జిల్లాలో గొర్రెల మేకల పెంపకందారులు అనేకమైన సమస్యలు ఉన్నాయన్నారు. 559, 1016 జీవోలు గొర్రెల కాపారులకు బీమా పథకం, గొర్రెల కు ఇన్సూరెన్స్ ప్రవేశపెటాలానీ, పశు వైద్యుల ఖాళీ పోస్టులు పూర్తి చేసి గొర్రెలకు వైద్యులకు అందుబాటులోకి రావాలని ఇలాంటి సమస్యలు అనేకం ఉన్నాయని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం గొల్ల కురుమలు ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జీఎంపీఎస్ సంఘం జిల్లా కార్యదర్శి ఎక్కలదేవి కొమురయ్య, ఉపాధ్యక్షుడు నర్ల రాములు, బీఆర్ఎస్ శామీర్‌పేట మండల అధ్యక్షుడు సుదర్శన్, సర్పంచులు బాలమని, గురక కుమార్, ఉపసర్పంచ్ నర్ల రమేష్, కట్టమైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్, సొసైటీ వైస్ చైర్మన్ ఐలయ్య యాదవ్, బత్తుల ప్రభాకర్, తుర్కపల్లి వార్డ్ మెంబర్ భూలక్ష్మి దామోదర్, అలియాబాద్ వార్డ్ మెంబర్ గుదే వెంకటేశం, ఎక్స్ వార్డ్ మెంబర్ నర్ల యాదగిరి, వట్టెల గణేష్ నర్ల మేకల కుమార్, సంఘం అధ్యక్షుడు నర్ల స్వామి, సత్తయ్య గురుకుల రాములు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి



నవతెలంగాణ-మేడ్చల్

ఎస్సీ వర్గీకరణ బిల్లును వెంటనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా కో-కన్వీనర్ వడ్డేపల్లి శివకుమార్ మాదిగ ఆధ్వర్యంలో శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల విక్రమ్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 100 రోజుల్లో వర్గీకరణ చేసి మాదిగల రుణం తీర్చుకుంటామన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్ లో ప్రవేశ పెట్టాలని కోరారు. ఈ నెల 24వ తేదీన బీజేపీ జిల్లా కార్యాలయాల ముట్టడికి మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి బంగరిగళ్ల శంకర్ మాదిగ, ఎం.ఎస్.పి జిల్లా నాయకులు, ఎమ్ఎస్‌పి.మండల అధ్యక్షుడు పరశురాం మాదిగ, నాయకులు తుడుం రమేష్ బాబు మాదిగ, స్వామి మాదిగ, గుండ్ల పోచంపల్లి ఎమ్మార్పీఎస్ నాయకులు కుండ భానుచందర్ మాదిగ, రవి మాదిగ, మహేష్, సురేష్ పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు అంకిత భావంతో కృషి చేయాలి

నవతెలంగాణ-కూకట్ పల్లి



శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్‌కాలనీ డివిజన్ లోని శంశిగూడ ప్రభుత్వ పాఠశాలలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విద్యార్థుల కోసం దేశ వ్యాప్తంగా రూపొందించిన పరీక్ష పే చర్చ కార్యక్రమంలో భాగంగా ఆర్ట్ (డ్రాయింగ్) పోటీలను బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు పన్నాల హరీష్ రెడ్డి హాజరై పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవకుండా చదువుపై మక్కువ పెంచుకుని పరీక్షలు రాసి మొదటి శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థులు ఇప్పటి నుంచే లక్ష్యాన్ని ఎంచుకుని ఆ లక్ష సాధన కోసం అంకితభావంతో కృషి చేస్తే తప్పక విజయం సాధిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు డాక్టర్ కొరడాల నరేష్, విజిత్, కుమార్ యాదవ్, మణిభూషన్, కమలాకర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, రామ్ రెడ్డి, రఘు, అనిత, శివాజీ, రామకృష్ణ పాల్గొన్నారు.

షరీఫ్ కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-శామీర్‌పేట

రెండేండ్లుగా శామీర్ పేట పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న ఎండీ.షరీఫ్ గత డిసెంబర్ 9వ తేదీన శామీర్ పేట్ పీఎస్ పరిధిలో పెట్రోలింగ్ విధుల్లో ఉండగా ఒక కారు ఢీ కొట్టగా జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై యశోద హాస్పిటల్ (సికింద్రాబాద్)లో చికిత్స పొందుతూ గత నెల 10వ తేదీన చనిపోయాడు. నిరుపేద కుటుంబం నుంచి కానిస్టేబుల్ స్థాయికి ఎదిగి, తన కుటుంబం మొత్తంను తన జీతంతో పోషిస్తున్న షరీఫ్ చనిపోవడంతో చాలా బాధాకరమని శామీర్ పేట్ సీఐ సుధీర్ కుమార్ ప్రోత్సాహంతో శామీర్ పేట్ పీఎస్ సిబ్బంది, పేట్ బషీరాబాద్ డివిజన్ పోలీస్ సిబ్బంది, ఇతర దాతల సహకారంతో రూ.25 లక్షలు సేకరించిన చెక్కును బాలానగర్ డీసీపీ కార్యాలయంలో సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర చేతుల మీదుగా షరీఫ్ తల్లిదండ్రులు, భార్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ డీసీపీ సందీప్, ఏసీపీ రామలింగరాజు, శామీర్ పేట్ ఇన్‌స్పెక్టర్ సుధీర్ కుమార్, ఎస్సైలు వీరశేఖర్, రవికుమార్, మునీందర్, చంద్రశేఖర్, అనిత, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుదలతో చదివితే ఉజ్వల భవిష్యత్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

విద్యార్థులు చిన్ననాటి నుంచే కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ విద్యార్థులకు సూచించారు. శనివారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మగ్దూం నగర్ సమీపంలోని భగత్ సింగ్ మార్గ్ లో గల శ్రీ సాయి విద్యానికేతన్ హై స్కూల్ క్యాంపస్‌లో 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మేడ్చల్ జిల్లా ట్రస్మా ఉపాధ్యక్షులు, పాఠశాల చైర్మన్, కరస్పాండెంట్ బీర్రు ఆంజనేయులు, ప్రిన్సిపాల్, అకాడమిక్ డైరెక్టర్ బీర్రు శోభారాణితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుంచే విద్యతోపాటు క్రీడలు, శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణిస్తేనే కలలను సాకారం చేసుకోవచ్చని తెలిపారు. కరస్పాండెంట్ బీర్రు ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు సామాజిక అంశాలతో కూడిన విలువలు నేర్పుతున్నామన్నారు. పాఠశాలలో ప్రతి పండుగ విశిష్టత గూర్చి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామనీ, తమ పాఠశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు నేడు ఉన్నత హోదాల్లో ఉన్నారని గుర్తు చేశారు. సాధారణ విద్యార్థులతో అసాధారణంగా ఫలితాలు సాధిస్తూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సయ్యద్ రషీద్, ఉపాధ్యాయులు సాయిశ్రీ, ప్రశాంతి, స్వప్న, సునీత, భాగ్యరేఖ, శైలజ, లక్ష్మీ ప్రసన్న, రజిత, మహేశ్వరి, అన్నే ఫాతిమా, పద్మ, పుష్ప, సాజిత, ఆసిఫా, సుభాషిని పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రాష్ట్రంలోని పేదల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంకు చెందిన 59 మంది సీఎం రిలీఫ్ ఫండ్ లబ్దిదారులకు రూ.25,0, 1500 విలువ చేసే చెక్కులను ఎమ్మెల్యే ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించి శనివారం చింతల్‌లోని తన క్యాంపు కార్యాలయం వద్ద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమమే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయం అన్నారు. పేద ప్రజలకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. పేదలకు కూడా కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ద్వారా సహాయం అందిస్తున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-దుండిగల్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధికి చెందిన 21 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను రూ.21,02,436 చెక్కులను శనివారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ స్థానిక మేయర్ కొలన్ నీలా గోపాల్ రెడ్డి, డిప్యూటీ మేయర్ దన్ రాజ్ యాదవ్, ఇన్‌చార్జి కమిషనర్ రామకృష్ణారావు, తహసీల్దార్ సురేందర్‌తో కలిసి ప్రగతి నగర్ మున్సిపల్ కార్యాలయం వద్ద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆడపిల్లలకు కల్యాణలక్ష్మి వరం లాంటిదన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం అన్నారు. పేదల కోసం షాదీ ముబారక్, కల్యాణలక్ష్మీ వంటి అనేక పథకాలను అర్హులైన ప్రజలు ఆస్వాదిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం 129 డివిజన్ పరిధిలోని సిటీ పాలస్ ఫంక్షన్ హాల్ లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు, టీపీసీసీ ప్రతినిధి కోలన్ హన్మంత్‌రెడ్డి మాట్లాడారు. డివిజన్‌లో 55 బూత్‌లు స్థాయి కమిటీలు పూర్తి చేయాలన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలనీ భవిష్యత్తులో మంచి గుర్తింపు ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు శ్రావణ్ కుమార్, ఆలిండియా దళిత సేన అధ్యక్షులు అవిజె జేమ్స్, సువారి శ్రీనివాస్, అమర్ బాబు, పండరి రావు, గూడ ఐలయ్య గౌడ్, సుజాత ధన్ రెడ్డి, నారాయణరెడ్డి గణేష్, వీరేష్ గుప్తా, డివిజన్ నాయకులు సంతోష్ ముదిరాజ్, శ్రీశైలం యాదవ్, సంపంగి వెంకటేష్, మల్లేష్, అబ్బాస్, ప్రవీణ్, వాసు, ప్రకాష్, సతీష్, గురు, శివ పాల్గొన్నారు.

జెడ్పీ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం పరిశీలన

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



సుభాష్‌నగర్ 130 డివిజన్, సూరారం కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి శనివారం పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా అందిస్తున్న సరుకులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉందని విద్యార్థులను ఆరా తీశారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతులుగా ఎదగాలన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం అన్నారు. ఏ ఒక విద్యార్థి కూడా ఆకలితో ఉండకూడదనీ, కడుపునిండా తిని చక్కగా చదువుకోవాలనే ముఖ్య ఉద్దేశంతో ఈ పథకం ప్రారంభించినట్టు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయుల వినతి మేరకు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అందిస్తున్న ఉచిత నోట్ పుస్తకాలను, పదో తరగతి విద్యార్థులకు కార్పొరేటర్ హేమలత సురేష్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జావేద్, ఉపాధ్యాయ బృందం, బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి శివాజీ, కార్పొరేటర్ కూతురు రాజ్యలక్ష్మి, మహిళా అధ్యక్షురాలు మంగ, ప్రధాన కార్యదర్శి పద్మావతి, లక్ష్మి విజయ్ కుమార్, జహంగీర్, రాము పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మేయర్‌కు వినతి



నవతెలంగాణ-దుండిగల్

కుతుబుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 3వ పరిధిలోని శిల్పా లేఅవుట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని శిల్పా లేఅవుట్ ప్రజలు శనివారం మేయర్ కొలన్ నీలా గోపాల్ రెడ్డి, ఇన్‌చార్జి కమిషనర్ రామకృష్ణారావుని నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయంలో 3వ డివిజన్ కార్పొరేటర్ బి.వెంకటరామయ్యతో కలిసి మర్యాద పూర్వకంగా కలిసి వారి ప్రాంతంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరతూ వినతిపత్రం అందజేశారు. మేరకు మేయర్ సానుకూలంగా స్పందించి వారి ప్రాంత సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు విజయలక్ష్మి సుబ్బారావు, వాకలపూడి రవికిరణ్, బాలాజీనాయక్, బీఆర్ఎస్ మహిళా నాయకురాలు అర్పిత పాల్గొన్నారు.

ఘనంగా సురేష్, శివ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని డబిల్ పూర్ గ్రామ నాయకులు పనుగంటి సురేష్, శివ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు వీర్లపల్లి భాగ్యరెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాలువాలు కప్పి సన్మానించి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు తలారి అశోక్ ముదిరాజ్, గంగారాం, రాజశేఖర్, ప్రవీణ్, నందు, రమేష్, గిరీష్, ఆంజనేయులు, అజయ్, తదితరులు పాల్గొన్నారు.





30న కేంద్ర కార్మిక సంఘాల భేటీ

కేంద్రం విధానాలపై పోరాట కార్యాచరణ రూపకల్పన

- పలు తీర్మానాలకు మహాసభ ఆమోదం
- నాలుగు కమిషన్లపై ప్రతినిధుల చర్చ
- సీఐటీయూ అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్



శ్యామల్ చక్రవర్తి నగర్ నుంచి అచ్చిన ప్రశాంత్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు ఈ నెల 30న ఢిల్లీలో కేంద్ర కార్మికుల సంఘాలన్నీ భేటీ అయి ఐక్యకార్యాచరణ రూపొందిస్తామని సీఐటీయూ అఖిల భారత ప్రధాన కార్య దర్శి తపన్‌సేన్ తెలిపారు.

బెంగుళూ రులోని శ్యామల్ చక్రవర్తినగర్(ప్యాలెస్ గ్రౌండ్)లోని మీడియా పాయింట్‌లో ఆయన విలే కర్లతో మాట్లాడారు. శని వారం నాడు మహాసభ ప్రతి నిధులు నాలుగు కమిషన్లుగా ఏర్పడి ఆధునిక ఉత్పాదక రంగంలో కార్మికులను సంఘటితం చేయడంలో ప్రాముఖ్యత, సవాళ్ళు, భారతదేశంలో కార్మికుల అంతర్గత వలసలు, నయా ఉదారవాదం-కోవిడ్ సంక్షోభంలో ఇక్కట్లు, వ్యవస్థీకరణ సవాళ్ళు, ఉపాధి విధానంలో వచ్చిన మార్పులు, కార్మికుల ఇక్కట్లు, కార్మికవర్గంపై మతోన్మాద ప్రభావం అనే అంశాలపై ప్రతినిధులు చర్చలు జరిపారని తెలిపారు. సుమారు రెండు వందల మందికిపైగా ఆ చర్చల్లో పాలుపంచుకున్నారన్నారు. ఇప్పటి వరకూ మూడు రోజుల పాటు జరిగిన మహాసభలో 58 మంది ఆయా రాష్ట్రాల, ఫెడరేషన్ల ప్రతినిధులు చర్చల్లో పాల్గొని నిర్మాణ పరమైన అంశాలపై లోతుగా చర్చించారనీ, విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారని చెప్పారు. వాటన్నింటినీ క్రోడీకరించుకుని భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకుంటామని తెలిపారు.

యూఎస్ఏ, యూరప్, తదితర దేశాల్లో ప్రయివేటీకరించబడిన సంస్థలను తిగిరి ప్రభుత్వ రంగంలోకి మార్చాలని ప్రజలు పెద్దఎత్తున పోరా టాలు చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. సోషలిస్టు ప్రభు త్వాలు ఏర్పడే చోట సామ్రాజ్య వాదం వాటిని కూల్చేసే ప్రయత్నాలు చేస్తున్నదన్నారు. చైతన్యవంతమైన ప్రజలు సామ్రాజ్యవాద ఎత్తుగడలను తిప్పికొడుతున్నారని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇలాంటి వాటిని పరిగణనలోకి తీసుకోకుండా కార్పొరేట్లకు మేలు చేకూర్చేలాగా రైల్వే, ఇన్సూరెన్స్, విద్యుత్, ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణకు పూనుకుంటు న్నదని విమర్శించారు.

ఎన్ఎంపీ పేరుతో కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతున్న తీరును వివరించారు. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పోరాటాలను ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. వ్యవసాయ రంగంలో తీసుకురావాలని చూసిన మూడు చట్టాలను రైతులంతా ఐక్యంగా పోరాడి తిప్పికొట్టారన్నారు. ఆ పోరాట స్ఫూర్తి తో ముందుకు సాగుతామని చెప్పారు. కేంద్రం విధానాల వల్ల ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

కార్మికుల పనివిధానంలోనూ తేడా వచ్చిందనీ, పర్మినెంట్ కార్మికుల స్థానాల్లో కాంట్రాక్టు, ట్రైనీ ఎంప్లాయి మెంట్ విధానం అమల్లోకి వచ్చిందని చెప్పారు. లేబర్ కోడ్ల రద్దు కోసం, నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలను అరికట్టాలనీ, పీడీఎస్ వ్యవస్థను బలోపేతం చేయాలనే డిమాండ్లపై ఐక్య పోరాటాలను రూపొందిస్తా మన్నారు. నయా ఉదారవాద విధానాలకు, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా సీరియస్‌గా పోరాటం చేస్తున్నదని చెప్పారు. కార్మిక, కర్షక, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ ఐదో తేదీన ఢిల్లీలో మజ్దూర్‌కిసాన్ ఏక్తా మార్చ్ నిర్వహించబోతున్నట్టు తెలిపారు.

మహాసభలో పలు తీర్మానాలకు ఆమోదం

మహాసభ పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించిందని తపన్‌సేన్ తెలిపారు. ప్రపంచ కార్మిక పోరాటాలకు సంఘీభావం, లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ, ఏప్రిల్ ఐదో తేదీన రైతు, వ్యవసాయ కార్మికులు, కార్మికుల సంయుక్త ర్యాలీ జయప్రదం, కర్నాటకలో కార్మికుల పోరాటాలకు సంఘీభావం, ఎల్‌డీఎఫ్ ప్రభుత్వంపై కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ దాడిని నిరసిస్తూ తీర్మానాలను ప్రవేశపెట్టినట్టు తెలిపారు. వీటితోపాటు పలు తీర్మానాలను కూడా ఆమోదించామని తెలిపారు.



మహాసభలకు హాజరైన తెలంగాణ ప్రతినిధులు

నవచిత్రం

ఫిబ్రవరి 4న బుట్టబొమ్మ రిలీజ్



అనిఖా సురేంద్రన్

కాస్త ఆలస్యంగా వచ్చినా ఆ ఆలస్యాన్ని మరిపించేలా వినోదాన్ని అందిస్తామని, అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించేలా 'బుట్టబొమ్మ' సినిమా ఉంటుందని చిత్ర నిర్మాతలు నమ్మకంగా చెబుతున్నారు. అయితే ఈనెల 26న విడుదల కావాల్సిన ఈ సినిమా కొంచెం ఆలస్యంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 4న విడుదల చేస్తున్నట్లు తాజాగా మేకర్స్ ప్రకటించారు. ఈ మేరకు చిత్ర బృందం అధికారికంగా ప్రచార చిత్రాన్ని కూడా విడుదల చేసింది.

ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్టైన్మెంట్స్ నిర్మిస్తున్న ఫీల్ గుడ్ రూరల్ డ్రామా 'బుట్ట బొమ్మ'. ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ భాగస్వామ్యంతో రూపొందుతున్న ఈ చిత్రానికి సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. అనిఖా సురేంద్రన్, సూర్య వశిష్ఠ, అర్జున్ దాస్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంతో శౌరి చంద్రశేఖర్ రమేష్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతిని ఇస్తుందని నటుడు అర్జున్ దాస్ చెప్పారు. ఈ సినిమా కలర్‌ఫుల్‌గా, అందరినీ ఆకట్టుకునేలా ఉంటుందని నాయిక అనిఖా సురేంద్రన్ తెలిపారు. ఎన్నో విజయవంతమైన చిత్రాలను అందించిన సితార ఎంటర్టైన్మెంట్స్ గతేడాది ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌తో కలిసి 'డీజే టిల్లు' చిత్రాన్ని నిర్మించింది. 2022 ఫిబ్రవరిలో విడుదలైన 'డీజే టిల్లు' చిన్న సినిమాగా వచ్చి సంచలన విజయాన్ని అందుకుంది. ఫిబ్రవరి 4న వస్తున్న 'బుట్టబొమ్మ' కూడా ఆ విజయాన్ని పునరావృతం చేస్తుందని చిత్ర నిర్మాతలు ఎంతో నమ్మకంగా ఉన్నారు.

ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: వంశీ పచ్చిపులుసు, సంభాషణలు: గణేష్ కుమార్ రావూరి, ఎడిటర్: నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైనర్: వివేక్ అన్నామలై.


ప్రతి రూపాయిని లెక్క పెట్టుకునే తండ్రిగా..


ఆశిష్ విద్యార్థి

నటుడు సుహాస్ నటించిన తాజా చిత్రం రైటర్ పద్మభూషణ్. నూతన దర్శకుడు షణ్ముఖ ప్రశాంత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో టీనా శిల్పరాజ్ కథానాయిక. ఛాయ్ బిస్కెట్ ఫిల్మ్స్, లహరి ఫిల్మ్స్ బ్యానర్స్ పై అనురాగ్ రెడ్డి, శరత్ చంద్ర, చంద్రు మనోహర్ నిర్మించిన ఈ చిత్రాన్ని జి. మనోహర్ సమర్పిస్తున్నారు.

ఫిబ్రవరి 3న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన ఆశిష్ విద్యార్థి మీడియాతో మాట్లాడుతూ, 'ఈ సినిమాలో పని చేయడం చాలా గర్వంగా ఉంది. మంచి హ్యూమర్ ఉన్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. ఇందులో ఒక మధ్యతరగతి తండ్రిగా తన కొడుకు ఏదో సాధిస్తాడనే ఆశ పడే పాత్ర. తనకి ఒక ఫిక్స్డ్ లైఫ్ స్టయిల్ ఉంటుంది. ప్రతి రూపాయిని లెక్కపెట్టుకునే తండ్రి. అయితే తన జీవితంలో ఏదో డిఫరెంట్‌గా జరుగుతుంది. చివర్లో ఒక అద్భుతమైన ట్విస్ట్ ఉంటుంది. సినిమా చూసిన వారు రివ్యూ ఇవ్వండి. కానీ దయచేసి ఆ ట్విస్ట్‌ని మాత్రం రివీల్ చేయొద్దు. చాలా మంచి హ్యూమర్, ఎమోషన్ ఉంటుంది. చాలా నిజాయితీగా తీసిన చిత్రమిది. సుహాస్ చాలా సహజంగా ఉంటాడు. తనకి మంచి భవిష్యత్ ఉంటుంది. నాని, సుహాస్‌లో చాలా సిమిలారిటీస్ కనిపించాయి. ఛాయ్ బిస్కెట్ సంస్థ నిర్మాతలు అనురాగ్, శరత్ చాలా క్లియర్ విజన్ ఉన్నవాళ్ళు. సినిమా అంటే వాళ్ళకి ప్యాషన్. మోడ్రన్ మైండ్ సెట్‌తో ఉంటారు. ఇక దర్శకుడు కొత్తవాడైనప్పటికీ ఈ కథను ఎంతో అద్భుతంగా తెరకెక్కించాడు' అని తెలిపారు.

స్వచ్ఛమైన ప్రేమకథ..


ఆర్యన్ గౌర, మిష్టి చక్రవర్తి

ప్రస్తుతం ఉన్న సినిమాలకు సంగీతం ఎంతగా ప్లస్ అవుతుందో అందరికీ తెలిసిందే. పాటలు బాగుంటే, సంగీతానికి మంచి ఆదరణ లభిస్తే సినిమాలు హిట్ అవుతాయని అంతా నమ్ముతుంటారు.

అలాంటి ఓ సినిమానే ఇప్పుడు ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. మహిళా దర్శక, నిర్మాతలు కలిసి చేస్తున్న చిత్రం 'ఓ సాథియా'. తన్విక జశ్విక క్రియేషన్స్ బ్యానర్ పై చందన కట్టా ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, దివ్యా భావన దర్శకత్వం వహిస్తున్నారు.

ఈ సినిమాలో ఆర్యన్ గౌర, మిష్టి చక్రవర్తి హీరో, హీరోయిన్లుగా నటిస్తున్నారు. రాజ్య సభ సభ్యుడు, లెజెండరీ రైటర్ విజయేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా ఈ సినిమా నుంచి విడుదల చేసిన ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్‌కు మంచి స్పందన లభించింది. ఇప్పుడు ఈ సినిమా నుంచి 'ఓ సాథియా' అంటూ సాగే పాటకు సంబంధించిన లిరికల్ వీడియోను అగ్ర సంగీత దర్శకుడు మణిశర్మ రిలీజ్ చేశారు. ఈ పాట అందరినీ మెప్పించేలా ఉంది. భాస్కర భట్ల సాహిత్యం, విన్ను అందించిన బాణీ, జావెద్ అలీ గాత్రం పాటను వినసొంపుగా మలిచాయి. ఇక ఈ లిరికల్ వీడియోలోని విజువల్స్ చూస్తే సినిమాను ఎంత రిచ్‌గా తీశారో అర్థమవుతుంది. ఈజే వేణు సినిమాటోగ్రఫీ సినిమాకు ప్లస్ అవుతుందని తెలుస్తోంది.

ప్యూర్ లవ్ స్టోరీగా రాబోతున్న ఈ సినిమా మీద ప్రస్తుతం మంచి బజ్ క్రియేట్ అయింది. త్వరలోనే సినిమాకు సంబంధించిన రిలీజ్ డేట్‌ను మేకర్స్ ప్రకటించనున్నారు.


మీడియా సమావేశంలో కేంద్ర క్రీడా మంత్రి అనురాగ్ ఠాకూర్, రెజ్లర్లు సాక్షి మాలిక్, అన్షు మాలిక్, బజరంగ్ పూనియా, వినేశ్ ఫోగట్, రవి దహియా

బ్రిజ్‌భూషణ్ నిష్క్రమణ

- ఆరోపణలపై విచారణకు కమిటీ
- రెజ్లింగ్ సమాఖ్యను నడపనున్న కమిటీ

ఆందోళన విరమించిన రెజ్లింగ్ క్రీడాకారులు

కుస్తీ యోధుల మూడు రోజుల ఆందోళనకు కేంద్ర ప్రభుత్వం దిగివచ్చింది. లైంగిక వేధింపులు, ఆర్థిక అవకతవకలపై ఆరోపణలు ఎదుర్కొంటున్న రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు తాత్కాలికంగా పదవి నుంచి తప్పుకున్నాడు. రెజ్లింగ్ సమాఖ్య ఆఫీస్ బేరర్లపై విచారణకు, రెజ్లింగ్ సమాఖ్య రోజువారీ పర్యవేక్షణకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఓ కమిటీని ఏర్పాటు చేసింది.

నవతెలంగాణ-న్యూఢిల్లీ

భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ పదవి నుంచి తప్పుకున్నాడు. భారత స్టార్ కుస్తీ యోధులు వినేశ్ ఫోగట్, సాక్షి మాలిక్, అన్షు మాలిక్, బజరంగ్ పూనియా, రవి దహియా, దీపక్ పూనియాలు డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడి ఆగడాలను నిరసిస్తూ న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మూడు రోజులుగా నిరసన చేపట్టిన సంగతి తెలిసిందే. ఆందోళన రోజురోజుకు తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వంలో కదలిక వచ్చింది. డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు, బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌తో మాట్లాడిన కేంద్ర క్రీడా శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్.. పదవి నుంచి వైదొలిగేలా ఎంపీని ఒప్పించారు. శుక్రవారం అర్ధరాత్రి రెజ్లింగ్ క్రీడాకారులతో కలిసి కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.

విచారణ కమిటీ ఏర్పాటు

రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని రెజ్లర్లు చేసిన మూడో రోజు ఆందోళన కీలక పరిణామాలతో ముగిసింది. రెజ్లింగ్ ఫెడరేషన్‌పై విచారణకు కమిటీ ఏర్పాటు చేయాలని రెజ్లర్లు తొలుత భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ)ను కోరారు. అత్యవసరంగా సమావేశమైన ఐఓఏ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఏడుగురు సభ్యులతో విచారణ కమిటీ నియమించింది. ఐఓఏ కమిటీలో బాక్సర్ మేరీకోమ్, రెజ్లర్ యోగేశ్వర్ దత్, ఆర్చర్ డోలా బెనర్జీలు సైతం ఉన్నారు. ఇక పరిస్థితులు చేయిదాటుతున్న క్రమంలో కేంద్ర క్రీడా శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ రంగంలోకి దిగారు. శుక్రవారం రాత్రి రెజ్లింగ్ క్రీడాకారులతో తన నివాసంలో సమావేశమైన ఠాకూర్.. అన్ని అంశాలపై చర్చించారు. రెజ్లర్ల డిమాండ్ మేరకు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ తక్షణమే పదవి నుంచి తప్పుకునేలా మంత్రి మధ్యవర్తిత్వం వహించారు. రెజ్లర్ల ఆరోపణలపై విచారణకు క్రీడామంత్రిత్వ శాఖ ఓ కమిటీని నియమించింది. కమిటీ సభ్యుల వివరాలను ఇంకా వెల్లడించాల్సి ఉంది. విచారణ కమిటీ నాలుగు వారాల్లో నివేదికను అందజేయనుంది. ఈ నాలుగు వారాల సమయంలో భారత రెజ్లింగ్ సమాఖ్య రోజువారీ వ్యవహారాలను సైతం ఈ కమిటీ పర్యవేక్షించనుంది. జూనియర్, సీనియర్ రెజ్లర్లను సహా డబ్ల్యూఎఫ్ఐ ఆఫీస్ బేరర్లు, యంత్రాంగంతో విచారణ కమిటీ సమావేశం కానుంది. 'భారత రెజ్లింగ్ సమాఖ్యపై రెజ్లర్ల ఆరోపణలపై క్రీడామంత్రిత్వ శాఖ ఇండిపెండెంట్ విచారణ కమిటీని ఏర్పాటు చేస్తుంది. కమిటీ నాలుగు వారాల్లో నివేదికను అందజేస్తుంది. ఈ సమయంలో డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్ష పదవి నుంచి బ్రిజ్‌భూషణ్ తప్పుకుంటారు. రెజ్లింగ్ ఫెడరేషన్ రోజువారీ వ్యవహారాలను కమిటీ చూసుకుంటుందని' క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ పేర్కొన్నాడు.

ముగిసిన ఆందోళన

రెజ్లింగ్ క్రీడాకారుల డిమాండ్లకు అంగీకరిస్తూ క్రీడాశాఖ కీలక నిర్ణయం తీసుకోవటంతో రెజ్లర్లు తమ నిరసన విరమించారు. 'రెజ్లర్లకు న్యాయం జరుగుతుందని క్రీడాశాఖ మంత్రి హామీ ఇచ్చారు. ఇంతటితో ఈ ఆందోళనను విరమిస్తున్నాం. రెజ్లర్లకు మద్దతుగా నిలిచిన అందరికీ ధన్యవాదాలు' అని బజరంగ్ పూనియా తెలిపాడు.



డబ్ల్యూఎఫ్ఐపై ఆరోపణలు

- శిక్షణ శిబిరంలో బ్రిజ్‌భూషణ్, జాతీయ కోచ్‌లు మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధింపులకు గురి చేశారు. బాధితుల్లో జూనియర్ రెజ్లింగ్ బాలికలు సైతం ఉన్నారు.
- నియంతృత్వ విధానాలతో రెజ్లింగ్ సమాఖ్యను నడిపిస్తున్నారు
- రెజ్లర్లను ప్రయివేటు స్పాన్సర్‌షిప్‌లకు దూరం చేస్తున్నారు
- ఫెడరేషన్ నిధులను సొంతానికి వాడుకుంటున్నారు
- నాణ్యత ప్రమాణాలు లేని శిక్షణ వ్యవస్థ
- రెజ్లర్లను ఇబ్బందులకు గురిచేసేలా షెడ్యూలింగ్
- రెజ్లింగ్ ఫెడరేషన్‌లో అధ్వాన పరిపాలన

ఆటలు

వైట్‌బాల్ ఫార్మాట్‌లో టీమ్ ఇండియా జైత్రయాత్ర కొనసాగుతోంది. తిరువనంతపురంలో శ్రీలంకపై పరుగుల పరంగా రికార్డు విజయం సాధించిన భారత్.. తాజాగా రాయ్‌పూర్‌లో బంతుల పరంగా న్యూజిలాండ్‌పై మరో రికార్డు విజయం నమోదు చేసింది. పేసర్లు, స్పిన్నర్లు కలిసికట్టుగా చెలరేగిన వేళ తొలుత న్యూజిలాండ్ 108 పరుగులకు కుప్పకూలింది. స్వల్ప లక్ష్యాన్ని భారత్ మరో 29.5 ఓవర్లు ఉండగానే ఊదిపడేసింది.

సిరీస్ సొంతమాయె

- చెలరేగిన పేసర్లు, స్పిన్నర్లు
- రెండో వన్డేలో న్యూజిలాండ్ చిత్తు
- 2-0తో సిరీస్ భారత్ వశం



నవతెలంగాణ-రాయ్‌పూర్

టీమ్ ఇండియా ఖాతాలో మరో సిరీస్ పడింది. బౌలర్లు కండ్లుచెదిరే ప్రదర్శన చేసిన వేళ రాయ్‌పూర్‌లో న్యూజిలాండ్‌పై భారత్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. పేసర్లు మహ్మద్ షమి (3/18), హార్దిక్ పాండ్య (2/16), స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ (2/7) మెరిసిన వేళ తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 34.3 ఓవర్లలో 108 పరుగులకే కుప్పకూలింది. గ్లెన్ ఫిలిప్స్ (36, 52 బంతుల్లో 5 ఫోర్లు), మైకల్ బ్రాస్‌వెల్ (22, 30 బంతుల్లో 4 ఫోర్లు), మిచెల్ శాంట్నర్ (27, 39 బంతుల్లో 3 ఫోర్లు) న్యూజిలాండ్‌కు వంద పరుగుల స్కోరు అందించారు. 109 పరుగుల ఛేదనలో భారత్ చెమట పట్టకుండా గెలుపు సాధించింది. కెప్టెన్ రోహిత్ శర్మ (51, 50 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సులు) అర్ధ సెంచరీతో రాణించగా, యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (40 నాటౌట్, 53 బంతుల్లో 6 ఫోర్లు) మెరుపు ఇన్నింగ్స్‌తో కదం తొక్కాడు. ఓపెనర్ల ధనాధన్‌తో భారత్ 20.1 ఓవర్లలోనే లాంఛనం ముగించింది. పేసర్ మహ్మద్ షమి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు సాధించాడు. మరో 179 బంతులు ఉండగానే గెలుపొందిన భారత్.. బంతుల పరంగా న్యూజిలాండ్‌పై అతిపెద్ద వన్డే విజయం నమోదు చేసింది. హైదరాబాద్, రాయ్‌పూర్ వన్డేల్లో గెలుపొందిన టీమ్ ఇండియా 2-0తో సిరీస్‌ను సొంతం చేసుకుంది. నామమాత్రపు మూడో వన్డే మంగళవారం ఇండోర్ వేదికగా జరుగనుంది.

సూపర్ షమి : హైదరాబాద్ థ్రిల్లర్‌లో భారత్ నెగ్గినా.. బౌలర్లు తేలిపోయారు. మహ్మద్ షమి, శార్దుల్ ఠాకూర్, హార్దిక్ పాండ్య, వాషింగ్టన్ సుందర్ అంచనాల మేరకు రాణించలేదు. బౌలింగ్ విభాగంలో మెరుగుదలే లక్ష్యంగా రాయ్‌పూర్‌లో భారత్ టాస్ నెగ్గినా తొలుత బౌలింగ్ ఎంచుకుంది. కెప్టెన్ సవాల్‌ను బౌలర్లు నిలబెట్టారు. ఇన్నింగ్స్ తొలి ఓవర్ నుంచే వికెట్ల వేటకు శ్రీకారం చుట్టారు. ఇన్నింగ్స్ ఐదో బంతికే ఫిన్ అలెన్ (0)ను క్లీన్‌బౌల్డ్ చేశాడు షమి. వికెట్ల వేటలో సిరాజ్ సైతం జతకలిశాడు. హెన్రీ నికోల్స్ (2)ను వెనక్కి పంపించాడు. షమి, ఠాకూర్, పాండ్యలు వరుసగా కివీస్ టాప్ ఆర్డర్‌ను వేటాడారు. డెవాన్ కాన్వే (7), డార్లీ మిచెల్ (1), టామ్ లేథమ్ (1)లు భారత పేసర్లకు దాసోహం అయ్యారు. 10.3 ఓవర్లలో 15 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది న్యూజిలాండ్. ఈ పరిస్థితుల్లో న్యూజిలాండ్ 50 పరుగులు చేసినా అద్భుతమే అనిపించింది. కానీ లోయర్ ఆర్డర్ మరోసారి కివీస్‌ను ఆదుకుంది. గ్లెన్ ఫిలిప్స్ (36), బ్రాస్‌వెల్ (22), శాంట్నర్ (27) విలువైన ఇన్నింగ్స్‌లతో న్యూజిలాండ్ స్కోరును 100 పరుగుల మార్క్‌కు తీసుకొచ్చారు. వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్ సైతం వికెట్ల వేటలో మాయజాలం చేశారు. దీంతో 34.3 ఓవర్లలో న్యూజిలాండ్ 108 పరుగులకు కుప్పకూలింది. భారత బౌలర్లలో అందరూ వికెట్ పడగొట్టడం విశేషం.

ఓపెనర్ల ధనాధన్ : 109 పరుగుల ఛేదనలో భారత్ అలవోక విజయం నమోదు చేసింది. ఓపెనర్లు రోహిత్ శర్మ (51), శుభ్‌మన్ గిల్ (40) గెలుపును సులువు చేశారు. ఆరంభంలో వికెట్లతో భారత్‌పై ఒత్తిడి పెంచాలని చూసిన న్యూజిలాండ్‌కు ఓపెనర్లు చుక్కలు చూపించారు. రోహిత్ శర్మ ఏడు ఫోర్లు, రెండు సిక్సర్లతో అర్ధ సెంచరీ సాధించాడు. తొలి వికెట్‌కు 14.2 ఓవర్లలో 72 పరుగులు జోడించిన ఓపెనర్లు విజయాన్ని లాంఛనం చేశారు. అర్ధ సెంచరీ అనంతరం రోహిత్, ఆ వెంటనే విరాట్ కోహ్లి (11) నిష్క్రమించారు. అయినా, ఎటువంటి కంగారూ లేకుండా శుభ్‌మన్ గిల్, ఇషాన్ కిషన్ (8 నాటౌట్) పని పూర్తి చేశారు. 20.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేరుకున్న భారత్ మరో 179 బంతులు మిగిలి ఉండగానే విజయం సాధించింది. బంతుల పరంగా న్యూజిలాండ్‌పై భారత్‌కు ఇది అతిపెద్ద విజయం కావటం విశేషం.

స్కోరు వివరాలు :

న్యూజిలాండ్ ఇన్నింగ్స్ : అలెన్ (బి) షమి 0, కాన్వే (సి,బి) పాండ్య 7, నికోల్స్ (సి) గిల్ (బి) సిరాజ్ 2, డార్లీ మిచెల్ (సి,బి) షమి 1, లేథమ్ (సి) గిల్ (బి) ఠాకూర్ 1, ఫిలిప్స్ (సి) సూర్య (బి) సుందర్ 36, బ్రాస్‌వెల్ (సి) కిషన్ (బి) షమి 22, శాంట్నర్ (బి) పాండ్య 27, సిప్లే నాటౌట్ 2, ఫెర్గుసన్ (సి) సూర్య (బి) సుందర్ 1, టిక్నర్ (ఎల్బీ) కుల్దీప్ 2, ఎక్స్‌ట్రాలు : 7, మొత్తం : (34.3 ఓవర్లలో ఆలౌట్) 108.

వికెట్ల పతనం : 1-0, 2-8, 3-9, 4-15, 5-15, 6-56, 7-103, 8-103, 9-105, 10-108.

బౌలింగ్ : మహ్మద్ షమి 6-1-18-3, మహ్మద్ సిరాజ్ 6-1-10-1, శార్దుల్ ఠాకూర్ 6-1-26-1, హార్దిక్ పాండ్య 6-3-16-2, కుల్దీప్ యాదవ్ 7.3-0-29-1, వాషింగ్టన్ సుందర్ 3-1-7-2.

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (ఎల్బీ) సిప్లే 51, శుభ్‌మన్ గిల్ 40 నాటౌట్, విరాట్ కోహ్లి (స్టంప్డ్) లేథమ్ (బి) శాంట్నర్ 11, ఇషాన్ కిషన్ 8 నాటౌట్, ఎక్స్‌ట్రాలు :01, మొత్తం : (20.1 ఓవర్లలో 2 వికెట్లకు) 111.

వికెట్ల పతనం : 1-72, 2-98.

బౌలింగ్ : లాకీ ఫెర్గుసన్ 5-0-21-0, హెన్రీ సిప్లే 5-0-29-1, బ్లెయిర్ టిక్నర్ 4-0-19-0, మిచెల్ శాంట్నర్ 4.1-0-28-1, మైకల్ బ్రాస్‌వెల్ 2-0-13-0.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

2013 భూసేకరణ చట్టం ప్రకారం
పరిహారమివ్వాలి

- న్యాయం జరిగే వరకు పోరాటం: సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు
- రెండో రోజు బీఎన్ తిమ్మాపురం నిర్వాసితుల మహాధర్నా



నవతెలంగాణ- భువనగిరిరూరల్

బస్వాపురం రిజర్వాయర్‌లో సర్వం కోల్పోతున్న బీఎన్ తిమ్మాపురం గ్రామ నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారమివ్వాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. వారి సమస్యలను పరిష్కరించాలని, ఆ తర్వాతే ప్రాజెక్టు పనులు చేపట్టాలని అన్నారు.

యాదాద్రిభువనగిరి కలెక్టరేట్ ఎదుట భూనిర్వాసితులు చేపట్టిన మహాధర్నా రెండో రోజు శనివారం కొనసాగింది. వారికి చెరుపల్లి మద్దతు తెలిపి మాట్లాడారు. తిమ్మాపూర్ గ్రామస్తులు బస్వాపురం ప్రాజెక్టులో భూములు, ఇండ్లు అన్నీ కోల్పోతున్నారన్నారు. తమను అన్ని విధాలా ఆదుకోవాలని 52 రోజులుగా ప్రాజెక్టు క్యాంపు కార్యాలయం దగ్గర కట్టపై దీక్షలు చేస్తుంటే ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్చలకు పిలవాలని, భూములకు పాత అవార్డును తొలగించి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, 250 గజాల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ సర్వేలో పాల్గొన్న కుటుంబంలోని ప్రతి సభ్యునికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని కోరారు.

రైతు సంఘం (సీపీఐ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ ధర్నాకు మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం, ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే బాధ్యత తీసుకొని నిర్వాసితుల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే నిర్వాసితులందరినీ కూడగట్టి ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గ్రామం నుంచి ఉపాధి కోసం వలస వెళ్లిన వారికి కూడా ఆర్అండ్ఆర్ ప్యాకేజి అమలు చేయాలని, యాదాద్రి టెంపుల్‌లో కానీ రిజర్వాయర్‌లో కానీ ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు.

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్, సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాటూరి బాలరాజు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కల్లూరి మల్లేశం, దాసరి పాండు, ఏశాల అశోక్ మాట్లాడారు. పట్టా భూములకు, ప్రభుత్వ భూములకు ఒకేసారి నష్టపరిహారం కింద డబ్బులు చెల్లించాలని, వ్యవసాయ కూలీలందరికీ 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వృత్తిదారులకు ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..: కలెక్టర్ పమేలా సత్పతి

భూనిర్వాసితుల సమస్యలు న్యాయమైనవని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ పమేలా సత్పతి హామీ ఇచ్చారు. కలెక్టర్ కార్యాలయం పరిధిలో ఉన్న సమస్యలను తక్షణం పరిష్కారం చేస్తామని, ప్రభుత్వంతో ముడిపడి ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే విధంగా బాధ్యత తీసుకుంటామని చెప్పారు.

భూనిర్వాసితుల కమిటీ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ధర్నాకు సర్పంచ్ పిన్నం లతారాజు, ఎంపీటీసీ ఉడత శారద ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ అధ్యక్షత వహించారు.

ఈ ధర్నాలో సింగిల్ విండో మాజీ చైర్మెన్ ఎడ్ల సత్తిరెడ్డి, ఉప సర్పంచ్ ఎడ్ల దర్శన్‌రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ రావులఅనురాధ నందు, మాజీ ఎంపీటీసీ జిన్న మల్లేష్, వల్లసు రాజు, కాళభైరవ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వనం రాజు, లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మామిడి వెంకటరెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గొరిగే సోములు తదితరులు పాల్గొన్నారు.

2023-24 కేంద్ర బడ్జెట్‌లో విద్య, వైద్యానికి నిధులు కేటాయించాలి

- తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో.. వరంగల్ కేయూలో సంతకాల సేకరణ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



నవతెలంగాణ-హసన్‌పర్తి

2023-24 కేంద్ర బడ్జెట్‌లో విద్యకు 10 శాతం, వైద్యానికి 6 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ శనివారం వరంగల్ జిల్లాలోని కాకతీయ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో (కో-ఎడ్యుకేషన్) తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వేదిక రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విద్యా వైద్యానికి ఐదేండ్లుగా బడ్జెట్ కేటాయింపులు తగ్గిస్తుందని, తద్వారా సామాన్య ప్రజలకు విద్య, వైద్యం అందకుండా పోతుందన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు పెట్టి విద్యార్థులపై ఫీజుల భారం పెంచుతున్నారు. కొఠారి కమిషన్ ప్రకారం కేంద్ర బడ్జెట్‌లో విద్యకు 10శాతం కేటాయించాల్సి ఉండగా.. గతేడాది 2.64 శాతం మాత్రమే కేటాయించారని తెలిపారు. వైద్యంలో పేరు గొప్ప ఊరు దిబ్బ లాగా ఆయుష్మాన్ భారత్ పథకమున్నదని, దానికి 2.1శాతం మాత్రమే నిధులు కేటాయించారన్నారు. ఈ క్రమంలో చేపట్టిన సంతకాల సేకరణ ఆదివారమూ కొనసాగుతుందని, ఈ సంతకాల పత్రాలను సోమవారం ప్రధానికి కొరియర్ ద్వారా పంపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్ కుమార్ లోధ్, డాక్టర్ గడ్డం కృష్ణ, ఆర్‌డీ ప్రసాద్, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ మధుకర్ రావు, డాక్టర్ బ్రహ్మయ్య, ఈ. రాజేశ్వరి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంఘం మహాసభ ఆహ్వాన కమిటీ ఎన్నిక

అధ్యక్షులుగా జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ-మిర్యాలగూడ

తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర 3వ మహాసభ 2023 మార్చి 1,2,3 తేదీల్లో మిర్యాలగూడలో నిర్వహించనుండగా.. దానికి ఆహ్వాన సంఘం కమిటీని ఎన్నుకున్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని ఐక్య ఉపాధ్యాయ భవన్‌లో శనివారం ధీరావత్ రవినాయక్ అధ్యక్షతన ఆహ్వాన సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆహ్వాన సంఘం అధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. గిరిజన హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర 3వ మహాసభ మిర్యాలగూడలో జరపడం శుభపరిణామమన్నారు. మహాసభ జయప్రదానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గిరిజన హక్కులను కాలరాస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమం గురించి కాకుండా మతం, కులం అంటూ ప్రజల మధ్య ఘర్షణలు పెడుతుందని విమర్శించారు. గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరాంనాయక్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని జరిగిన పోరాటాల్లో గిరిజన సంఘం అగ్రభాగాన నిలిచిందన్నారు. రాష్ట్రంలో సుదీర్ఘకాలం సాగిన గిరిజన రిజర్వేషన్ సాధన ఉద్యమంలో గిరిజన సంఘం రాజీ లేకుండా పోరాడిందన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా చేయాలని, పోడు భూములకు హక్కులు కల్పించాలని ఉద్యమాలు నిర్వహించిందని గుర్తు చేశారు. ఈ మహాసభలో 500 మంది ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. మార్చి 1న నిర్వహించే మహాప్రదర్శన, బహిరంగ సభలో పెద్దఎత్తున గిరిజనులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ఆహ్వాన కమిటీని ఎన్నుకున్నారు.

– చీఫ్ ప్యాట్రన్స్ ట్రికార్ చైర్మెన్ ఇస్లావత్ రామచందర్ నాయక్, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆర్.శ్రీరాం నాయక్, కోశాధికారిగా ఎం.రవి నాయక్, చీఫ్ కోఆర్డినేటర్‌గా ధీరావత్ రవి నాయక్, అతిథులుగా ముడావత్ ధర్మ నాయక్‌ను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముడావత్ ధర్మనాయక్, నాయ కులు భూక్య వీరభద్రం, కొర్రా శంకర్, ఎం.రవి నాయక్, అంగోత్ వెంకన్న, పాప, దేశిరం, వినోద్, బాబు, నరేష్, సైదా, జగన్ తదితరులు పాల్గొన్నారు.

నాగోబా జాతరకు కేంద్రమంత్రి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

నాగోబా జాతరకు కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్ ఆదివారం వెళ్లనున్నారు. ఉదయం 10 గంటలకు హెలికాప్టర్‌లో హైదరాబాద్ నుంచి బయల్దేరి వెళ్తారు. 11 గంటలకు కేస్లాపూర్ చేరుకొని, గిరిజన ఆరాధ్య దైవమైన నాగోబాను దర్శించుకొని, పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని బీజేపీ రాష్ట్ర శాఖ తెలిపింది. ఈ సందర్భంగా ఆ జిల్లా నేతలు అక్కడ భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడే మధ్యాహ్నం జరిగే సభలో వారు పాల్గొంటారు. సాయంత్రానికి హైదరాబాద్ తిరిగి వస్తారని తెలిపారు.

కేంద్రమంత్రుల పర్యటన

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కేంద్రమంత్రులు పర్యటించనున్నారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. పార్లమెంట్ ప్రవాస్ యోజనలో భాగంగా శనివారంవరంగల్ జిల్లాలో కేంద్ర ఈశాన్య రాష్ట్రాల అభివద్ధి శాఖ సహాయ మంత్రి బీఎల్ వర్మ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పర్యటించారని తెలిపారు. ఆది, సోమవారాల్లో మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పర్యటిస్తారు. ఈ పర్యటనలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీమతి గొట్టాల ఉమారాణి తదితరులు పాల్గొంటారని తెలిపారు. అలాగే ఈనెల 22, 23, 24 తేదీల్లో మెదక్ పార్లమెంటు పరిధిలో కేంద్ర ఫిషరీస్ పశుసంవర్ధక శాఖ సహాయ మంత్రి పురుషోత్తం రూపాల పర్యటిస్తారు. 23, 24 తేదీల్లో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో పర్యటిస్తారని ఆపార్టీ కార్యాలయ కార్యదర్శి తెలిపారు.

చట్టసభల్లో బీసీలకు 27శాతం రిజర్వేషన్లు ఇవ్వాలి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ రాజ్యాధికార సమితి కన్వీనర్ దాసు సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. మండల్ కమిషన్ సిఫార్సుల మేరకు దేశంలో బీసీలకు విద్య, ఉద్యోగ రంగాల్లో 27శాతం రిజర్వేషన్లు ఉన్నాయనీ, ఆ మేరకు కేంద్ర ప్రభుత్వం తన మంత్రివర్గంలో బీసీలకు 27 శాతం మంత్రిత్వ శాఖలను కేటాయించిందని తెలిపారు. కానీ చట్టసభల్లో బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అందే విధంగా బిల్లు ఎందుకు రూపొందించడం లేదని ప్రశ్నించారు. తక్షణం ఆ బిల్లుకు రూపకల్పన చేయాలని డిమాండ్ చేశారు.

నాగోబా దేవతకు మహా జలాభిషేకం

- అర్ధరాత్రి మహాపూజ
- హాజరైన కలెక్టర్, ఐటీడీఏ పీఓ
- గోవాడకు చేరుకున్న మెస్రం వంశీయులు
- పూజ అనంతరం కొత్త కోడళ్ల భేటింగ్



నవతెలంగాణ- ఇంద్రవెల్లి

రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద జాతరగా పేరుగాంచిన ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్‌లోని నాగోబా దేవత మహాపూజ పుష్యమాసం శనివారం అర్ధరాత్రి జరిగింది. ఈ పూజలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఐటీడీఏ పీఓ వరుణ్‌రెడ్డి, ఎమ్మెల్యే రేఖానాయక్, ఎమ్మెల్సీ దండె విఠల్, ఐటీడీఏ సలహామండలి చైర్మెన్ కనక లక్కేరావు తదితరులు పాల్గొన్నారు. మర్రిచెట్టు వద్ద బస చేసిన మెస్రం వంశీయులు గోవాడకు చేరారు. పూజారి(ఖటోడ) మెస్రం కోసు, హన్మంతు, ధర్ము ప్రధాన్‌లు దాదేరావ్, తిరుపతి, పటేల్ వెంకట్‌రావ్ ఆధ్వర్యంలో గంగాజలంతో ఆలయ ప్రవేశం చేశారు. గంగాజలం ఝూరిని ఆలయం వెనుక భద్రపరిచారు.

పుట్ట తయారీ..

నాగోబా పూజకు ఉపయోగించే కొత్త కుండలను వారి ఆచార సంప్రదాయం ప్రకారం మెస్రం వంశీయుల ఆడబిడ్డలకు పటేళ్ల ఆధ్వర్యంలో అందజేశారు. మెస్రం ఆడబిడ్డలు ముసుగు వరకు తెల్లటి వస్త్రం ధరించి వరుసలో వెళ్లి కోనేరు నుంచి తెచ్చిన నీటితో కొత్త పాము పుట్టను తయారు చేశారు. ఈ పుట్ట తయారీలో మెస్రం అల్లుళ్లకు పెద్దపీట ఉంటుంది. వీరు పాత పుట్టను తవ్వి మెత్తటి మట్టితో కొత్త పుట్టను తయారు చేశారు. మెస్రం ఆడపడుచులు నీటిని పోస్తూ పుట్ట తయారీకి సహకరించారు. ఇలా ఏడు దేవతల పేరిట ఏడు పుట్టలను తయారు చేశారు. వారి ఆచార సంప్రదాయం ప్రకారం మొక్కులు తీర్చుకున్నారు.

నాగోబాకు మహా జలాభిషేకం

కోనేరు నుంచి కొత్త కుండల్లో తెచ్చిన నీటితో ఆలయాన్ని శుద్ధి చేశారు. సంప్రదాయ వాయిద్యాలైన కాలికొమ్, పెప్రీ, డోలు వాయిస్తూ కాగడాలను వెలిగించి పూజను ఆరంభించారు. గోదావరి నది హస్తినమడుగు నుంచి తెచ్చిన గంగా జలంతో పూజారి కోసు నాగోబాకు జలాభిషేకం చేశారు. పూజ సమయంలో రాగి చెంబులో పాలు, నవధాన్యాలతో కూడిన నైవేద్యాన్ని ఉంచి దానిపై తెల్లటి వస్త్రంతో కప్పి ఉంచారు. ఈ వస్త్రం పైకి కదిలే వరకు వాయిద్యాలను వాయిస్తూనే ఉంటారు. ఈ పూజ వేళలో ఆలయంలో మెస్రం వంశీయులకు మాత్రమే అనుమతి ఉంది. రాగి చెంబుపై ఉంచిన వస్త్రం కదిలే వరకు పూజ చేశారు. వస్త్రం పైకి కదిలినప్పుడు నాగ దేవత పాలు తాగినట్టు వారి నమ్మకం. ఈ పూజ అర్ధరాత్రి వరకు కొనసాగింది. అప్పట్నుంచి నాగోబా జాతర అధికారికంగా ఆరంభమైనట్టు భావిస్తారు. ఈ జాతర ఎనిమిది రోజుల వరకు కొనసాగుతుంది.

కొత్త కోడళ్ల భేటింగ్(పరిచయం)

నాగోబా మహాపూజ అనంతరం కొత్త కోడళ్ల భేటింగ్(పరిచయం) నిర్వహించారు. మెస్రం వంశీయుల్లో పెండ్లి అయిన ప్రతి కోడలూ ఈ నాగోబా సన్నిధిలో తమ కుల పెద్దల సమక్షంలో భేటింగ్ నిర్వహించడం ఆచారం. ఇక్కడ భేటింగ్ అయిన తర్వాతనే నాగోబా దర్శనానికి అనుమతి ఉంటుంది. అంతవరకు వీరికి ఆలయ ప్రవేశం, దర్శనం నిషిద్ధం.

భూ నిర్వాసితులపై దౌర్జన్యం

- అర్ధరాత్రి వేళ గుట్టుచప్పుడు కాకుండా రైతు నాయకుల అరెస్ట్
- ఖండించిన నాయకులు



నవతెలంగాణ-మోపాల్

కాళేశ్వరంలో భాగంగా ప్యాకేజీ 21, 22 కింద నిర్మిస్తున్న మంచిప్ప రిజర్వాయర్ పనులు ఆపాలని భూ నిర్వాసితులు శుక్రవారం ఆందోళన చేపట్టగా.. పలువురు రైతు నాయకులను పోలీసులు అర్ధరాత్రి వేళ గుట్టుచప్పుడు కాకుండా అరెస్ట్ చేసి స్టేషన్‌లకు తరలించారు. కాగా శనివారం ఉదయం కోర్టుకు హాజరుపరచగా, రిమాండ్‌కు తరలించారు. అయితే భూ నిర్వాసిత కమిటీ గౌరవ అధ్యక్షులు దేవా శంకర్‌తో పాటు గంగాధర్ యాదవ్‌ను మాత్రమే అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ మహేశ్ చెబుతుండగా.. 12 మందిని అరెస్ట్ చేశారని ముంపు బాధితులు ఆరోపిస్తున్నారు. కాగా మంచిప్పతో పాటు పరిసర గ్రామాల్లో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ధర్నా చేసిన వారి ఇంటిపైన అర్ధరాత్రి సమయంలో పోలీసులు దాడికి పాల్పడ్డారని, వారి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేసినట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అరెస్ట్ చేసిన వారందరినీ వెంటనే విడుదల చేయాలని రాజకీయ పార్టీల నాయకులు, బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశ పెట్టిన పాత డిజైన్ ప్రకారమే పనులు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ ఖేత్ జిల్లా అధ్యక్షులు ముప్పగంగారెడ్డి డిమాండ్ చేశారు. బాధితులను అరెస్టు చేయడం వారి కుటుంబాలని భయభ్రాంతులకు గురిచేయడం తీవ్ర బాధాకరమని, అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని అన్నారు. ముంపు బాధితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలో రాగానే బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి, మోపాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుస్య రవి, వెంకట్ రామ్, సాంబయ్య, షేక్ గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సంక్రాంతి ఆదాయం రూ.165.46 కోట్లు

11 రోజుల్లో 2.82 కోట్ల మంది ప్రయాణం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్ఆర్టీసీకి సంక్రాంతి ఆదాయం రూ.165.46 కోట్లు వచ్చింది. 11 రోజుల్లో 2.82 కోట్ల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేశారు. గత ఏడాదికంటే ఈసారి సంక్రాంతి సీజన్‌లో రూ.62.29 కోట్లు అదనంగా ఆదాయం వచ్చినట్టు ఆర్టీసీ ఉన్నతాధికారులు తెలిపారు. అయితే గతేడాది ఆర్టీసీ టిక్కెట్ రేట్లకు, ఇప్పుడు వివిధ సెస్‌లు పేరుతో పెరిగిన టిక్కెట్ రేట్లకు మధ్య భారీ వ్యత్యాసమే ఉంది. ఈనెల 10 నుంచి 20వ తేదీ వరకు 11రోజుల్లో ఈ ఆదాయం వచ్చింది. ఒకేసారి రానూపోనూ టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకుంటే ప్రయాణీకులకు 10 శాతం రాయితీని ఈ సారి ఆర్టీసీ కల్పించింది. ఈసారి కూడా పండుగ సీజన్‌లో రోజువారీ సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సులను నడిపారు. ఈ సీజన్‌లో రికార్డు స్థాయిలో 3.57 కోట్ల కిలోమీటర్ల మేర టీఎస్ఆర్టీసీ బస్సులు తిరిగాయి. గత ఏడాదికంటే 26.60 లక్షల కిలోమీటర్లు అదనంగా తిరిగాయి. రోజుకు సగటున 2.42 లక్షల కిలోమీటర్లు అదనంగా బస్సులు నడిచాయి. ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) గతేడాది సంక్రాంతి సీజన్‌లో 59.17 శాతం ఉండగా, ఈసారి 71.19 శాతానికి పెరిగినట్టు తెలిపారు. సాధారణ చార్జీలతోనే 3923 ప్రత్యేక బస్సులను నడిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సుల్ని ఆదరించిన ప్రయాణీకులకు సంస్థ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్, మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ కృతజ్ఞతలు తెలిపారు. పక్కా ప్రణాళికతో ప్రజలకు సేవల్ని సమర్థవంతంగా అందిచగలిగామని వారు పేర్కొన్నారు. ఆర్టీసీకి సహకారాన్ని అందించిన రాష్ట్ర రవాణా, పోలీసు, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ) అధికారుల సహకారం, సమన్వయంతో ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చామనీ, వారికి కూడా కృతజ్ఞతలు తెలిపారు.

యువగళం పాదయాత్ర పాట విడుదల

ఆవిష్కరించిన టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జనవరి 27న 'యువగళం' పేరుతో చేపట్టనున్న పాదయాత్ర పాటను తెలంగాణ తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ఎన్టీఆర్ భవన్‌లో ఆవిష్కరించారు. మదనపల్లికి చెందిన తెలుగుదేశం పార్టీ యువ నాయకులు పులి స్వరూప్ ఈ పాటకు రూపకల్పన చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శులు అజ్మీరా రాజునాయక్, తాళ్లూరి జీవన్‌కుమార్, అధికార ప్రతినిధి బాలసుబ్రమణ్యం, కార్యనిర్వాహక కార్యదర్శి షకీలారెడ్డి, తెలుగురైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కసిరెడ్డి శేఖర్ రెడ్డి, తెలుగుమహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యదేవర లత, టీడీపీ నాయకులు కాసాని వీరేష్, కట్టా సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు విశేష ఆదరణ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సికింద్రాబాద్ - భువనేశ్వర్ - సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్ (17016/17015)కు ప్రయాణీకుల నుంచి విశేష ఆదరణ లభిస్తున్నదని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఈ రైలులో కోచ్ కంపోసిషన్ మార్పు చేసి, ఎల్‌హెచ్‌బి కోచ్‌లను జతచేశామన్నారు. ఈ రైలు సర్వీస్ సేవలు ఈనెల 19నుంచి అందుబాటులోకి వచ్చాయని వివరించారు. ఫిబ్రవరి నెలకు సంబంధించి ఇప్పటికే దాదాపు 60 శాతం రిజర్వేషన్ బుకింగ్ జరిగిందని చెప్పారు.

కోస్టల్ ఆంధ్ర, ఒరిస్సా వైపు ప్రయాణించే ప్రజలు ఈ రైలు ప్రయాణానికి ఎక్కువ ఆసక్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ రైలుకు పెరుగుతున్న ఆదరణపట్ల దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ సంతప్తి వ్యక్తం చేశారని ఆ సంస్థ ముఖ్య ప్రజాసంబంధాల అధికారి సీహెచ్ రాకేష్ తెలిపారు.

పేదలకు ఇండ్లు ఇవ్వాలి

- సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, బి.బిక్షమయ్య
- రామగుండం కార్పొరేషన్‌లో సీపీఐ(ఎం) పాదయాత్ర



నవతెలంగాణ - గోదావరిఖని

అర్హులైన పేదలకు వెంటనే డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, బి.బిక్షమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా రామగుండం కార్పొరేషన్‌లో శనివారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పాదయాత్ర ప్రారంభించారు. రామగుండం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో జరిగిన ప్రారంభ సభకు సీపీఐ(ఎం) పెద్దపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రామాచారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏ నినాదం వెనుక ఎవరెవరి స్వార్థ ప్రయోజనాలు దాగి ఉన్నాయో తెలుసుకోనంత కాలం ప్రజలు మోస పోతూనే ఉంటారన్నారు. వ్లాదిమిర్ లెనిన్ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయున్ని స్మరించుకొని, సీపీఐ(ఎం) బృందం పాదయాత్ర ప్రారంభించడం విప్లవ చైతన్యంతో కూడుకున్నదన్నారు. ఈ ప్రాంతంలో కనీస వేతనాల జీవోను గెజిట్ చేయించలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. ఈ పాదయాత్ర ద్వారా ప్రజల కష్ట సుఖాలను తెలుసుకుంటారన్నారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం చేసిన వాగ్దానాలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం రామగుండం ఏరియా అంబేద్కర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సీపీఐ(ఎం) పెద్దపెల్లి జిల్లా కార్యదర్శి వై.యాకయ్య, కార్యదర్శివర్గ సభ్యులు వేల్పుల కుమారస్వామి, అనుముల మహేశ్వరి, జిల్లా కమిటీ సభ్యులు లావణ్య, నామని బిక్షపతికి పూలమాలవేసి పాదయాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) ఎన్టీపీసీ రామగుండం ఏరియా కార్యదర్శి ఎం.రామాచారి, నాయకులు నాంసాని శంకర్, గిట్ల లక్ష్మారెడ్డి, తుంగ పిండి మల్లేష్, రవి, పైమద, లలిత, మెండె శ్రీనివాస్ ఎస్కే గౌస్, ఆరేపల్లి రాజమౌళి, ఇప్పలపల్లి సతీష్ కుమార్, కిషన్, రాధాకృష్ణ, రాయమల్లు, మద్దిడి ఎల్లయ్య, మార్త పోషం పాల్గొన్నారు.

ఖమ్మంలో ఐటీడీఏ ఏర్పాటు లక్ష్యంగా పోరాడాలి

తండాలో సంఘం కమిటీలు ఏర్పాటు చేయాలి : గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం ధర్మనాయక్



నవతెలంగాణ-కొణిజర్ల

హక్కుల సాధన కోసం గిరిజనులంతా ఐక్యం కావాలని, ఖమ్మంలో ఐటీడీఏ ఏర్పాటు లక్ష్యంగా పోరాడాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మూడవత్ ధర్మానాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య వీరభద్రం పిలుపునిచ్చారు. శనివారం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం లక్ష్మీపురంలో గిరిజన సంఘం తండా మహాసభలో వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గిరిజనులకు రాజ్యాంగంలో కల్పించిన హక్కులను కాలరాస్తూ పోడు భూములన్నింటిని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్ర చేస్తుందన్నారు. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా అడ్డుపడుతుందని విమర్శించారు. కేంద్రం నిధులు గిరిజనుల అభివృద్ధికి ఖర్చు చేయకుండా పక్కదారి పట్టిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి జిల్లా కేంద్రాల్లో ఐటీడీఏ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి ఇప్పటికీ అమలు చేయలేదని ఇప్పటికైనా దానిపై దృష్టిసారించాలని డిమాండ్ చేశారు.

ఫిబ్రవరి, మార్చిలో జరిగే గిరిజన సంఘం జిల్లా, రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సంఘం సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించారు. గిరిజనులందరూ సభ్యత్వం తీసుకొని సంఘం అభివృద్ధి కోసం సంఘటితం కావాలన్నారు. రైతులకు హక్కు పత్రాలు అందించాలని, నిరుద్యోగ భృతి అమలు చేయాలని, గిరిజనుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు తేజావత్ కృష్ణ కాంత్, బానోత్ హరిచంద్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులు అందరికి దళిత బంధు : మంత్రి కొప్పుల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అర్హులందరికీ దళిత బంధు పథకం అందుతుందని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి సంక్షేమ శాఖా మంత్రి కొప్పుల ఈశ్వర్ చెప్పారు. త్వరలోనే విధి విధానాల నిర్ణయం జరుగుతుందన్నారు. కొందరు కోర్టుకు వెళ్లడంతోనే అంతరాయం ఏర్పడిందని చెప్పారు. శనివారం హైదరాబాద్ లోని మంత్రుల సముదాయంలో అల్ ఇండియా షెడ్యూల్డ్ క్యాస్ట్ రైట్స్ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దళితబంధు ఓ మహాయజ్ఞంలా కొనసాగుతున్నదని చెప్పారు. అందరికి ఒకే సారి అందివ్వటం కుదరదనీ, విడతల వారీగా అందిస్తామని తెలిపారు. దీని కోసం బడ్జెట్ లో కోట్లాది రూపాయలు విడుదల చేశామన్నారు. ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేల సహకారంతో దళిత బంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ పథకం పట్ల ఎలాంటి అపోహలు నమ్మొద్దని సూచించారు. పార్టీలకతీతంగా లబ్ధి దారులను గుర్తించి పథకాన్ని వర్తింప చేస్తున్నామని చెప్పారు. దళితుల్లో ఆర్థిక సాధికారత, స్వావలంబన సాధించేందుకు దళిత బంధు పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నదని గుర్తుచేశారు. 119 నియోజవర్గాల్లో దళిత బంధు పథకం అమలు జరుగుతుందని మంత్రి వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో అలిండియా షెడ్యూల్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ జాతీయ గౌరవ అధ్యక్షులు ముత్తన్న, సెక్రటరీ జనరల్ బాలకృష్ణ, జగన్నాధం, మహిళా విభాగం అధ్యక్షురాలు శిరీష, కళ్యాణ్, సుబ్బారావు, ప్రభాకర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

బిజినెస్

విప్రోలో 450 మంది ఫ్రెషర్ల తొలగింపు



న్యూఢిల్లీ : టెక్నలాజీ కంపెనీల్లో జరుగుతున్న పరిణామాలు ఆ రంగ ఉద్యోగులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. అనేక కంపెనీలు వరుసగా ఉద్యోగులకు ఉద్వాసనలు పలకడంతో వారి భవిష్యత్తుపై బెంబేలెత్తుతున్నారు. తాజాగా ప్రముఖ ఐటి కంపెనీ విప్రో 452 మంది ఫ్రెషర్లను తొలగిస్తున్నట్లు శనివారం ప్రకటించింది. శిక్షణ తర్వాత కూడా పనితీరు మెరుగుపరుచుకోవడంలో విఫలమైనందుకు వారి పట్ల ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని వెల్లడించింది. పనితీరు విషయంలో విప్రో ఉన్నత ప్రమాణాలను పాటిస్తుందని పేర్కొంది. పని ప్రదేశంలో కొత్త ఉద్యోగులకు ఈ నియమం వర్తిస్తుందంటూ అభిప్రాయపడింది. ఇతర కంపెనీల్లో పని చేస్తూ... విప్రోలోనూ ఉద్యోగాలు చేసిన 300 మందిని గతేడాది చివరలో తొలగించింది. 2022 డిసెంబర్ త్రైమాసికంలో ఆ కంపెనీ 600 మందిని కొత్తగా తీసుకున్నట్లు పేర్కొంది. ఇంతక్రితం రోజు గూగుల్ మాతృసంస్థ అల్ఫాబెట్ ప్రపంచ వ్యాప్తంగా ఏకంగా 12,000 మంది సిబ్బందికి ఉద్వాసన పలుకుతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. రిక్రూటింగ్, కార్పొరేట్ కార్యకలాపాలు, ఇంజినీరింగ్, ప్రొడక్ట్స్ టీమ్‌కు చెందిన విభాగాలతో పాటు ఇతర విభాగాల్లో ఉద్వాసనలు పలికింది. ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ 380 ఉద్యోగులను శుక్రవారం తొలగించింది. ఇటీవల మైక్రోసాఫ్ట్ 10వేల మందిని, ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా 11,000 మందిని తొలగించగా.. ట్విట్టర్ సగం మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న అనిశ్చితి కారణంగా గడిచిన అక్టోబర్ మాసంలో ఐటి, బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ (బిపిఎం) విభాగాల్లో కొత్త నియామకాలు సగం మేర పతనమయ్యాయని ఇటీవల సిఐఇఎల్ హెచ్‌ఆర్ సర్వీసెస్ ఓ రిపోర్టులో తెలిపింది. భవిష్యత్తు సాఫ్ట్‌వేర్ తప్పనిసరి అయితే తప్పా కంపెనీలు కొత్త పెట్టుబడులకు దూరంగా ఉన్నాయి. ఉక్రెయిన్ యుద్ధ పరిణామాలకు తోడు స్టార్టప్‌లకు నిధుల కొరత తదితర అంశాలు కొత్త నియామకాలపై ప్రభావం చూపుతున్నాయని ఆ రంగం నిపుణులు పేర్కొంటున్నారు. ఉన్న ఉద్యోగాలు ఊడటానికి తోడు కొత్త నియామకాలు లేకపోవడంతో ఈ రంగంపై ఆశలు పెంచుకున్న అభ్యర్థుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది.

ఆర్థిక సాధికారత లక్ష్యాలను చేరాలి

- బ్యాంక్‌లకు ఆర్థిక శాఖ సూచన

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23)కు గాను నిర్దేశించుకున్న ఆర్థిక సాధికారిత, సామాజిక భద్రత పథకాలకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను చేరాలని బ్యాంక్‌లకు తాజాగా ఆర్థిక శాఖ సూచించింది. ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు, ఆర్థిక శాఖల ముఖ్యులతో శుక్రవారం ఆర్థిక సేవల కార్యదర్శి వివేక్ జోషి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆర్థిక పథకాలను ఇందులో సమీక్షించారు. ఆర్థిక అక్షరాస్యతపై బ్యాంక్‌లు దృష్టి సారించాలని జోషి సూచించారు.

మార్సెల్లస్ నుంచి తొలి క్వాంట్ ఆధారిత ఫండ్

ముంబయి: పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ కంపెనీ మార్సెల్లస్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ వినూత్నమైన క్వాంట్ ఆధారిత ఫండ్ మార్సెల్లస్ మెరిటార్క్యును విడుదల చేసినట్లు ప్రకటించింది. దీన్ని రిటైల్ ఇన్వెస్టర్లకు రిస్క్ సర్దుబాటు చేసిన రాబడులను అందించేలా రూపకల్పన చేసినట్లు పేర్కొంది. కనీస పెట్టుబడి రూ.10 లక్షలుగా నిర్ణయించింది. దీనిలో పెద్ద, మధ్య, చిన్న తరహా 35-45 స్టాక్స్ ఉంటాయని.. ఈ ఫండ్‌ను నిఫ్టీ 500 టిఆర్ఐకు బెంచ్‌మార్క్ చేసినట్లు పేర్కొంది. తక్కువ ప్రతికూల రిస్క్‌తో అత్యుత్తమ రాబడిని అందించడానికి ఈ ఫండ్ దోహదం చేస్తుందని తెలిపింది.

సిడ్స్ ఫార్మ్ నుంచి ఆవు నెయ్యి

హైదరాబాద్ : తెలంగాణా కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రీమియం డి2సి డెయిరీ బ్రాండ్ సిడ్స్ ఫార్మ్ కొత్తగా ఎ2 దేశీ ఆవు నెయ్యిని విడుదల చేసినట్లు ప్రకటించింది. తమ వినియోగదారుల కోసం భారత గణతంత్ర్య దినోత్సవ వేళ దీన్ని అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. సిడ్స్ ఫార్మ్ గత ఆగస్టులో ఎ2 దేశీ ఆవు పాలు విడుదల చేసింది. ఈ స్ఫూర్తితో ఎ2 దేశి ఆవు నెయ్యిని అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. 350 గ్రాముల ధరను రూ.999గా నిర్ణయించినట్లు తెలిపింది.

ట్రూపాల్లో ఇస్నాపూర్ ప్లాంట్ ప్రారంభం



బెంగళూర్ : ప్లాస్టిక్ పైపులు, ఫిట్టింగ్స్ బ్రాండ్ ట్రూపాల్లో బై హిందవేర్ తమ విస్తరణ ప్రణాళికలను ప్రకటించింది. దీనిలో భాగంగా పిటిఎంసి ఫౌసెట్స్, ఫ్లష్ ట్యాంకులు, సీట్ కవరింగ్స్, ఇతర యాక్ససరీలతో కూడిన బాత్ ఫిటింగ్స్ విభాగంలో ప్రవేశిస్తున్నట్లు వెల్లడించింది. పిటిఎంటి ఫౌసెట్స్ కోసం 14 డిజైన్ వేరియంట్లను, 6 ఫ్లష్ ట్యాంక్ వేరియంట్లను విడుదల చేయడం ద్వారా విభిన్నమైన వినియోగదారుల అవసరాలను తీర్చనున్నట్లు ఆ సంస్థ పేర్కొంది. హైదరాబాద్‌లోని ఇస్నాపూర్ వద్ద ఉన్న తమ రెండవ తయారీ కేంద్రంలో వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించినట్లు పేర్కొంది. ఈ సదుపాయంతో వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 30వేల టన్నుల నుంచి 48 వేల టన్నులకు పెరగనుందని ట్రూపాల్లో బై హిందవేర్ లిమిటెడ్ సిఇఒ రాజేష్ పజ్నూ పేర్కొన్నారు.

హైదరాబాద్‌లో తగ్గిన గృహ అమ్మకాలు

- నైట్ ఫ్రాంక్ ఇండియా

హైదరాబాద్: గతేడాది హైదరాబాద్‌లో 68,519 యూనిట్ల నివాసాల విక్రయాలు జరిగాయని నైట్ ఫ్రాంక్ ఇండియా వెల్లడించింది. వీటి విలువ రూ.33,605 కోట్లుగా ఉందని పేర్కొంది. ఇంతక్రితం ఏడాది ఇదే కాలానికి రిజిష్టర్ అయిన 83,959 రెసిడెన్షియల్ యూనిట్ల మొత్తం విలువ రూ.37,232 కోట్లుగా నమోదయ్యింది. దీంతో పోల్చితే యూనిట్లు, విలువ పరంగా గతేడాది తగ్గుదల చోటు చేసుకుంది.

హైదరాబాద్ రెసిడెన్షియల్ మార్కెట్‌లో హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలను పరిగణలోకి తీసుకుంది. 2022 డిసెంబర్‌లో రిజిష్టర్ అయిన మొత్తం ఇళ్లలో 54 శాతం రూ.25-50 లక్షల ధర శ్రేణిలో ఉన్నాయని తెలిపింది. అధిక టికెట్ సైజ్ ఇళ్లకు డిమాండ్ అధికంగా ఉందని పేర్కొంది. రూ.50 లక్షలు, అంతకు మించి విలువైన ఇళ్ల వాటా 2021 డిసెంబర్‌లో 24 శాతంగా ఉండగా.. 2022 డిసెంబర్‌లో అది 29 శాతానికి పెరిగింది.

60 శాతం మందిలో నిద్ర లేమీ

హైదరాబాద్: దేశంలో 60 శాతం మంది నిద్ర లేమీతో బాధపడుతున్నారని జిక్వాయిల్ ఇండియా సర్వేలో వెల్లడయ్యిందని పిఅండ్‌జి హెల్త్ సీనియర్ మార్కెటింగ్ డైరెక్టర్ సాహిల్ సేథి తెలిపారు. కేవలం 15 శాతం మంది మాత్రమే సగటు ఉత్తమ నిద్ర పోతున్నారన్నారు. ఉత్తమ నిద్ర కోసం జీవన శైలీ మారాల్సిన అవసరం ఉందన్నారు. నిద్ర లేమితో భాదపడే వారి కోసం పిఅండ్‌జి కొత్తగా విక్స్ జిక్వాయిల్ న్యాచురాను ఆవిష్కరించిందన్నారు. పడుకునే ముందు ఈ చ్యూయబుల్ గమ్మీస్‌ను తీసుకోవడం ద్వారా నిద్రకు సహాయపడుతుందన్నారు. 10 చ్యూయబుల్ గమ్మీస్ ధరను రూ.199గా నిర్ణయించామన్నారు.

2022లో 170 కోట్ల ఉత్పత్తుల రవాణ : ఉడాన్

బెంగళూరు : అతిపెద్ద బి2బి ఇ-కామర్స్ సంస్థ ఉడాన్ 2022 సంవత్సరంలో 1200 నగరాల వ్యాప్తంగా 170 కోట్ల ఉత్పత్తులను రవాణా చేసినట్లు ప్రకటించింది. అదే సమయంలో ఉడాన్‌పై 586 మంది విక్రేతలు ఒక కోటి రూపాయలకు పైగా వ్యాపార లావాదేవీలను నిర్వహించారని పేర్కొంది. 7 కోట్ల ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, 3 కోట్ల పైగా ఉత్పత్తులను లైఫ్‌స్టైల్ జనరల్ మర్చండైజ్ విభాగాలలో నిర్వహించడంతో పాటుగా 9 లక్షల టన్నుల నిత్యావసరాలు, 1.5 లక్షల టన్నుల ఎఫ్‌ఎంసిజి ఉత్పత్తులను ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా విక్రయించినట్లు తెలిపింది. ఉడాన్ ప్లాట్‌ఫామ్‌పై 25 శాతం మంది రిటైలర్లు డిజిటల్ చెల్లింపులను జరిపారని పేర్కొంది.

సజావుగా వానాకాలం ధాన్యం కొనుగోళ్లు పూర్తి

- రూ.13,750 కోట్ల విలువ గల 64.30 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ: మంత్రి గంగుల కమలాకర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వానాకాలం ధాన్యం కొనుగోళ్లు సజావుగా పూర్తి చేశామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. 7,024 కేంద్రాల ద్వారా రికార్డు స్థాయిలో రూ.13,750 కోట్ల విలువ గల 64.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్టు చెప్పారు. శనివారం హైదరాబాద్‌లో ఉన్నతాధికారులుతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 21న ప్రారంభమైన వానాకాలం పంట సేకరణ మూడు నెల్లకుపైగా 94 రోజులు పాటు కొనసాగిన ఈ ప్రక్రియలో 9 లక్షల 76 వేల మంది రైతుల నుండి సేకరించి,. ఓపీఎంఎస్‌లో నమోదైన రూ.12,700 కోట్లను చెల్లించామని వివరించారు.

మిగతావారికి సైతం వారం రోజుల్లోనే డబ్బులు అందజేస్తామని స్పష్టం చేశారు. 16 కోట్ల గన్నీ బ్యాగులు ఉపయోగించా మనీ, మరో ఐదున్నర కోట్ల బ్యాగులు అదనంగా అందుబాటులోకి ఉంచామని గంగుల తెలిపారు. వానాకాలంలో లేటుగా నాట్లేసిన వారి కోసం ఈ నెల 24 వరకు ధాన్యాన్ని అమ్ముకునే వెసులుబాటు కల్పించామని చెప్పారు. ఈ వానాకాలంలో నిజమాబాద్‌లో అత్యధికంగా 5.86 లక్షల మెట్రిక్ టన్నులు, అత్యల్పంగా ఆదిలాబాద్ లో 2,264 మెట్రిక్ టన్నులు సేకరించినట్టు మంత్రి ప్రకటిం చారు. ఈ ధాన్యం సీఎంఆర్ ప్రక్రియ సైతం వేగంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రికార్డు స్థాయిలో ధాన్యం సేకరణకు సహకరించిన రైతులు, హమాలీలు, ప్యాక్స్, ఐకేపీ యంత్రాంగం, సివిల్ సప్లైస్ అధికారులకు మంత్రి అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ వి.అనిల్ కుమార్, జాయింట్ కమిషనర్ ఉషారాణి, పౌరసరఫరాల సంస్థ జీఎం రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీపీఎస్‌తో ఉద్యోగులకు సామాజిక భద్రత కరువు

- కేరళలో ఎన్ఎంఓపీఎస్ సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ

నవతెలంగాణ - కేరళ

కేరళలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) రద్దు ఉద్యమం ప్రారంభమైంది. నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం (ఎన్ఎంఓపీఎస్) ఆధ్వర్యంలో శనివారం కేరళ రాజధాని త్రివేంద్రంలో ఉన్న సచివాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎంఓపీఎస్ సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల్లో సీపీఎస్ రద్దు కావడంలో ఎన్ఎంఓపీఎస్ ప్రముఖ పాత్ర పోషించిందని చెప్పారు. 1952లో అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో) 102వ కన్వెన్షన్‌లో పెన్షన్ ఉద్యోగి నెలవారీ జీతంలో కనీసం 50 శాతం ఉండాలని తీర్మానించిందని అన్నారు. కార్పొరేట్లకు కొమ్ముకాసే సీపీఎస్ పథకాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ పునరుద్ధరించే రాష్ట్రాల పట్ల రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. సీపీఎస్ అమలు తర్వాత రిటైరైనా లేదంటే మరణించిన ఉద్యోగి కుటుంబానికి అందిన ప్రయోజనాలు శూన్యమని విమర్శించారు. సీపీఎస్ ఉద్యోగులకు సామాజిక భద్రత కరువైందన్నారు. కేరళ ప్రతినిధి షాహిద్ రఫిక్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కర్నాటక నుంచి రంగనాథ్, తెలంగాణ నుంచి సీపీఎస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, రాష్ట్ర కోశాధికారి నరేష్ గౌడ్, తమిళనాడు నుంచి ఆరోగ్య దాస్ తదితరులు హాజరయ్యారు.

విద్యలో మతమౌఢ్యం

- కార్పొరేటీకరణతో దేశాన్ని భ్రష్టుపట్టిస్తున్న మోడీ
- పీడీఎస్‌యూ పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో వక్తలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నూతన విద్యావిధానం -2020 పేరుతో మతమౌఢ్యాన్ని ప్రవేశ పెట్టేందుకు మోడీ సర్కార్ కుట్ర చేస్తున్నదని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పీడీఎస్‌యూ పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 'వర్తమాన రాజకీయాలు- ప్రగతిశీల శక్తుల కర్తవ్యాలు' అనే అంశంపై కేంద్రీ య విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ ప్రధానోపన్యాసం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలు చదువుకునే విద్యా సంస్థలను అభివృద్ధి చేయకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని చెప్పారు. బడ్జెట్‌లో నిధులు తగ్గించటమే దీనికి నిదర్శనమన్నారు. 1966లో నియమించిన డాక్టర్ కొఠారి కమిషన్ సూచించిన విధంగా కేంద్ర బడ్జెట్ లో 10శాతం , రాష్ట్ర బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించాలని సూచిస్తే... ఏనాడూ ఈ ప్రభుత్వాలు పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 30శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా 6శాతం మాత్రమే కేటాయిస్తుందని చెప్పారు. పైకి మాత్రం కేజీ టు పీజీ ఉచిత విద్య అందిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం నంగనాచి మాటలు మాట్లాడుతున్నదని విమర్శించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విద్యా రంగాన్ని పూర్తిగా కాషాయీకరణ, కార్పొరేటీకరణ విధానాలను ప్రవేశ పెట్టడానికి ప్రయత్నిస్తున్నదని చెప్పారు.మరో పక్క దేశంలో మనువాదాన్ని పెంచి పోషించేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్ గురువారెడ్డి, డాక్టర్ కొండా నాగేశ్వర్, ధనుంజయ్, గీతా రామస్వామి, ప్రొఫెసర్ లక్ష్మీ ఈ సభకు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. పీడీఎస్‌యూ మొదటి రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్ రావు, డాక్టర్ రంగారెడ్డి, మాజీ నేతలు సత్యనారాయణ, మేరెడ్డి శ్యామ్ ప్రసాద్ రెడ్డి, అనిశెట్టి శంకర్, బూర్గుల ప్రదీప్, గొర్రెపాటి మాధవరావు వి. శంకర్, పి. ప్రసాద్, సాదినేని వెంకటేశ్వర్లు, అమర్, పోటు రంగారావులు మాట్లాడారు. పీడీఎస్‌యూ అధ్యక్షులు పరశ రాములు, మహేష్, ప్రధాన కార్యదర్శి అజాద్, విజృంభణ ప్రధాన కార్యదర్శి అల్లూరి విజయ్‌లు మాట్లాడారు. సభలో అరుణోదయ సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు విమలక్క, నాగన్న, కృష్ణ, వేణు పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరపాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ)లో అంజలి అనే విద్యార్థి ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. హర్యానా నుంచి వచ్చి చదువుకుంటున్న ఆమె మరణం పట్ల సంతాపం తెలిపారు. అంజలి మరణంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. విద్యార్థుల భద్రత పట్ల కనీసం సెక్యూరిటీ లేకుండా యూనివర్శిటీ యాజమాన్యం వ్యవరించడం సరైంది కాదనీ, ఆమె మరణంపై విచారణ జరిపి నిజానిజాలను నిగ్గుతేల్చాలని కోరారు.

చంపారన్ పోరాట స్ఫూర్తితో... ఉద్యమాలకు సిద్ధం కావాలి

ఏఐఏడబ్ల్యూయూ జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్



న్యూఢిల్లీ: నాడు బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గ్రామీణ పేదల, రైతాంగ సత్యాగ్రహ ఉద్యమాలు చంపారన్ ప్రాంతంలో ప్రజల్ని కదనరంగంలోకి తీసుకొచ్చాయనీ, ఆ స్ఫూర్తితో నేడు రైతులు, గ్రామీణ పేదలు కార్పొరేట్లకు, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూ యూ) ప్రధాన కార్యదర్శి బి వెంకట్ పిలుపు నిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం బీహార్ రాష్ట్ర మహాసభ సందర్భంగా శనివారం పశ్చిమ చంపారన్ ప్రాంతమైన భేత్యలో భారీ బహిరంగ సభ జరిగింది. ఈ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకట్ మాట్లాడుతూ బ్రిటిష్ ప్రభుత్వం వ్యవసాయాన్ని కబళించే చర్యలను అడ్డుకునేందుకు1917లో పశ్చిమ చంపారన్ కేంద్రంగా గ్రామీణ రైతాంగాన్ని, పేదలని కదిలించి గాంధీజీ సత్యాగ్రహాన్ని చేపట్టారని ఆ పోరాటం స్వాతంత్ర ఉద్యమంలో ఒక చారిత్రక ఘట్టంగా నిలిచిందని తెలిపారు. నాటి స్ఫూర్తితో నేడు గ్రామీణ ప్రాంతాల్లో పేదలు వ్యవసాయ రంగ రక్షణ కోసం ఉద్యమించాలని అని పిలుపు నిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో సంపద సృష్టిస్తున్న శ్రమజీవులకు ఆ సంపద దక్కేందుకు ఉద్యమించాలని అన్నారు. నాటి గాంధీ పోరాటం బ్రిటిష్ వ్యతిరేకంగా జరిగితే నేడు కార్పొరేట్లకు, అసమానతలకు వ్యతిరేకంగా జరగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సభలో రాజ్యసభ ఎంపీ వి. శివదాసన్, వ్యవసాయ కార్మిక సంఘం బీహార్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దేవేంద్ర, బోలా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దశలవారీ ఉద్యమం

- ఆర్‌యూపీపీటీఎస్ అధ్యక్షుడు జగదీశ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని భాషాపండితులకు న్యాయం చేయాలని కోరుతూ దశలవారీగా ఉద్యమం చేపడతామని ఆర్‌యూపీపీటీఎస్ అధ్యక్షుడు సి జగదీశ్ ప్రకటించారు. శనివారం హైదరాబాద్‌లో పండిత జేఏసీ నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం అన్ని జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు సమర్పించాలని చెప్పారు. సోమవారం అన్ని జిల్లాల్లో కలెక్టర్లు, డీఈవోలకు వినతిపత్రాలు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో విడుదల చేసే ఉపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూల్‌కు ముందే పండితుల పదోన్నతులపై ఉన్న స్టేను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోర్టు తుది తీర్పునకు లోబడి భాషాపండితులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌యూపీపీటీఎస్ ప్రధాన కార్యదర్శి ఎస్ నర్సిములు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఇజ్రాయెల్ పాల్గొన్నారు.

ఒకే స్కూల్లో ఐదేండ్లు పనిచేసిన హెచ్ఎంలను బదిలీ చేయాలి

- టీఎస్‌జీహెచ్ఎంఏ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రధానోపాధ్యాయుల (హెచ్ఎం) బదిలీ గరిష్ట కాలపరిమితి ఐదేండ్లు కొనసాగించాలని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ హెడ్మాస్టర్ల సంఘం (టీఎస్‌జీహెచ్ఎంఏ) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్షులు పి రాజభాను చంద్రప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఆర్ రాజగంగారెడ్డి, కోశాధికారి బి తుకారం శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు ఒకే పాఠశాలలో ఉండే గరిష్ట కాలపరిమితి ఐదేండ్లకు బదులుగా ఎనిమిదేండ్లు ఉండేలా ప్రభుత్వం నిర్ణయించడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల దూర ప్రాంతాల నుంచి దగ్గరి ప్రాంతాలకు బదిలీ కోరుకునే వారికి అవకాశాలు సన్నగిల్లాయని తెలిపారు. మారుమూల ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాల దగ్గరికి బదిలీ కోరుకునే హెచ్ఎంల ఆశలు నీరుగారిపోతాయని పేర్కొన్నారు. మెజార్టీ ప్రధానోపాధ్యాయుల్లో బదిలీలపై నిరాశ, నిస్పృహలు ఏర్పడతాయని వివరించారు. అందరికీ మంచి అవకాశాలు కల్పించాలనే అంశానికి విఘాతం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పాత పద్ధతిలో ఉన్నట్టుగానే ఒకే పాఠశాలలో ఐదేండ్ల సర్వీసు నిండిన హెచ్ఎంలను బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.

ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లు ఇప్పించండి

- డాక్టర్ ఎర్రోళ్లకు నర్సుల వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పని చేసిన కాలానికి ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లు ఇప్పించాలని పలువురు నర్సులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ నర్సింగ్ సమితి (టీఎన్ఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు కె.గోవర్ధన్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్ర వైద్య మౌలిక సదుపాయాల సంస్థ చైర్మెన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 5,204 నర్సుల పోస్టులను భర్తీ చేస్తున్నట్టు నోటిఫికేషన్ విడుదల చేసింది. అందులో ప్రభుత్వ వ్యవస్థలో పని చేసిన నర్సులకు అత్యధికంగా 20 మార్కుల వెయిటేజీ కల్పించారు. ఈ వెయిటేజీకి అర్హత పొందేందుకు వీలుగా ఉస్మానియా ఆస్పత్రిలో పని చేసిన నర్సులు సర్టిఫికెట్ల కోసం వెళితే అక్కడి మెడికల్ సూపరింటెండెంట్ తమకు సంబంధం లేదని వెనక్కి పంపించారు. ఇదే విషయంపై రాష్ట్ర వైద్యవిద్య సంచాలకులు (డీఎంఈ)ని కలిసేందుకు ప్రయత్నించినప్పటికీ ఆయన అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము కరోనా ఫస్ట్ వేవ్ సమయంలో అంటే 2020 ఏప్రిల్ 28న ఉస్మానియా హాస్పిటల్‌లో స్టాఫ్ నర్సులుగా అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమితులమై, 2021 జూన్ 7 వరకు విధులు నిర్వహించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ, ఉస్మానియాతో పాటు గాంధీ, నిలోఫర్ ఇతర ఏ ఆస్పత్రిలోనైనా సరే... అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేసిన నర్సులకు వెంటనే ఎక్స్ పీరియన్స్ సర్టిఫికెట్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పాకిస్తాన్‌లో నాలుగేళ్ళలో 42మంది జర్నలిస్టులు హత్య

- సెనెట్‌కు తెలియచేసిన మంత్రి

ఇస్లామాబాద్ : గత నాలుగేళ్లలో పాకిస్తాన్‌లో 42మంది జర్నలిస్టులు హత్యకు గురయ్యారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ముర్తజా జావేద్ అబ్బాసి శుక్రవారం సెనెట్‌కు తెలియచేశారు. వీరిలో 15మంది జర్నలిస్టులు పంజాబ్, 11మంది సింధ్, 13మంది ఖైబర్ ఫక్తూన్‌ఖవా, ముగ్గురు బెలూచిస్తాన్‌లకు చెందినవారు. ఈ కేసుల్లో జర్నలిస్టులను కాల్చి చంపడం, లక్ష్యంగా చేసుకోవడం, తీవ్రవాదులు హతమార్చడం, ఆచూకీ తెలియకుండా పోవడం వంటివి వున్నాయి. పంజాబ్‌లో ఏడుగురు అనుమానితులను అరెస్టు చేయగా, వారిలో ఇద్దరు బెయిల్‌పై వున్నారు. ఐదుగురిపై విచారణ జరుగుతోంది, మరో 8మంది అనుమానితులు పారిపోయారని, ఒక నిందితుడిని కోర్టు విడుదల చేసిందని సమాచార మంత్రిత్వ శాఖ డేటా పేర్కొంది. అలాగే సింధ్ ప్రావిన్స్‌లో నలుగురు అనుమానితులను అరెస్టు చేయగా, ఏడుగురు విచారణను ఎదుర్కొంటున్నారు. కెపి ప్రావిన్స్‌లో ఇద్దరిని వదిలిపెట్టగా, నలుగురు విచారణ ఎదుర్కొంటున్నారు. జమాత్ ఇస్లామీకి చెందిన ఎంపి ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ ఫెడరల్, ప్రావిన్షియల్ ప్రభుత్వాలు జర్నలిస్టులకు రక్షణ కల్పించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. మంత్రి అబ్బాసి స్పందిస్తూ, రెండు మాసాల్లోగా మొత్తంగా ఈ విషయంపై సమగ్ర నివేదిక రూపొందించి, సెనెట్‌కు అందచేయాల్సిందిగా హోం, సమాచార మంత్రిత్వశాఖలను ఆదేశించారు.

చిన్నతనం నుండే సాహిత్యంపై మక్కువ పెంచుకోవాలి

- బడి పుస్తకాలతో పాటు.. ఇతర సాహిత్యమూ చదవాలి
- జాతీయ స్థాయి బాలోత్సవ్ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రమేష్ బాబు



నవతెలంగాణ-కొత్తగూడెం

చిన్నతనం నుంచే విద్యార్థులు సాహిత్యం పట్ల మక్కువ పెంచుకుంటే ఎంతో ఎత్తుకు ఎదుగుతారని, బడి పుస్తకాలతో పాటు ఇతర సాహితీవేత్తల సాహిత్య పుస్తకాలనూ చదవాల్సిన అవసరం ఉందని, ఓడి గెలిచినవారు చరిత్రలో ఎంతోమంది ఉన్నారని జాతీయ స్థాయి బాలోత్సవ్ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రమేష్ బాబు అన్నారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం క్లబ్‌లో రెండు రోజులపాటు నిర్వహించనున్న "కథ, కవిత" కార్యశాల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుల ఒత్తిడి కారణంగా అనేక మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. అంతరించిపోతున్న సాహిత్య విలువలు మీలో సాహితీ అంకురమై మొలకెత్తి కవులుగా ఎదగాలని ఆకాంక్షించారు. సమాజ మార్పుకు పాటు పడాలని కోరారు. రెండు రోజుల పాటు జరిగే కథా-కవితా కార్యశాలలో ఇష్టమైన సాహిత్యాన్ని ప్రఖ్యాత రచయితల ద్వారా తెలుసుకొని మెళకువలు తెలుసుకొని సాహితీ రంగంలో రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ బాబు అమృతోత్సవాల జన్మదినోత్సవం సందర్భంగా ఆయన్ను పలువురు మెమోంటోతో సత్కరించారు. 25 ఏండ్ల పాటు బాలోత్సవ్ కార్యక్రమాలు నిర్వహించి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారని, కొత్తగూడెం బాలోత్సవ్ స్ఫూర్తితో ఆంధ్ర ప్రదేశ్‌లోనూ సుమారు 50 ప్రాంతాల్లో బాలోత్సవ్‌లు నిర్వహిస్తున్నారని, తెలంగాణలోకూడా జరుగుతున్న తీరును ఈ సందర్భంగా పలువులు వక్తలు గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రఖ్యాత రచయితలు చందు, మండవ సుబ్బారావు, శీరంశెట్టి కాంతారావు, అనీల్ డ్యాని, మధు, తులసీ, కటుకొజ్వల రమేష్, సాగర్, రవికుమార్, మహర్షి, పుప్పాల కృష్ణమూర్తి, నాగరాజ శేఖర్, సైదులు, భగవంతం, పిట్టల మల్సూర్, ప్రముఖ కవులు, సాహితీ వేత్తలు పాల్గొన్నారు.

న్యూజిలాండ్ ప్రధానిగా క్రిస్ హిప్‌కిన్స్

వెల్లింగ్టన్ : న్యూజిలాండ్ దేశ కొత్త ప్రధానమంత్రిగా క్రిస్ హిప్‌కిన్స్ ఎన్నిక దాదాపు ఖరారైంది. ప్రస్తుత ప్రధాని జెసిండా ఆర్డెన్స్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికార లేబర్ పార్టీ నాయకుడిని ఎన్నుకునే ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో భాగంగా పార్టీకి చెందిన ఎంపీ, మాజీ మంత్రి హిప్‌కిన్స్ మాత్రమే నామినేషన్ దాఖలు చేశారు. ఆయన నామినేషన్‌కు ఆదివారం జరిగే సమావేశంలో పార్టీ ఎంపీలు మద్దతు తెలియచేయాల్సి వుంది. అయితే బరిలో ఎవరూ లేకపోవడం, కేవలం ఒకే ఒక నామినేషన్ రావడంతో తదుపరి ప్రధానిగా 44 ఏళ్ళ హిప్‌కిన్స్ ఎన్నికైనట్లు లేబర్ పార్టీ ప్రకటించింది. దీంతో ఆయన దేశ 41వ ప్రధానిగా త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

నేను ఎవరికీ అనుకూలం కాదు...వ్యతిరేకం కాదు

అటువంటి ఆలోచన చేయొద్దు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'నేను ఎవరికీ అనుకూలం కాదు...వ్యతిరేకం కాదు. అలాంటి ఆలోచన ఉంటే పక్కన పెట్టండి. అధిష్టానం చెప్పింది చేయడమే నా విధి' అని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే పార్టీ నేతలకు స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత్ జోడో యాత్ర మాదిరిగానే తెలంగాణలో రెండు నెలల పాటు చేపట్టనున్న 'హాత్ సే హాత్' అభియాన్ జోడో కార్యక్రమాన్ని గడప గడపకూ తీసుకువెళ్లాలని సూచించారు. 'ఎముకలు కొరికే చలిలో రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్ర చేశారు. యాత్ర లక్ష్యాలను ఇంటింటికీ తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉంది. నేతలంతా ఐక్యంగా హాత్ సే హాత్ జోడో యాత్ర చేయండి. టీపీసీసీ అధ్యక్షులు, ఎనుముల రేవంత్‌రెడ్డి 50 నియోజకవర్గాలకు తగ్గకుండా యాత్ర చేస్తారు. మిగిలిన సీనియర్లు కూడా 20, 30 నియోజకవర్గాల్లో యాత్ర చేయాలి. వచ్చే ఎన్నికలను దష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ యాత్రను విజయవంతం చేయాలి. అంతా ఐక్యంగా పని చేస్తే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడం, అధికారంలోకి రావడం ఖాయం. సమస్యలు ఉంటే చెప్పండి. నాకు ఫోన్ చేయండి. ఎప్పుడూ అందుబాటులోనే ఉంటా. పార్టీకి నష్టం చేసేలా ఎవరూ మీడియా ముందు మాట్లాడొద్దు' అని ఠాక్రే పార్టీ నేతలకు సూచించారు.

ఫిబ్రవరి 6 నుంచి పాదయాత్ర : రేవంత్‌రెడ్డి

రాష్ట్రంలో వచ్చే నెల 6 నుంచి రెండు నెలల పాటు హాత్ సే హాత్ జోడో యాత్ర కొనసాగుతుందని టీపీసీసీ అధ్యక్షులు, ఎనుముల రేవంత్‌రెడ్డి తెలిపారు. యాత్రలో ప్రియాంకగాంధీ లేదా సోనియాగాంధీ ఒక రోజు పాల్గొనేలా సమావేశంలో తీర్మానించినట్టు చెప్పారు. ఈనెల 26న భద్రాచలం నుంచి లాంఛనంగా యాత్రను ప్రారంభించనున్నట్టు రేవంత్ వివరించారు. మూడు సార్లు సమావేశానికి రానివారి నుంచి వివరణ తీసుకుంటామనీ, కీలక సమావేశానికి హాజరుకాని వారిని పార్టీ నుంచి తొలగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీనియర్ నేత నాగం జనార్ధన్‌రెడ్డిపై అధికార పార్టీ నేతలు అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని విమర్శించారు. అక్రమ కేసులపై డీజీపీకి ఫిర్యాదు చేశామని తెలిపారు. నాగర్ కర్నూల్‌లో దళిత, గిరిజన ఆత్మగౌరవ సభ నిర్వహిస్తామని వెల్లడించారు.

విచ్ఛినకర శక్తుల నుంచి దేశాన్ని రక్షిస్తాం : విక్రమార్క

విచ్ఛిన్నకర శక్తుల నుంచి దేశాన్ని కాపాడటం కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు వాన, చలిని లెక్క చేయకుండా భారత్ జోడో యాత్ర చేస్తున్నారని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఈనెల 30న భారత్ జోడో యాత్ర ముగింపు సందర్భంగా శ్రీనగర్‌లో భారీ బహిరంగసభను నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా ఏఐసీసీ ఆదేశాల మేరకు ఈ నెల 26 నుంచి రెండు నెలల పాటు దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర జరుగుతుందన్నారు. ప్రజాస్వామిక, లౌకిక వాదులు కాంగ్రెస్ చేసే ప్రయత్నంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

తుది శ్వాస వరకు పోరాడుతా

- వారివి అబద్ధాలు:'నకిలీ స్టింగ్' ఆరోపణలపై స్వాతి మలివాల్

న్యూఢిల్లీ : తనపై వచ్చిన 'నకిలీ స్టింగ్' ఆరోపణలపై ఢిల్లీ మహిళ కమిషన్ (డీసీడబ్ల్యూ) చీఫ్ స్వాతి మలివాల్ స్పందించారు. ఈ ఆరోపణలు 'అబద్దాలు' అని, తన తుది శ్వాస వరకు పోరాడుతూనే ఉంటానని ఆమె స్పష్టం చేశారు. దేశరాజధాని ఢిల్లీలో గురువారం ఉదయం 3 గంటలకు తాగిన మైకంలో ఉన్న ఒక క్యాబ్ డ్రైవర్ తనను వేధించాడనీ, కారు కిటికీలో తన చేయి ఉండగానే లాక్కొని వెళ్లాడని స్వాతి మలివాల్ ఆరోపణలు చేసిన విషయం విదితమే. అయితే, ఢిల్లీలో భద్రతపై స్వాతి మలివాల్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ నాయకులు ఆరోపణలు చేశారు. ఢిల్లీ పోలీసులు అప్రమత్తంగా లేరనే విధంగా జరిగిన కుట్రే ఈ తతంగమని స్వాతి మలివాల్ స్టింగ్ ఆపరేషన్‌ను ప్రశ్నించారు. ఇలాంటి ఆరోపణలపై ఆమె స్పందించారు. "నా గురించి మురికి అబద్దాలతో వారు నన్ను భయపెట్టొచ్చు. చిన్న జీవితంలోనే నేను చాలా పెద్ద పనులు చేశాను. నాపై అనేక సార్లు దాడులు జరిగాయి కానీ నేను ఆపలేదు. ప్రతీ దాడితో నాలో ఉన్న జ్వాల మరింత బలపడింది. నా గొంతును ఎవరూ అణగ దొక్కలేరు. నేను బతికున్నంత వరకూ పోరాడుతూనే ఉంటా" అని స్వాతి మలివాల్ ట్వీట్ చేశారు. కాగా, స్వాతి మలివాల్‌ను వేధించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న క్యాబ్ డ్రైవర్ దక్షిణ ఢిల్లీ సంగమ్ విహార్‌లోని ప్రముఖ ఆప్ కార్యకర్త అని ఢిల్లీ బీజేపీ నాయకుడు వీరేంద్ర సచ్‌దేవ ఆరోపించారు. ఈ కేసులో నిందితుడు (47)ను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. నిందితుడిని హరీశ్ చంద్రగా గుర్తించారు.